ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
అనంతపురం
: fb.com/vaartha Digital
Published from Anantapur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
7-9-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 219 పేజీలు: 08+4 వెల: 6.50

కొత్త మ్యాప్‌కు కొంతవరకే మద్దతు..
5లో
మూడేళ్లలో డ్రగ్స్‌రహిత భారత్ లక్ష్యం


వజ్రకరూరు మండలంలో అరకొరగా ఉన్న కంది పంట ఎండిపోతున్న దృశ్యం

# కరవు రాయలసీమ

● ఎల్ నినో దెబ్బ... 47శాతం వర్షపాతం లోటు ● ఎండుతున్న పంటలు.. రైతన్నలు కన్నీళ్లు ● రోజురోజుకీ అడుగంటిపోతున్న భూగర్భజలాలు ● బోర్లు, బావుల కింద పంటలు, పండ్లతోటలపై ప్రభావం ● ఖరీఫ్ పంటలపై అన్నదాతల్లో సన్నగిల్లుతున్న ఆశలు ● పలుచోట్ల భూమి నుంచి పంటలు తీసేస్తున్న కరవు దృశ్యాలు

**అనంతపురం, సెప్టెంబరు 5 ప్రభాతవార్త బ్యూరో:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాయలసీమ జిల్లాలను వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావం తీవ్రంగా వెంటాడుతున్నాయి. నైరుతి రుతు పవనాల కాలంలో ఆశించిన రీతిలో వర్షాలు కురవకపోవడంతో సీమ వ్యాప్తంగా పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. కొన్ని ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం పెరిగిన పంటల పరిస్థితి దయనీయంగా ఉంది. సరైన వర్షాలు రాకపంటలు వాడుతున్నాయని, ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం రాకపోగా ఎండాకాలం ఉన్నట్లు ఎండలు ఉండడంతో పంటలు మరింత దెబ్బతింటున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో గుడిలకొచ్చి భజన చేసే వారే పల్చబడుతూ వచ్చారు. ఇప్పుడు వర్షాభావంతో గుళ్ళల్లో పూజలు వ్రతాలు, బొడ్రాయిలకు నీళ్ల పోయటం ఎక్కువయ్యాయి. వర్షం కోసం కళ్యాణదుర్గం ప్రాంతంలోని బెలుగుప్ప మండలంలో కొందరు రైతులు మరో అడుగు ముందుకేసి ఉదయం నుంచి రాత్రి వరకు ఆంజనేయులు స్వామి పటము నెత్తి మీద పెట్టుకుని ఐదారు గ్రామాల్లో భజనలు చేసి రాత్రికి ఇంటికి చేరుకున్నారు.

ఈ విధంగా పల్లెల్లో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగాఉంటే పట్టణాల్లోకూడా వ్యాపారాలు ఉండడంలేదని, వర్షం రాకపోవడమే దీనికి కారణం అని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఈ విధంగా సీమ జిల్లాల పరిస్థితి ధైర్యంగా ఉంది. ఆగస్టు నెలాఖరు వరకు నమోదైన వర్షపాతం వివరాలను పరిశీలిస్తే, సాధారణంగా పడాల్సిన 393 మిలీమీటర్ల వర్షపాతానికి గాను కేవలం 192 మిలీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. దాదాపు 47శాతం తీవ్ర వర్షపాతం లోటు నమోదు కావడంతో రైతాంగం తీవ్ర నిరాశలో కూరుకుపోయింది. ఖరీఫ్ ప్రారంభం నుంచి పదేపదే ఆకాశంవైపు మేఘాల కోసం ఎదురు >>2


ఉరవకొండ మండలంలో బోర్ ఎండిపోవడంతో నీరు లేక వేరుసెనగ పంటను తొలగిస్తున్న దృశ్యం



## పొగాకు రైతులకు భరోసా

మార్కెట్‌లో మెరుగైన పరిస్థితులు.. 'నోబిడ్స్'లు తగ్గుముఖం
కొనుగోలుదారుల పోటీతో మెరుగవుతున్న ధరలు
వేలం కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, సెప్టెంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 ఎఫ్‌సివి పొగాకు వేలాల్లో ఇటీవల మార్కెట్‌పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు, మార్గదర్శకత్వంతో పొగాకు రైతులకు మెరుగైన మార్కెట్, గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. తాను >>2

# ప్రయోజనకర నిర్ణయాలే

ప్రజోపయోగాలకే పెద్దపీట వేస్తాం
పెండింగ్ సమస్యలూ పరిష్కరిస్తాం
ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన
ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో హర్షాతిరేకాలు



**విజయవాడ, సెప్టెంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** పెన్షనర్లకు అత్యంత ప్రయోజనకరమైన నిర్ణయం. 70 యేళ్ళ పైబడిన పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ పెన్షన్ మంజూరు. ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక డిమాండ్‌లు అంగీకరించారు. పెన్షరుల విషయంలో సిఎం తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు, పెన్షనర్లుకు కలిగించిన ప్రయోజనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సామాజిక మాధ్యమంలో కీలక విషయం వెల్లడించారు.

"ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వలన రాష్ట్రంలోని వృద్ధాప్యంలో ఉన్న ప్రభుత్వ పెన్షనర్లకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. వయస్సు పెరిగే కొద్దీ వైద్య ఖర్చులు, ఇతర జీవన వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో అదనపు క్వాంటమ్ వారికి ఆర్థికంగా అండగా నిలుస్తుంద్ని అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జిఒ నంబర్ 1 ద్వారా కల్పించిన ప్రయోజనాలను సైతం కాపాడతామన్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పదవీ విరమణ వయసును 62యేళ్లకు పెంచాలని ఉద్యోగ సంఘాలు కోరాయన్నారు. ఈ అంశాన్ని కూడా త్వరలో పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పైనా చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. సచివాలయ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల అంశాన్ని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుతో పాటు సిపిఎస్‌కు ఆమోదయోగ్యమైన శాశ్వత పరిష్కారం కల్పిస్తామన్నారు. పిఆర్‌సి ఏర్పాటుచేసేలోగా ఐఆర్ ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నేతల డిమాండ్‌ను పరిష్కరిస్తామని చెప్పారు. పెన్షనర్లకు అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 70యేళ్ల దాటిన >>2



## జల వివాదాలు.. నేడు కీలక భేటీ

హస్తినలో తెలుగు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు
కెఆర్ఎంబి, జిఆర్ఎంబి అధికారులు సైతం ఢిల్లీకి
నాలుగు అంశాలు అజెండాలో ఎపి ప్రతిపాదన
కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జలవివాదాల సమన్వయ కమిటీ సమావేశం

**హైదరాబాద్, సెప్టెం బరు 6 ప్రభాతవార్త:** కృష్ణా, గోదావరి నది జలాల పంపిణీలో తెలుగురాష్ట్రాల మధ్య తరుచుగా తలెత్తు తున్న వివాదాల పరిష్కారం కోసం కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ చొరవ తీసుకొంది. జలవివాదాల సమసన్వయ సంఘం సమావేశంలో ఇరు రాష్ట్రాల ఇంజనీరింగ్ అధికారులతో పాటు కృష్ణా, గోదావరి నది యాజమాన్య బోర్డు అధికారులతో జలవివాదాల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నది. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న నది జలాలవివాదం ప్రాజెక్టుల నిర్వహణ సమస్యల పరిష్కారానికి కేంద్ర జలశక్తి >>2



## కొత్త పింఛన్లకు నేటి నుంచి దరఖాస్తులు

16 వరకు స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు కేంద్రాల్లో స్వీకరణ

**విజయవాడ, సెప్టెంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రతి నెలా జరిగే 'పేదల పండుగ'ను ప్రభుత్వం మరో స్థాయికి తీసుకువెళ్తోంది. ఇప్పటికే దేశంలోనే అత్యధిక స్థాయిలో సామాజిక భద్రత పింఛన్లు అందిస్తూ 62 లక్షల మంది పేదలకు ప్రతి నెలా ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఆ భరోసాను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. అర్హత కలిగిన మరింత మంది పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద తాజా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తుల పరిశీలన నుంచి అర్హత నిర్ధారణ, ప్రభుత్వ ఆమోదం వరకు ప్రతి ప్రక్రియను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసి, అర్హులైన వారికి దశలవారీగా పింఛన్లు మంజూరు చేయనున్నారు.

**కొత్త అర్హులకు మరో అవకాశం:**
అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాలతో ఇప్పటి వరకు పింఛన్ పొందని వారికి మరో అవకాశం కల్పిస్తోంది. సెప్టెంబర్ 7 నుంచి >>2

# ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ


ఉప్పాడ తీరంలో సర్వే ప్రారంభించిన ఐఐటి మద్రాస్

ఐదుగురు సభ్యుల నిపుణుల బృందం డ్రోన్ సర్వే షురూ
ఆధునిక సాంకేతికతతో బీచ్ ప్రొఫైల్, తీరాల మ్యాపింగ్
ఇసుక, మట్టి అవశేషాల నమూనాల సేకరణ, పరీక్షలు
సర్వే అనంతరం రక్షణ గోడ డిజైన్, డిపిఆర్ తయారీ
పర్యావరణ అనుమతుల ప్రక్రియ పూర్తి చేయాలి
అధికారులకు డి.సిఎం పవన్ కల్యాణ్ ఆదేశం

**విజయవాడ, సెప్టెంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉప్పాడ తీర ప్రాంతవాసుల దశాబ్దాల కల సాకారం దిశగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం దిశగా కీలక అడుగులు ప్రారంభమయ్యాయి. రక్షణ గోడ నిర్మాణానికి సాంకేతిక సహకారం అందించేందుకు ఒప్పందం చేసుకున్న ఐఐటి మద్రాస్ పనిని ప్రారంభించింది. రూ.323 కోట్లనేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్‌తో నిర్మితమవుతున్న ఈ రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి డిజైన్, డిపిఆర్ రూపకల్పన కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఐఐటి మద్రాస్ ప్రతినిధి బృందం అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో సముద్ర గర్భంలోనూ, తీరప్రాంతం వెంబడి సర్వే చేపట్టింది. తీర ప్రాంత ఇంజినీరింగ్, సముద్ర పరిశోధనల్లో విశేష అనుభవం కలిగిన ఐఐటి మద్రాస్ నిపు >>2



## ప్రాణాలు తీసిన కల్తీ మద్యం

మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో 12 మంది మృతి
మరో 25 మందికి పైగా తీవ్ర అస్వస్థత

**సాగర్ (ఎంపి), సెప్టెంబరు 6:** మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో కల్తీ మద్యం పెను విషాదాన్ని నింపింది. అనుమానాస్పద విషపూరిత మద్యం సేవించి 12 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 25 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపడంతో ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. ప్రభావిత గ్రామాల్లో వైద్య పరీక్షలు ప్రారంభించి, ముందు జాగ్రత్తచర్యగా పలు మద్యం దుకాణా >>2

## ఆదోనిలో దారుణం

పారిశుద్ధ్య కార్మికురాలిపై కారం చల్లి.. పెట్రోల్ పోసి సజీవదహనానికి యత్నం
వివాహేతర సంబంధం అనుమానాలతో తెల్లవారుజామున నడిరోడ్డుపై ఘాతుకం
బాధితురాలి పరిస్థితి విషమం.. నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు


బాధితురాలు నర్సమ్మ (ఫైల్)

**ఆదోని, సెప్టెంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** వివాహేతర సంబంధం అనుమానాలు రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. విధి నిర్వహణలో ఉన్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికురాలిపై కంట్లో కారం కొట్టి, పెట్రోల్ పోసి నిప్పంటించిన అత్యంత పాశవిక ఘటన ఆదోని పట్టణంలో కలకలం రేపింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, ఆదోని మున్సిపాలిటీ శానిటరీ విభాగంలో నర్సమ్మ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తోంది. తెల్లవారుజామున సుమారు 5:30 గంటల ప్రాంతంలో ఆదోని కొత్త బస్టాండ్ ప్రధాన ద్వారం ఎదుట ఆమె విధుల్లో భాగంగా రోడ్డు ఊడ్చుతోంది. అదే సమయంలో అక్కడికి చేరుకున్న రాములమ్మ, శిరీష, మరో మహిళతో పాటు ఓ వ్యక్తి ఒక్కసారిగా ఆమెపై దాడి చేశారు. క్షణాల వ్యవధిలోనే నర్సమ్మ కళ్లల్లో కారం చల్లి, వెంట తెచ్చుకున్న పెట్రోలును ఆమెపై పోసి నిప్పంటించి అక్కడి నుంచి పరారయ్యారు. నర్సమ్మ మంటల్లో చిక్కుకుని ఆర్తనాదాలు చేయడంతో తోటి కార్మికులు, స్థానికులు వెంటనే స్పందించి మంటలను ఆర్పేశారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స నిమిత్తం ఉన్నత >>2

## యువకుడి నిర్బంధం.. ఆపై తాళ్లతో కట్టి రోడ్డుపై ఊరేగింపు



ఐదుగురు నిందితులు అరెస్టు
హత్యాయత్నం, అట్రాసిటీ కేసు
విజయనగరం జిల్లాలో ఘటన

**విజయనగరం (భోగాపురం), సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా భోగాపురం మండలం రామచంద్రరాజుపేటకు చెందిన ఎల్లా రాజేష్ అనే వ్యక్తిని రాత్రంతా నిర్బంధించి, హింసించి, చంపడానికి ప్రయత్నించి, తాళ్ళతో కట్టి, బహిరంగంగా వీధుల్లో తిప్పిన ఘటనను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తీవ్రంగా పరిగణించి, సంఘటనా స్థలానికి చేరుకొని, నిందితులపై హత్యాయత్నం, అట్రాసిటీ సెక్షన్లతో కేసు నమోదు చేసి, బాధ్యులైన ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లుగా భోగాపురం పిఎస్‌లో ఎస్పీ వివరాలను వెల్లడించారు. రామచంద్రరాజుపేటకు చెందిన ఎల్లా రాజేష్ బైకు మెకానిక్ వెన్ను మహేష్ వద్ద బైకు కొనుగోలు చేసేందుకు నిర్ణయించి బైక్ ట్రైల్ రన్ నిమిత్తం తీసుకొని వెళ్లాడన్నారు. ఎల్లా రాజేష్ బైకు కొనుగోలు చేసిన డబ్బులు చెల్లించకుండా గత కొన్ని రోజులుగా తప్పించుకొని తిరుగుతూ, >>2



## దేశం దాటిపోకుండా.. చైనా కట్టడి!

టెక్నాలజీ, క్యాపిటల్, మానవ వనరులపై ఫోకస్
5లో



యాకిడి మండలంలో పత్తిపంట సరిగా రాకపోవటంతో భూమినుంచి తొలగిస్తున్న దృశ్యం

# తీర ప్రాంత రక్షణ గోడ

>> ఖుల బృందం గత వారం రోజులుగా ఉప్పాడ తీర ప్రాంతంలో క్షేత్రస్థాయి సర్వేలు చేపట్టింది. అధునాతన డ్రోన్లతోపాటు బీచ్ ప్రొఫైలింగ్, తీర ప్రాంతాల మ్యాపింగ్ కోసం ట్రింబుల్ ఆర్980 జిఎన్ఎస్ఎస్ ఆర్టీకే సాంకేతికతను వినియోగిస్తున్నారు. తీర ప్రాంత భౌగోళిక పరిస్థితులు, సముద్ర అలల ప్రభావం, తీర కోత తీవ్రత, భూభాగ మార్పులు, సముద్ర ప్రవాహాల దిశలు వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. నీటి అడుగు భాగం నుంచి బీచ్ వరకు ఇసుక కణాల సేకరణ, సమగ్ర అధ్యయనం సాగుతోంది. వీటితోపాటు ఉప్పాడ తీర ప్రాంతం వెంబడి ఇసుక, మట్టి అవశేషాల నమూనాలు సేకరించి, శాస్త్రీయ అధ్యయన ప్రక్రియ కొనసాగిస్తున్నారు. బాతిమెట్రిక్ సర్వే ద్వారా సముద్రపు లోతు, సీ బెడ్ స్థాయిలు, వాటి మార్పులను గుర్తిస్తున్నారు. బీచ్ ఆకృతి, వాలు, ఎత్తుపై అధ్యయనం కొనసాగుతోంది. షోర్‌లైన్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. తీర ప్రాంత కోతను అంచనా వేయడంలో ఈ అధ్యయనం కీలక పాత్ర పోషిస్తుంది. ఉప్పాడ సముద్ర తీరం వెంబడి ప్రతిపాదిత రక్షణ గోడ నిర్మాణానికి అనువైన అలైన్‌మెంట్‌ను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. భవిష్యత్తులో సముద్ర కోత ప్రభావాన్ని సమర్థవంతంగా, సుదీర్ఘకాలం ఎదుర్కొనే విధంగా డిజైన్ రూపకల్పనకు ఈ సర్వే ఉపయోగపడుతుంది. ఈ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఐఐటి మద్రాస్ ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి డిజైన్, డిపిఆర్ తదితర సాంకేతిక అంశాలపై దృష్టి సారించనుంది.

గత నాలుగు దశాబ్దాలుగా ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు సముద్ర కోత సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే వందల ఎకరాలు, పలు గ్రామాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. ఎంతో మంది నిర్వాసితులు కాగా, రైతులు వందల ఎకరాల పంట భూములను సైతం కోల్పోయారు. ఈ సమస్య పరిష్కారానికి నడుం బిగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సముద్ర కోత సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో చర్యలు చేపట్టారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఎ) ప్రతిపాదన మేరకు సి ప్రొటెక్షన్ వాల్, గ్రోయిన్ ఫీల్డ్, హోప్ ఐలాండ్ పరిసరాల్లో ప్రకృతి ఆధారిత తీర రక్షణ చర్యలు చేపట్టేందుకు ఆమోదం లభించింది. అందుకు అనుగుణంగా డిపిఆర్ రూపకల్పన పనులు ప్రారంభమయ్యాయి. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఈ పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పిఠాపురం పర్యటన సందర్భంగా డిజైన్, డిపిఆర్‌పై ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందంతో చర్చించనున్నారు. నిర్ణీత గడువు లోపు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా డిజైన్, డిపిఆర్ రూపకల్పన సమాంతరంగా పర్యావరణ, తదితర అనుమతుల ప్రక్రియ పూర్తి చేసి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

# ప్రయోజనకర నిర్ణయాలే

>> వారికి 10శాతం, 75యేళ్లు దాటిన వారికి 15శాతం అదనపు పెన్షన్ క్వాంటమ్‌ను 2027 జనవరి నుంచి అమలు చేస్తామన్నారు. ఆరోగ్య పథకంలో ఉద్యోగులు కోరిన మార్పును అంగీకరించామన్నారు. 12వ పిఆర్‌సి నియామకానికి ఆంగీకారం తెలియచేశామన్నారు. రెండు డిఎలను ఈ అక్టోబరు నుంచి ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. 2022 యేడాది సరెండర్ లీవ్‌ను సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాల్లో వేస్తామని తెలిపారు. పోలీసులకు ఈ దసరాకు అదనపు సరెండర్ లీవ్ ఇస్తున్నామని ప్రకటించారు. “ఉద్యోగులకు సంబంధించి ఉన్న పెండింగ్ బిల్లుల్లో ఇప్పటివరకు రూ.30,849 కోట్లు క్లియర్ చేశాం. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వడ్డీలకు అప్పులు తెచ్చింది. ఆర్థిక సంస్థలతో చర్చించి రూ.1.50 లక్షల కోట్ల మేర అప్పులపై భారీగా ఉన్న వడ్డీలను రీ షెడ్యూల్ చేసి తగ్గించుకోగలిగాం. ప్రస్తుతం సరాసరి 9.1 శాతం వడ్డీని ప్రభుత్వం అప్పులపై చెల్లిస్తోంది. ఈ భారాన్ని ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. విధ్వంసమైన వ్యవస్థలను నెమ్మదిగా గాడిన పెడుతున్నాం” అని సిఎం చంద్రబాబు వివరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ సానుకూలంగా ఉంటాం. ఆర్థిక వెసులుబాటు ఉంటే ఉద్యోగులకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

# కరవు రాయలసీమ

>> చూడటం సీమ రైతులకు నిత్యకృత్యంగా మారింది. అడపాదడపా కురిసిన తేలికపాటి జల్లులను నమ్ముకుని విత్తనాలు వేసినప్పటికీ, తగినంత తేమ లేక పైర్లు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. వేసిన భూముల్లోనూ దిగుబడులు భారీగా తగ్గుతాయని వ్యవసాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా రాయలసీమ ప్రధాన పంటలైన వేరుశనగ, పత్తి, కంది, మిరప, తదితర వాణిజ్య పంటలతో పాటు పండ్ల తోటల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది.

రాయలసీమ జిల్లాల్లో మొత్తం 15,03,613 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణానికి గాను ఇప్పటివరకు దాదాపు 11,74,351 హెక్టార్లలో మాత్రమే విత్తనాలు పడ్డాయి.. ప్రధాన పంటల సాగును పరిశీలిస్తే ఆగస్టు చివరి తేదీకి... వేరుశనగ పంట 87, 508 ఎకరాలు, పత్తి 56, 018 ఎకరాలు, కంది 3,22,559 ఎకరాలు పంట వేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 90177 ఎకరాలు, పత్తి 5384 ఎకరాలు, కంది 1,93,220 ఎకరాలు పంట వేశారు. చిత్తూరు జిల్లాలో పత్తి 5960 ఎకరాలు, కంది 10183 ఎకరాలు, తిరుపతి జిల్లాలో వరి 1,00,740 ఎకరాలు, వేరుశనగ 4386 ఎకరాలు, కంది 1,05,235 ఎకరాల్లో ఖరీఫ్లో పంట చేశారు. వైయస్సార్ కడప జిల్లాలో వరి 13,704 ఎకరాలు, పత్తి 17,322 ఎకరాలు, కంది 38,691 ఎకరాలు, కర్నూలు జిల్లాలో వేరుశనగ 49390 ఎకరాల్లో, పత్తి 5,48,846 ఎకరాలు, కంది 7,19,212 ఎకరాల్లో పంట వేశారు. ఈ విధంగా నంద్యాల జిల్లా, అన్నమయ్య జిల్లా తదితర జిల్లాల్లో సాగు విస్తీర్ణం పెరిగిన పంటల పరిస్థితి ఆశాజనకంగా లేదని, ప్రభుత్వం వివిధ రూపాల్లో ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

**అడుగంటిన భూగర్భజలాలు:**

వర్షాలు లేకపోవడంతో రాయలసీమలో భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం బోర్లల్లో నీటి ప్రవాహం తగ్గడంతో రాబోయే రోజుల్లో తాగు, సాగు నీటి ఎద్దడి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. అనంతపురంలో 16 నుంచి 20 మీటర్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 20 మీటర్లు,వైఎస్ఆర్ కడప జిల్లాలో 13 మీటర్లు, అన్నమయ్య జిల్లా లో 16 మీటర్ల దిగువకు నీటి మట్టాలు పడిపోయాయి. ఈ ఖరీఫ్ సీజన్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఉమ్మడి అనంతపురం, ఉమ్మడి కడప, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పళ్ళతోటలపై ఆధారపడ్డ రైతులు ఆందోళనలో పడ్డారు. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో చీని, దానిమ్మ, తదితర పండ్ల తోటలను ఎన్నో యేళ్లగా పెంచి పెద్దవి చేసుకున్నారు. ఇప్పుడు భూగర్భ జలం తగ్గడం, చెరువుల్లోకి నీళ్ల లేకపోవడం బోర్ల ద్వారా పండ్ల తోటలకు నీళ్ల ఇవ్వాలంటే ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. ఈ సందర్భంగా వర్షాభావ పరిస్థితుల్లో రాయలసీమ రైతులను ఆదుకునేందుకు వివిధ రూపాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలు ఆధారంగా శ్రీశైలం, తుంగభద్ర జలాశయాలకు వచ్చిన నీటిని తాగునీటి కోసం, పండ్ల తోటలను బతికించుకునేందుకు పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం.


# కొత్త పింఛన్లకు నేటి నుంచి దరఖాస్తులు

>> 16 వరకు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారు. అర్హులైన వారు తమకు సంబంధించిన స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తు స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఇకెవైసి ప్రక్రియ పూర్తయిన తరువాత నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం అర్హతను పరిశీలిస్తారు. జాప్యానికి తావులేకుండా స్పష్టమైన కాలపట్టికొత్త పింఛన్ దరఖాస్తుల ప్రక్రియలో పారదర్శకతతో పాటు వేగానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. ప్రతి దశకు స్పష్టమైన గడువు నిర్ణయించింది. సెప్టెంబర్ 7-16: దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఇకెవైసి ధ్రువీకరణ, సెప్టెంబర్ 17-21: సాధారణ అర్హత పరిశీలన. సెప్టెంబర్ 22-24: భౌతిక, శాఖాపరమైన ధ్రువీకరణ, అర్హత నిర్ణయం, సిఫారసు. సెప్టెంబర్ 25-26: సెర్ప్ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ. అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా పింఛన్లు మంజూరు చేస్తారు.

# తాళ్లతో కట్టి రోడ్డుపై ఊరేగింపు

>> సెప్టెంబరు 5న వెన్ను మహేష్, లెంకా శ్రీరామ్‌లకు పట్టుబడ్డాడు. నిందితులు లెంకా శ్రీరామ్, వెన్ను మహేష్‌లు ఎర్ర రాజేష్‌ను తన మెకానిక్ షెడ్‌లో రాత్రి నిర్బంధించి, హింసించి, డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 6 ఉదయం వరకు ఎర్ర రాజేష్ డబ్బులు చెల్లించకపోవడంతో మరో ముగ్గురు స్నేహితులు బొమ్మిడి వెంకటరావు ఏ.మహేష్, నమ్మి గోవింద్, వెన్ను అప్పారావు సహకారంతో అతడి చేతులను, మెడను తాళ్ళతో కట్టి, బహిరంగంగా వీధుల్లో త్రిప్పుతూ హల్‌చల్ చేశారు.

విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టి, బాధ్యులైన నిందితులపై కఠిన చర్యలకు ఆదేశించారు. విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఎస్.రాఘవులు, భోగాపురం రూరల్ సిఐ ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టి బాధ్యులైన ఐదుగురు నిందితులపై అట్రాసిటీ చట్టం, హత్యాయత్నానికి పాల్పడినట్లుగా సెక్షన్లతో కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఇటువంటి సంఘటనలకు పాల్పడినా, చట్టాన్ని ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ హెచ్చరించారు.



ఆదివారం వసంత కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి నారా లోకేష్

# వసంత్ కుమార్ కుటుంబానికి పార్టీ అండ

## కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి నారా లోకేష్

**చిత్తూరు, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** చిత్తూరులో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషిచేసిన వసంత కుమార్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు . ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు వసంత కుమార్ కుటుంబ సభ్యులను మంత్రి నారా లోకేష్ ఆదివారం పరామర్శించారు. వసంత కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించడానికి చిత్తూరు లోని లక్ష్మీ నగర్ కాలనీ లోని వసంత కుమార్ నివాసానికి వచ్చిన మంత్రి నారా లోకేష్ ఆయన సతీమణి శిల్ప పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి వసంత కుమార్ చేసిన సేవలు పార్టీ మరిచిపోలేదని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ వసంత కుమార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. మంత్రి లోకేష్ వెంట జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కిలారు రాజేష్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్ నాయుడు, గాలి భాను ప్రకాష్, డాక్టర్ కలికిరి మురళీమోహన్, డాక్టర్ విఎం థామస్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షణ్ముఖం రెడ్డి, తుడా చైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# జల వివాదాలు.. నేడు కీలక భేటీ

>> మంత్రిత్వశాఖ జనవరిలో ఏర్పాటు చేసిన కమిటి రెండో సమావేశం సోమవారం ఢిల్లీ జరుగనుండటంతో ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులు ఇప్పటికే ఢిల్లీ చేరుకొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగు అంశాలను అజెండాలో ప్రతిపాదించింది. జలశక్తిమంత్రి త్వశాఖ ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం సిడబ్ల్యుసి చైర్మన్ అధ్యక్షతన జరుగుతోంది. రెండు రాష్ట్రాల నీటిపారుదల/ జల వనరుల శాఖల కార్యదర్శులు పాల్గొననున్నారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కెఆర్ఎంబి) ఆమోదం లేకుండానే గతనెల 26న సాయంత్రం నాగార్జునసాగర్ కుడి కాలువకు ఆంధ్రప్రదేశ్ ఏకపక్షంగా నీటిని విడుదల చేయడంతో రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదం నేపథ్యంలో ఈ సమావేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది. దీనికి ప్రతిగా తెలంగాణ కూడా ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయడం ప్రారంభించింది. ఆరోజున పోటాపోటినా కుడి కాలువ నుంచి 7,380 క్యూసెక్కులు, ఎడమ కాలువ నుంచి తెలంగాణ 2,070 క్యూసెక్కుల నీటిని తీసుకుంటోంది. జనవరి 30న జరిగిన సెంట్రల్ వాటర్ కమిషన్ చైర్మన్ నేతృత్వంలోని జలశక్తి కమిటీ మొదటి సమావేశంలో, తదుపరి చర్చల కోసం రెండు రాష్ట్రాలు సపోర్టింగ్ డేటాతో పాటు సవివరమైన అజెండా అంశాలను సమర్పించాలని నిర్ణయించారు. అయితే, కమిటీ కార్యాలయం గురించి అనేక రిమైండర్‌లు ఉన్నప్పటికీ, రెండు రాష్ట్రాలు ఇంకా తమ వివరణాత్మక అజెండాను పంపలేదు. తదుపరి చర్యలపై చర్చించేందుకు రెండు రాష్ట్రాల నుంచి నలుగురు అధికారులు, కెఆర్ఎంబి, జిఆర్ఎంబి, ఎన్‌డబ్ల్యుడిఎ, సిడబ్ల్యుసి అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

# ప్రాణాలు తీసిన కల్తీ మద్యం

>> లను సీల్ చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సంబంధిత మంత్రి, అధికారులను వెంటనే ఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశించాను. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తాం. ఇలాంటి వాటిని మా ప్రభుత్వం ఎంతమాత్రం సహించదని ఆయన మీడియాకు తెలిపారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మరణాల నేపథ్యంలో జిల్లాలో అక్రమ, నకిలీ మద్యం అమ్మకాలపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. “బాంబే విస్కీ” పేరుతో ఓ నకిలీ బ్రాండ్‌ను విక్రయిస్తున్నారని, దీనిపై ఓ మద్యం కాంట్రాక్టర్ ఇటీవలే ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానిక కథనాలు పేర్కొంటున్నాయి. నాలుగు రోజుల క్రితం లైసెన్స్ పొందిన మద్యం కాంట్రాక్టర్లు సైతం ఎక్సైజ్ అధికారులతో జరిగిన సమావేశంలో నకిలీ మద్యం అమ్మకాలపై ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కల్తీ మద్యం సేవించి అస్వస్థతకు గురైన వారిలో తీవ్రమైన లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు తెలిపారు. శరీరం నీలంగా మారడం (సైనోసిస్), కండరాలు బిగుసుకుపోవడం వంటివి గమనించినట్లు చెప్పారు. ఇది మిథైల్ ఆల్కహాల్ పాయిజనింగ్ కావచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నట్లు చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ దేవేష్ పటేరియా తెలిపారు. ప్రస్తుతం 910 మంది మరణించినట్లు మాకు సమాచారం ఉంది. మా వైద్య బృందాలు మూడు గ్రామాల్లో ఇంటింటి సర్వే చేస్తున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత 24 నుంచి 48 గంటల్లో మద్యం సేవించి వాంతులు, తలనొప్పి, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి రావాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నౌరా, ఘుగ్రు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా అధికారులు ఆ ప్రాంతంలోని ఆరు మద్యం దుకాణాలను సీల్ చేసి, అనుమానాస్పద మద్యం నమూనాలను పరీక్షల కోసం సేకరించారు. అసలు ఈ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు సరఫరా చేశారనే కోణంలో పోలీసులు, పరిపాలన యంత్రాంగం దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలు అందిన తర్వాతే మరణాలకు కచ్చితమైన కారణాలు తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

# ఢిల్లీలో కుప్పకూలిన హాస్టల్ భవనం

- శిథిలాల కింద పలువురు పేయింగ్ గెస్ట్ విద్యార్థులు
- ఇద్దరుమృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 6:** దేశ రాజధాని ఢిల్లీలోని సత్యనికేతన్ ప్రాంతంలో ఇవాళ మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్కే పురం నియోజకవర్గ పరిధిలోని స్థానిక శివ మందిరం సమీపంలో ఉన్న ఒక బహుళ అంతస్తుల పాత భవనం అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. ఈ భారీ ప్రమాద సమయంలో భవనంలో ఉన్న పేయింగ్ గెస్ట్ వసతి గృహానికి చెందిన పలువురు విద్యార్థులతో పాటు, అక్కడ పనులు చేస్తున్న కొంతమంది నిర్మాణ కార్మికులు కూడా శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది.ప్రాథమిక సమాచారం ప్రకారం ఇద్దరు మృతిచెందగా మరో ఐదుగురు తీవ్ర గాయాలతో ఉన్నట్లు తేలింది. శిథిలాల కిందచిక్కుకున్న విద్యార్థులు తమ సెల్‌ఫోన్లద్వారా బయటివ్యక్తులకు కాల్‌చేసి తమను కాపాడాలని వేడుకుంటున్న నినాదాలు ప్రత్యక్ష సాక్షులకు వినిపించాయి. వెంటనే ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర విభాగాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రస్తుతం ఎన్డీఆర్ఎఫ్, ఢిల్లీ విపత్తు నిర్వహణ సంస్థ (డీడీఎంఏ), ఢిల్లీ పోలీస్, ఎంసీడీ బృందాలు సంయుక్తంగా రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద ఉన్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా పక్కనే ఉన్న మరో నివాస భవనాన్ని కూడా అధికారులు ఖాళీ చేయించారు. ప్రమాద స్థలాన్ని సందర్శించిన స్థానిక బిజెపి ఎమ్మెల్యే అనిల్ కుమార్ శర్మ మీడియాతో మాట్లాడుతూ, వివిధ రాష్ట్రాల నుంచి ఢిల్లీకి ఉన్నత చదువుల కోసం వచ్చి ఇక్కడ పీజీ వసతి గృహాలలో నివసిస్తున్న విద్యార్థులు ఈ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. శిథిలాల లోపలి నుంచి కొందరు విద్యార్థులు ఫోన్ కాల్స్ చేస్తూ తమను కాపాడాల్సిందిగా వేడుకుంటున్నారని ఆయన వెల్లడించారు. ఈ ప్రమాదంపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా స్పందించారు. బాధితులను సురక్షితంగా రక్షించడం, వారికి తక్షణ సహాయం అందించడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని తెలిపారు. ఈ పాత భవనంలో నిబంధనలకు విరుద్ధంగా బేస్‌మెంట్ నిర్మాణం, ఆధునీకరణ పనులు చేపడుతుండటమే ఈ ఘోర ప్రమాదానికి దారితీసినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది.

# పొగాకు రైతులకు భరోసా

>> కూడా పొగాకు వేలం ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబరు 4నాటికి 86.59 మిలియన్ కిలోల ఎఫ్‌సివి పొగాకు మార్కెట్ అయిందని మంత్రి తెలిపారు. ప్రస్తుత సీజన్‌కు అనుమతించబడిన పంట పరిమాణం 142 మిలియన్ కిలోలు కాగా, అంచనా ఉత్పత్తి సుమారు 236 మిలియన్ కిలోలుగా ఉందన్నారు. ఇప్పటి వరకు నమోదైన సగటు ధర కిలోకు రూ.209.83గా ఉందని వెల్లడించారు. గత ఏడాది ఇదే 132 వేలం రోజుల నాటికి 140.27 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ కాగా, తుది సగటు ధర కిలోకు రూ.248.86గా నమోదైందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది అధిక ఉత్పత్తి కారణంగా మార్కెట్‌లో సర్ప్లస్ ఏర్పడటంతో కొంత ఒత్తిడి నెలకొన్నప్పటికీ, ఇటీవల వేలాల్లో కొనుగోలుదారుల స్పందన, పోటీ గణనీయంగా మెరుగుపడుతున్నాయని తెలిపారు.

**తగ్గుతున్న ‘నోబిడ్లు.. పెరుగుతున్న కొనుగోలుదారుల పోటీ:**

ఇటీవల వేలం కేంద్రాల్లో ‘నోబిడ్ బేల్స్ శాతం గణనీయంగా తగ్గిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రస్తుతం రోజువారీగా సగటున 11-12 శాతం వరకు ‘నోబిడ్లు నమోదవుతున్నాయని, కొన్ని వేలం ప్లాట్‌ఫారమ్‌లలో ఇది 1-2 శాతం కంటే కూడా తక్కువగా ఉందన్నారు. ‘నోబిడ్లు తగ్గడం, కొనుగోలు కార్యకలాపాలు పెరగడం, కొనుగోలుదారుల మధ్య పోటీ మెరుగుపడటం మార్కెట్‌లో సానుకూల సంకేతాలని మంత్రి అన్నారు. ప్రస్తుతం వారానికి సుమారు 10మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ అవుతోందని తెలిపారు. కొనుగోలుదారుల మధ్య పెరుగుతున్న పోటీ మెరుగైన ధరల సాధనకు దోహదపడుతోందన్నారు. ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో అత్యధికంగా కిలోకు రూ.329 వరకు ధర లభించిందన్నారు. ఎస్ఎల్ఎస్‌లో అత్యధికబిడ్ రూ.255, ఎస్‌బిఎస్‌లో రూ.252గా నమోదైందని వెల్లడించారు. డిమాండ్ ఉన్న గ్రేడ్లు, రకాల పొగాకుకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి స్పందన లభిస్తోందన్నారు. గత నెల రోజులుగా ఎస్ఎల్ఎస్, ఎస్‌బిఎస్ ప్రాంతాల్లో కొనుగోలు వేగం, ధరల సాధన వేలం ప్రారంభ దశతో పోలిస్తే మెరుగుపడ్డాయని చెప్పారు.

పొగాకు పంట మార్కెటింగ్ ప్రక్రియను టొబాకో బోర్డు ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు, తయారీదారులు, ఎగుమతిదారులు, వ్యాపార ప్రతినిధులతో సమన్వయం చేస్తూ కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామన్నారు. వేలాల్లో కొనుగోలుదారులు నిరంతరం పాల్గొనేలా చూడటం, మార్కెటబుల్ పొగాకును కొనుగోలు చేయడం, నివారించగల ‘నోబిడ్లను తగ్గించడం, కొనుగోలు షెడ్యూల్‌ను క్రమబద్ధంగా కొనసాగించడం, పంటను త్వరితగతిన మార్కెట్ చేయడం వంటి అంశాలపై వ్యాపార వర్గాలతో చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యాపార వర్గాల ప్రతినిధులతో మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేశామని, సీనియర్ అధికారులు వేలం ప్లాట్‌ఫారమ్‌లను సందర్శిస్తూ క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని మంత్రి వివరించారు.

**వచ్చే యేడాది పంట పరిమాణం భారీగా తగ్గింపు:**

ప్రస్తుత సీజన్‌లో అనుమతించబడిన పంట పరిమాణం, వాస్తవ ఉత్పత్తి మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడటంతో మార్కెట్‌లో అధిక పరిమాణంలో పొగాకు అందుబాటులోకి వచ్చిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. దీనివల్ల మార్కెట్‌పై ఒత్తిడి ఏర్పడిందన్నారు. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని 2026-27 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌లో ఎఫ్‌సివి పొగాకు అనుమతించబడిన పంట పరిమాణాన్ని 142 మిలియన్ కిలోల నుంచి 81 మిలియన్ కిలోలకు తగ్గించినట్లు మంత్రి తెలిపారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని నియంత్రించడం, భవిష్యత్తులో అధిక మార్కెటబుల్ సర్ప్లస్ ఏర్పడకుండా చూడటం ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమన్నారు. వచ్చే యేడాది రైతులు అనుమతించబడిన పంట పరిమాణానికి మాత్రమే పరిమితమై సాగు చేసేలా టొబాకో బోర్డు ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆయన మార్గదర్శకత్వంలో పొగాకు రైతులకు మెరుగైన మార్కెట్, న్యాయమైన ధరలు అందేలా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. వేలం ప్రక్రియ పూర్తయ్యే వరకు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

## వారం - వర్జ్యం

07-09-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి. ఏకాదశి సా.5.05. న. పునర్వసు సా.6.14
వ.ఉ.7.03 - ఉ.8.33. 2) రా.1.43 - రా. 3.13
దు.1.మ. 12.24 -మ. 1.13. 2) మ.2.58 - మ.3.47
రాహు. ఉ.7.30-ఉ.9.00.
శుభ స. ఉ.5.00 - ఉ. 6.00.

## వార్తాఫలం

**మేషం :** పనులు నత్తనడకన సాగుతాయి. ఇంటా బయటా చికాకులు ఎదురైనా అధిగమిస్తారు. కోపతాపాలకు దూరంగా వుండండి.

**వృషభం :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. వివాదాలకు దూరంగా వుండండి. క్రయవిక్రయాలలో లాభాలు.

**మిథునం :** విందు, వినోదాల్లో చురుకుగా సాగుతారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. వివాహ యత్నాలు సాగిస్తారు.

**కర్కాటకం :** పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆర్థిక ప్రగతి సాధిస్తారు. ప్రముఖులతో పరిచయాలు. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు.

**సింహం :** శ్రమ పడ్డా ఫలితం కనిపించదు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అధిగమిస్తారు. ఋణాలు కొంత వరకు తీరుస్తారు.

**కన్య :** రాబడి కంటే ఖర్చులు అధికంగా వుంటాయి. పనుల్లో ఆటంకాలు కొంత వరకు తొలగుతాయి. ఆరోగ్య సమస్యలు కొంత వరకు తీరును.

**తుల :** కొత్తవ్యక్తులు పరిచయమై నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**వృశ్చికం :** మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారదశ చేరుకుంటాయి. ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి. వస్తు సేకరణ.

**ధనుస్సు :** ప్రముఖులనుండి ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తివృద్ధి చెందుతుంది. పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు.

**మకరం :** కుటుంబసభ్యులతో ఏర్పడిన మాటపట్టింపులు తొలగుతాయి. ఆరోగ్యం పట్ల మెలకువ చాలా అవసరం. శ్రమాధికం.

**కుంభం :** కొత్త వ్యక్తులు పరిచయమై నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. ముఖ్యవ్యవహారాలలో విజయం సాధిస్తారు. నూతన వస్తు సేకరణ.

**మీనం :** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆదోనిలో దారుణం

>> ఆసుపత్రికి తరలించాలని వైద్యులు బంధువులకు సూచించారు. సమాచారం అందుకున్న ఆదోని మున్సిపల్ కమిషనర్ నయీం మహమ్మద్ ఆసుపత్రికి చేరుకుని నర్సమ్మను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు.

**పాత కక్షలతోనే పక్కా వ్యూహం:**

నర్సమ్మ భర్త శ్రీనివాస్ రెండేళ్ల క్రితం మృతి చెందగా, ఆమె తన ముగ్గురు పిల్లలను పోషించుకునేందుకు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా చేరింది. అయితే శిరీష భర్త చిన్న ఈరన్నతో నర్సమ్మకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఇరువర్గాల మధ్య విభేదాలు మొదలయ్యాయి. గత ఫిబ్రవరిలో తన ఇంటిపైకి వచ్చి దాడి చేశారంటూ శిరీష, రాములమ్మ, హేమలపై నర్సమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆ వివాదం లోక్ అదాలత్‌లో రాజీకి వచ్చింది. కాగా, జూన్ నెలలో చిన్న ఈరన్న తీవ్ర కడుపునొప్పితో మరణించడంతో క్రైమ్ నం. 142/2016 ఆ కుటుంబంలో కక్షలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఈ క్రమంలోనే ఈరన్న మరణానికి, కుటుంబ కలహాలకు ప్రతీకారంగా పక్కా పథకం ప్రకారమే ఈ దాడికి పాల్పడినట్లు ఆదోని టూ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితురాలి వాంగ్మూలం మేరకు రాములమ్మ, శిరీష, సుజాత, ఈరన్న సహా ముగ్గురు మహిళలు, మరో వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# కావలి టోల్‌ప్లాజా వద్ద అర్ధరాత్రి ఎసిబి అధికారులు ఆకస్మిక తనిఖీలు

## రూ.2.48 లక్షలు నగదు స్వాధీనం

**కావలి (నెల్లూరు), సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా కావలి సమీపంలోని ముసునూరు టోల్ ప్లాజా వద్ద శనివారం అర్ధరాత్రి ఎసిబి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జాతీయ రహదారిపై వాహనదారుల నుండి అక్రమంగా వసూలు చేస్తున్నట్లు భారీగా ఫిర్యాదులు రావడంతో ఎసిబి అధికారులు కావలి పరిధిలోని రవాణా శాఖ పై ఫోకస్ పెట్టింది.

టోల్ ప్లాజా వద్ద రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి గోపినాయక్ తనిఖీలు నిర్వహిస్తుండగా ఫిర్యాదులపై నిఘా పెట్టిన నెల్లూరు ఎసిబి డిఎస్పి రామకృష్ణుడు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి గోపి నాయక్ పై మెరుపు దాడులను నిర్వహించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వాహనం నుండి రూ.2,48,800లు నగదును స్వాధీనం చేసుకుని నగదును సీజ్ చేశారు. జిల్లా రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ గోపినాయక్‌తో పాటు లారీ డ్రైవర్, ఇద్దరు హోంగార్డులను అదుపులోకి తీసుకొని ఎసిబి డిఎస్పీ రామకృష్ణుడు విచారిస్తున్నారు.

7-9pg3exHMNWJQEGOK.qxd:7-9pg3exHMNWJQEGOK.qxd 07/09/26 12:03 AM Page 1



# ఎపిలో మళ్లీ వర్షాలు

**● 5 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ● ఆ జిల్లాల్లో పిడుగులతో భారీ వర్షాలు**

**విజయవాడ, సెప్టెంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితుల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో పాటు బంగాళా ఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనాల కదలికల కారణంగా రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇవాళ, రేపు పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించారు. ముఖ్యంగా ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై ఉండే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. రాబోయే మూడు గంటలు ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఏలూరు, నూజివీడు, ఆగిరిపల్లి, గన్నవరం, మైలవరం, నున్న, విజయవాడ పరిసర ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తు న్నారు. వర్షాలు, పిడుగుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. ముఖ్యంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాల వద్ద ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు తెలంగాణలో కూడా ఇవాళ, రేపు వాతావరణం మేఘావృతమై ఉంటుందని అధికారులు చెప్పారు. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. అదిలాబాద్, నిర్మల్, మంచి ర్యాల, కొమరం భీమ్ ఆసిఫాబాద్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబా బాద్, ఖమ్మం జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మేడ్చల్ మల్కాజిగిరి, నల్గొండ, రంగారెడ్డి, సూర్యాపేట, మహబూబ్ నగర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశాలు ఉన్నాయి. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెప్పారు.

# ప్రజాప్రతినిధులకు నాయకత్వ పటిమపై శిక్షణ

**● నేడు, రేపు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో కాంక్లేవ్**




**విజయవాడ, సెప్టెంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలకు నాయకత్వ పటిమ పెంపొందించే అంశంపై రెండు రోజుల ట్రైనింగ్ కాంక్లేవ్‌ను టిడిపి నిర్వహిస్తోంది. ఈ నెల 7, 8వ తేదీల్లో మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల పాటు లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్‌ను నిర్వహించనుంది. రెండు రోజుల్లో 10 సెషన్లల్లో ఈ కాంక్లేవ్ జరగనుంది. ట్రైనింగ్ ఇంటరాక్టివ్ విధానంలో లీడర్‌షిప్ కాంక్లేవ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో టిడిపి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేలా కాంక్లేవ్ నిర్వహించేలా మంత్రి, టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రణాళికలు రచించారు. ఈ కాంక్లేవ్‌కు చంద్రబాబు, లోకేశ్ హాజరు కానున్నారు. క్షేత్రస్థాయి యంత్రాంగం, కేడర్ సమన్వయం, పొలిటికల్ రెస్పాన్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్ వంటి అంశాల్లో నేతల సామర్థ్యాలను మెరుగుపరిచేలా రెండు రోజుల పాటు ట్రైనింగ్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ప్రభుత్వం- ప్రజలకు వారధిగా పార్టీ నేతలు ఉండాలని చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై కాంక్లేవ్‌లో చంద్రబాబు అవగాహన కల్పించనున్నారు. ప్రభుత్వం టిడిపి చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం... ప్రత్యర్థి పార్టీల కుట్రలను ఎండగట్టడం వంటి అంశాలపై కాంక్లేవ్‌లో కీలకంగా చర్చించనున్నారు.

ఈ సమావేశానికి మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలతో సహా ముఖ్య నేతలు హాజరు కానున్నారు. మొదటి రోజున నాయకత్వ అభివృద్ధి, నాయకులను తీర్చిదిద్దడం, సరైన స్థానంలో నిలబెట్టడం పార్టీ సంస్థాగత నిర్మాణం, అజెండా, పనితీరు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం స్వర్ణాంధ్ర విజన్ రాజకీయ, ఆర్థిక సాధికారత సంపూర్ణ సంక్షేమం, సాధికారత అంశాలపై చంద్రబాబు, లోకేశ్ మార్గనిర్దేశం చేయనున్నారు. రెండో రోజున సుస్థిర అభివృద్ధి, ప్రజా సేవలు, సుపరిపాలన, పొలిటికల్ కమ్యూనికేషన్ ప్రజలకు సేవల చేరువ, ఎల్‌నినోపై అవగాహన, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత అంశాలపై చంద్రబాబు, లోకేశ్ దిశానిర్దేశం చేయనున్నారు.

## కోనసీమలో భార్యాభర్తల ఆత్మహత్య

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం శివారు కొత్త కాలనీలో భార్యాభర్తలు ఆత్మహత్యలు చేసుకున్న దుర్ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈవిషాద ఘటన తో స్థానికంగా కలకలం రేపింది. కర్రి నాగేశ్వరరెడ్డి (49), కర్రి దుర్గాలక్ష్మి (42) దంపతులు ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందారు. చీటీ పాటల వ్యాపారం నిర్వహిస్తున్న ఈ దంపతులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇటీవల ఇదే కాలనీలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటనకు సంబంధించి వీరిపై ఆరోపణలు ఉన్నాయి. దంపతులు రాసినట్లు భావిస్తున్న సూసైడ్ నోట్ పోలీసులకు లభించినట్లు సమాచారం. ఓ మహిళకు తాము సుమారు రూ.కోటి అప్పుగా ఇచ్చామని, ఆ మొత్తం తిరిగి రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమకు రావలసిన సొమ్మును రాబట్టి, బాకీలు చెల్లించాలని అందులో కోరినట్లు తెలుస్తుంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మధ్యాహ్నం సమయంలో పిల్లలను బయటకు పంపి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుంది. సమాచారం అందుకున్న రావులపాలెం అర్బన్ సిఐ రమేష్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. సూసైడ్ నోట్ నిజమైనదేనా, అందులోని అంశాలు ఎంతవరకు వాస్తవమనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

## పిడుగుపాటుకు రైతు మృతి.. డి.సిఎం విచారం

**విజయవాడ, సెప్టెంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని యు.కొత్తపల్లి మండలం, పాత ఇసుకపల్లి గ్రామంలో పిడుగుపాటుకు గురై రైతు పి. నూకరాజు మృతి చెందాడు. ఈ ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఆదివారం సాయంత్రం నూకరాజు తన కుమారుడితో కలిసి పొలం పనుల్లో ఉండగా పిడుగుపాటుకు గురైనట్లు, ఈ ఘటనలో నూకరాజు అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన కుమారుడు తీవ్రంగా గాయపడినట్లు కలెక్టర్ తెలిపారు. మృతుడి కుటుంబానికి తక్షణమే ప్రభుత్వం నుంచి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని, గాయపడిన కుమారుడికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. నూకరాజు కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వర్షాలు కురిసే సమయంలో పొలం పనుల్లో ఉన్న రైతులు, అలాగే బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ప్రజలు తక్షణం సురక్షిత ప్రాంతాలను ఆశ్రయించే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## తక్షణమే డ్రాట్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

**● ప్రత్యేక కరవు సహాయ ప్యాకేజీని వెల్లడించాలి**

**● వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవిఎస్ నాగిరెడ్డి**

**విజయవాడ, సెప్టెంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డ్రాట్ ఎమర్జెన్సీని డిక్లేర్ చేయడంతోపాటు ప్రత్యేక కరువు సహాయ ప్యాకేజీని ప్రకటించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం, రైతు సంక్షేమం) ఎంవిఎస్ నాగిరెడ్డి డిమాండ్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 54.73 శాతం లోటు వర్షపాతం నమోదైందని, 28 జిల్లాల్లోనూ లోటు వర్షపాతమే ఉందని, 685 మండలాలకు గాను 653 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. దేశంలోని ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో సాగు పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని, వర్షాధార పంటలైన వేరుశెనగ, పత్తి, మొక్కజొన్న, జొన్న, చిరుధాన్యాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేస్తూ, పంట నష్టపోయిన రైతులను గుర్తించి ఎకరాకు నష్టపరిహారం అందించాలని, ఆ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా బకాయిలు, సున్నా వడ్డీ రాయితీ, అన్నదాత సుఖీభవ బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. రైతులకు భరోసా కల్పించేందుకు ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, సాగునీటి లభ్యతను సమర్థంగా వినియోగించి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

# దుర్గమ్మ గుడిలో వేదోక్తంగా సూర్యోపాసన



**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా సూర్య ఉపాసన ఆదివారం జరిగింది. మహాసౌరం, అరుణం, ఆదిత్యహృదయం, సూర్యాష్టకం, సూర్యస్తుతిలను స్వరబద్ధంగా పండితులు పఠిస్తుండగా అర్చకస్వాములు పూజాదికాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** ఇంద్రకీలాద్రి, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథక విభాగమునకు విజయవాడకు చెందిన దావులూరి ప్రభాకరరావు కుటుంబసభ్యులతో కలిసి రు.1,00,005ల విరాళం ఆదివారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందించారు. విజయవాడకు చెందిన బొప్పన దుర్గావెంకట్ తమ కుటుంబ సభ్యులతో కలిసి రు.1,00,005ల విరాళం చైర్మన్‌కు అందించారు. మచిలీపట్నంకు చెందిన టి.తారకరామారావు రు.1,16,000ల విరాళం ఆదివారం డిప్యూటి ఇఒ కిషోర్ కుమార్‌కు అందించారు. దాతలకు అమ్మవారి చిత్ర పటమును అందచేసి దర్శన ఏర్పాట్లు గావించారు. దర్శనానంతరం దాతలకు ఆలయ వేద పండితులు వేదాశీర్వచనం, ప్రసాదం అందజేశారు.



# స్మార్ట్ మీటర్ ప్రాజెక్టులో అక్రమాలు

**● న్యాయ విచారణ జరపాలి ● సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్**




**విజయవాడ, సెప్టెంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యవసాయ స్మార్ట్ మీటర్ల ప్రాజెక్టులో అక్రమ చెల్లింపులపై న్యాయవిచారణ జరిపి డబ్బులు తిరిగి రాబట్టాలని సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు చేసుకున్నందుకు పరిహారంగా రూ.764 కోట్లు ఎపిఎస్పిడిసిఎల్ షిర్డీసాయి కంపెనీకి అక్రమంగా చెల్లించిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) అనుమతి లేదని, దీనిపై బహిరంగ విచారణ కూడా జరపకుండా రహస్యంగా డబ్బులు చెల్లించారని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించేందుకు వైసిపి హయాంలో షిర్డీ సాయి ఎలక్ట్రికల్‌తో ఒప్పందం కుదిరిందని తెలిపారు. మీటర్లు పెట్టకముందే రూ.1800కోట్లు అక్రమంగా షిర్డీసాయి ఎలక్ట్రికల్ కంపెనీకి గత ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు. ఈ అంశంపై రైతు సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించి పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించడంతో మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని నిలిపివేశారని తెలిపారు.

ఈ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా టిడిపి నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానానికి భిన్నంగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ ఒప్పందం రద్దు కోసం అదే షిర్డీసాయి ఎలక్ట్రికల్ కంపెనీకి రూ.764కోట్లు చెల్లించడం అక్రమం అన్నారు. ఇంత రహస్యంగా చెల్లించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు.

మూడు డిస్కంలకు షిర్డీసాయి కంపెనీకి మీటర్లు, అనుబంధ, సాఫ్ట్‌వేర్ ఖర్చుల పేరుతో సుమారు రూ.2500 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. తిరిగి ఈ భారాన్ని ప్రజలపైనే మోపుతారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్‌మీటర్లు, సెకీ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వాటినే కొనసాగిస్తోందని విమర్శించారు. అనధికారికంగా ఎన్ని లావాదేవీలు జరిగితే ఇన్ని వేల కోట్ల రూపాయలు ఈ కంపెనీకి చెల్లించారని అనుమానం వ్యక్తం చేశారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని రద్దు చేసుకున్న ఒప్పందాన్ని బయటపెట్టాలని, ఎంత డబ్బులు చెల్లించారో చెప్పాలని కోరారు.

**కోర్టులో ఉండగానే ఎలా చెల్లిస్తారు: బాబూరావు**

షిర్డీసాయి ఎలక్ట్రికల్ చెల్లింపులపై గతంలో కోర్టులో పిటిషన్ వేసిన టిడిపి నాయకులు ఇప్పుడు ఆ అంశం పెండింగ్‌లో ఉండగానే డబ్బులు ఎలా చెల్లిస్తారని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు ప్రశ్నించారు. 6శాతం అదనంగా అంచనాలు పెంచి షిర్డీ సాయి కంపెనీకి వ్యవసాయ పంపుసెట్ల కాంట్రాక్ట్ అప్పగించారని టిడిపి కోర్టులో పిటిషన్ వేసిందన్నారు. అక్రమ ఒప్పందం అని చెప్పిన టిడిపి ఆ అక్రమ ఒప్పందానికి నష్ట పరిహారం పేరుతో మీటర్లు సప్లై చేయకుండా రూ.764కోట్లు ఎందుకు చెల్లించారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఇప్పటివరకు చేసిన చెల్లింపులు అన్ని తిరిగి రాబట్టాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్వతంత్రమైన న్యాయ విచారణ తప్పనిసరిగా జరిపించి వాస్తవాలను బయటికి తీసుకురావాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందన్నారు.

## విశాఖ జడ్పీ మూడుగా విభజన

**విజయవాడ, సెప్టెంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ ఇక నుంచి మూడు జిల్లాల పరిధిలో సేవలు అందించనుంది. ఈ మేరకు ఎపి ప్రభుత్వం శనివారం జిఒ నంబర్ 114ను విడుదల చేసింది. ఏయే మండలాలు ఏయే జిల్లాల పరిధిలోకి వెళ్తాయనే విషయాన్ని స్పష్టంగా ఇందులో తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాలకు వేర్వేరుగా జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసింది.

ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 13 జడ్పీలకు 13 మంది సిఇఒలు ఉన్నారు. కొత్తగా వచ్చిన మరో 15 జడ్పీలకు సిఇఒ, డిప్యూటీ సిఇఒ పోస్టులను సృష్టించారు.

ఇక నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు వేర్వేరుగా సిఇఒలు, డిప్యూటీ సిఇఒలు ఉండనున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా 2022లో మూడుగా విడినప్పటికీ జిల్లా పరిషత్ మాత్రం వేరు కాలేదు. జడ్పీ పాలక వర్గం గడువు ఈ నెల 27 వరకు ఉంది.

ఇంతకాలం ఉమ్మడి జిల్లాగానే జడ్పీ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్‌లను పునర్విభజిస్తూ ఉత్తర్వులు వెలువడడంతో ఇక నుంచి మూడు జిల్లాలుగా కొనసాగనున్నాయి.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలి



**బుచ్చి (నెల్లూరు), సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బుచ్చిరెడ్డిపాళెంలో పార్టీ కార్యాలయంలో నాయకులతో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు స్థానిక ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహం వార్డుల వారీగా పార్టీని బలోపేతం చేయాలని ఆమె సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో అనూహ్య అభివృద్ధిని సాధించామని ఆమె తెలిపారు. వవ్వేరు గ్రామానికి చెందిన అల్లం శ్రీనయ్యతోపాటు ఆయన అనుచరులు 10 మంది ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, సీనియర్ నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యం నాయుడు, క్లష్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు, టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, రూరల్ అద్యక్షులు జగదీష్, సీనియర్ నాయకులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, పార్టీ మెంటరీ ఉపాధ్యక్షులు ఎం.వి శేషయ్య, బత్తల హరికృష్ణ, కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ, కౌన్సిలర్ బెల్లం మల్లారెడ్డి, వైస్ చైర్మన్ పఠాన్‌నస్రీన్, జొన్నలగడ్డ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాల్ బ్యాట్‌మెంటన్ విజేతలకు అవార్డుల ప్రదానం



**అల్లూరు (నెల్లూరు), సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** అల్లూరులోని రామక్రిష్ణ జూనియర్, డిగ్రీ కళాశాలలో 12వ సీనియర్ అంతర్‌జిల్లాల బాల్‌బ్యాట్‌మెంటన్ పోటీలు గత మూడు రోజులుగా నిర్వహించారు. ఈ పోటీలకు ఆదివారం ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధృడత్వానికి మాత్రమే కాకుండా జీవితంలో క్రమశిక్షణ, పట్టుదలను నేర్పుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగిఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ స్థాయికి చేర్చడమే మనందరి లక్ష్యం అన్నారు. ఈ పోటీలు ఎపి బాల్‌బ్యాట్‌మెంటన్ అసోసియేషన్(సాప్), ఎస్‌పిఎస్‌ఆర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతేకాకుండా క్రీడాస్ఫూర్తిని విద్యార్థులు కలిగి ఉండాలన్నారు. ప్రతి క్రీడాకారుడు మైదానంలో చూపించే పట్టుదలే మిమ్మలను భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు తీసుకెలుతుందని తెలిపారు. క్రీడాకారులు టీమ్‌వర్క్ సమిష్టి కృషి ఎంతో అవసరం అన్నారు. రాష్ట్ర క్రీడాకారులు కేవలం రాష్ట్రానికే పరిమితం కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలల్లో పాల్గొని దేశానికి, పుట్టిన ఊరుకు మంచి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు. క్రీడాకారుల ఎదుగుదలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. అనంతరం పురుషుల విభాగం ప్రకాశం జిల్లా టీమ్ రన్నర్స్, వైజాగ్ టీమ్ మహిళల విభాగం విన్నర్స్‌గా, గుంటూరు జిల్లా టీమ్‌లకు ఎమ్మెల్యేచే మెమోంటోలు, అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మల్లమ్మ చెరువులో పట్టాలంటూ కబ్జా

**● రెవెన్యూ అధికారుల మాయాజాలంతో రెచ్చిపోతున్న కబ్జాదారులు**


**● సమాచార హక్కు చట్టంతో బయటపడిన బాగోతం**



**రాజాం (విజయనగరం జిల్లా), సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** రాజాం మున్సిపాలిటీలో భూమికి ధరలు పెరిగిపోవడంతో చెరువులను, గుట్టలను, ప్రభుత్వ భూములను అని లెక్క చేయకుండా ఓ అధికారి పార్టీకి చెందిన నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కొంతమంది అధికార పార్టీ నాయకులు ఆర్టీసీ కాంప్లెక్స్ వెనక భాగంలో ఉన్న మల్లమ్మ చెరువులో సుమారు 30 సెంట్లు భూమిని ఆక్రమించి ప్రభుత్వాన్ని మోసం చేసి కబ్జాకు పాల్పడ్డారు. మున్సిపాలిటీలో మల్లమ్మ చెరువు సుమారుగా 42.77 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉందని రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది. తీరా చూస్తే 42.77 ఎకరాలు విస్తీర్ణం కలిగిన మల్లమ్మ చెరువు ఎంత ఆక్రమణకు గురి కాబడిందో రెవెన్యూ రికార్డుల్లో లేదని చెప్పడం రెవిన్యూ అధికారుల తీరు తేట తెల్లమైంది.

ఈ చెరువు విషయంపై సమాచార హక్కు చట్టం కింద కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా మొత్తం ఈ విషయం బయట పడింది. అయితే ఈ చెరువు భాగంలో 30 సెంట్లు విస్తీర్ణం కలిగిన స్థలాన్ని ఎస్సీ కులానికి సంబంధించి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలాన్ని రెవెన్యూ అధికారులకు కోరగా అధికారులు స్పందించి చదును చేసుకోమని చెప్పడంతో ఈ కబ్జా విషయం బట్టబయలు అయ్యింది. కబ్జాదారులు హడావుడి చేసి ఈ స్థలం పైకి వచ్చి ఈ స్థలం మాది ఈ స్థలంపై రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేశారని చెప్పడంతో రెవెన్యూ అధికారులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. అదేవిధంగా చెరువులో కబ్జాకు పాల్పడిన 30 సెంట్లు విస్తీర్ణం కలిగిన భూమి ఎవరికి కూడా పట్టాలు మంజూరు చేయలేదని సమాచార హక్కు చట్టం కింద రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పారు. ఈ మల్లమ్మ చెరువు విషయంలో కలెక్టర్, రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వ భూములను ఎవరైతే కబ్జాకు పాల్పడ్డారో వారిపై తగు చర్య చేపట్టాలి.

# ముస్లింలకు న్యాయం టిడిపితోనే సాధ్యం




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్

**అనంతపురం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త బ్యూరో:** వక్ఫ్ ఆస్తుల పరిరక్షణతో పాటు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్బన్ టిడిపి కార్యాలయానికి విచ్చేసిన అబ్దుల్ అజీజ్‌కు టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు, టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మైనార్టీ సోదరులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, వక్ఫ్ ఆస్తుల నమోదు 68 వేల ఎకరాల నుంచి 82 వేల ఎకరాలకు పెరిగిందని తెలిపారు. అనంతపురంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములకు నోటీసులు జారీ చేస్తున్నామని, వక్ఫ్ భూముల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముస్లిం మైనార్టీలకు హాజ్ యాత్రకు సహాయం అందిస్తున్నామని అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఇమామ్‌లు, మోజన్‌లకు ఏడాదికి రూ.40 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న 17 నెలల బకాయిలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లించిందని తెలిపారు. పేద ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, మరింత మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దుల్హన్ పథకాన్ని త్వరలో అమలు చేసేలా సిఎం చంద్రబాబు నాయుడుతో చర్చిస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని అబ్దుల్ అజీజ్ అన్నారు. నారా లోకేష్ దేశ, విదేశాల్లో పర్యటిస్తూ పరిశ్రమలను ఆకర్షిస్తున్నారని తెలిపారు. ఎపిని ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసి యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్వరలో టిడిపి మైనార్టీ కమిటీలను ఏర్పాటు చేస్తామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి మైనార్టీలు, టిడిపి శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్షదుల్లా, టిడిపి నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

7-9pg4.qxd:7-9pg4.qxd 07/09/26 10:55 PM Page 1




వార్త

మనుషుల వెనుక చెప్పే మాటలను వారి ముఖాల మీదనే చెబితే సమాజం నిలబడటం కష్టం.

న- బాల్జాక్


# 'సర్' సాగుతోంది!

ప్రజాస్వామ్యంలో పోలింగ్ బూత్ వరకు వెళ్లిన ఒక నిజమైన ఓటరు తన ఓటు జాబితాలో లేదని వెను తిరిగి వెళ్లాల్సి వచ్చినా అది ప్రజాస్వామ్యానికే సిగ్గు చేటు. ఇది విజ్ఞులంతా చెప్పేమాట. కాని ఓటరు జాబితాల ప్రక్షాళన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన 'సర్' ప్రక్రియ ఎన్నో చిక్కుముడులతో భారతీయ ఓటరును క్రాస్‌రోడ్స్‌లో నిలబెట్టింది. ఇంతదాక ఎన్నోసార్లు ఎప్పటికప్పుడు ఆ ముడులను విప్పదీయాలని కొత్త కొత్త మార్గాలలో ప్రయత్నించినా అవి వెక్కిరిస్తూనే ఉన్నాయి. అసలీ ప్రక్రియే ఎవరికీ అంతుబట్టని రహస్యంగా తిప్పలు పెడుతోంది. చట్టపరంగా అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటరుగా నమోదు చేసుకోవడం ప్రజాస్వామిక ప్రక్రియలో కీలకం. కాగా ఓటరు తన ధృవపత్రాలలో శీలపరీక్ష చేసుకోవాల్సి వచ్చినప్పుడు ఓటరు ఎంత విసి గెత్తిపోతాడో ఎన్నికల కమిషన్ అర్థం చేసుకున్నట్లుగా లేదు. 'సర్' ప్రక్రియ చట్టబద్ధతకు లోబడే ఉందని దేశ అత్యున్నత ధర్మాసనం స్పష్టం చేసింది. కనుక దాని మీద ఎవరికీ ఏ సందేహమూ అవసరం లేదు. జరిగే ప్రక్రియలో ఓటరు సమస్య తీరే దారే దొరకడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాలుంటే అందులో ఉన్న పాత ఓటర్ల జాబితాలో 32 శాతం మంది ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. చాలా తిరస్కరణలకు సంబంధించి సరైన కారణాలు చెప్పకుండా తుది ఓటర్ల జాబితాలో అనర్హత కలిగిన ఓటర్లుగా నమోదు చేశారు. వారు తమ ధృవీకరణ పత్రాలను చూపితే, ఎన్నికల అధికారి ఆమోదిస్తే వారికి ఓటు హక్కు నిలబడుతుంది. లేకుంటే వారికి ఈసారి ఎన్నికలలో ఓటు వేసే భాగ్యం కలుగదు. స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్‌లో దాదాపు 60 లక్షల మంది ఓటర్లు తాము ఓటరుగా అర్హులేనని నిరూపించుకోవాల్సి ఉంటుంది. అవకతవకల జాబితాలో ఉన్నవారి సందిగ్ధానికి సంబంధించి బూత్‌స్థాయి ఏజెంట్లకు కూడా అందించలేకపోవడం విచిత్రం. నిజానికి వ్యత్యాసాల గురించి ఆయా ఓటర్ల పేర్లను వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచురించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయినా ఆ మేరకు జాబితాల ప్రచురణలో తెలంగాణ ఎన్నికల అధికారులు వెనుకబడే ఉన్నారు. అలాంటి జాబితాల ప్రచురణ వలన ప్రజల్లో అనవసరం ఆందోళనలు, భయాలు తొలగిపోతాయి. దేశవ్యాప్తంగా చూస్తే మూడో దశ వరకు 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 36.73 కోట్ల మంది ఓటర్ల జాబితాలో 6 కోట్ల మందిని తొలగించినట్లు సిఇసి స్పష్టమైన ప్రకటనే చేసింది. ఎన్నోసార్లు ప్రక్రియలో లోపాలను సరిదిద్దుతూ సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా చివరాఖరికి తేలిందేమిటంటే ఏలిన వారి కనుసన్నల్లో జరిగిందంటూ అపప్రథను నెత్తిన మోస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం పుణ్యమా అని 13 కోట్లకు పైగా ఓట్లు గల్లంతయ్యాయి. ఎన్నికల కమిషన్ సూచిస్తున్న పత్రాలు అంత తేలికగా దొరకుతాయన్న నమ్మకం లేదు. ఒకటికి పదిసార్లు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగిన ఆ పత్రాలు కానరాక పోవచ్చు ఇప్పటికే తమ పేర్లలో అక్షరం పొట్లు తేడా ఉన్నా ఓటు హక్కు పోగొట్టుకున్న ఓటర్లు లబో దిబోమంటున్నారు. వారి ఓటు హక్కు ఖరారు చేయించుకోవాలంటే తలప్రాణం తోకలోకి వస్తోందంటే నమ్మండి. అన్ని వివరాలు సరిగా ఉండి పుట్టిన తేదీ అంకెల్లో ఒక అంకె తేడా పడినా అదేదో పారలాక్స్ ఎర్రర్ అనో అచ్చు తప్పో అని సరిపెట్టుకునే పరిస్థితి లేదు. తాము శాశ్వత నివాసమున్న చోటు నుంచి మరో ప్రాంతానికి తాత్కాలికంగా వలస వెళ్లిన ఓటర్ల పరిస్థితి మరీ విడ్డూరంగా ఉంది. వారున్న చోటు కానీ, శాశ్వత నివాస ప్రాంతంలో కానీ ఓటు హక్కు దక్కదు. ఈ ప్రక్రియ రాజకీయంగా పరిపాలనా పరంగా ఎన్నో విమర్శలు ఎదుర్కొంటోంది. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఈ ప్రక్రియలోనిలోపాలను ఎత్తి చూపుతుంటే కేంద్ర ఎన్నికల సంఘం మాత్రం అన్నీ సజావుగానే జరుగుతున్నట్లు ఓటరును భ్రమలో ఉంచే ప్రయత్నం చేస్తోంది. 'అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని' అన్నట్లు భార్య ఓటు ఉండి భర్త ఓటు నమోదుకాని సందర్భాల్లో వాటిని కూడా వ్యత్యాసాలుగానే నోటీసు లందించారు. ప్రతి ఎన్నికకూ ముందు ఓటర్ల సవరణ ప్రక్రియ సాగుతూ మార్పులు, చేర్పులు జరిగినా కూడా ఎన్నికల సంఘం దృష్టిలో 2002 తర్వాత జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రక్షాళన ఇదేనన్నట్లుగా భావిస్తోంది. ఈ ప్రక్రియలో బిఎల్ఒలు ఒత్తిడి కారణంగా మృతి చెందిన ఉదంతాలు నమోదయ్యాయి. వెరిఫికేషన్ ప్రక్రియలో కూడా ఓటర్లు అంతే స్థాయిలో ఒత్తిడికి గురవుతున్నారు. తన పేరు తేడా ఉన్నందున తనకు నోటీసులు అందాయని సాక్షాత్తు తెలంగాణ ఎన్నికల కమిషనర్ సుదర్శన రెడ్డి చెప్పడాన్ని చూస్తే అంతటి వారికే జాబితాలో అవకతవకలు ఉండటమేమిటని ఓటర్లు ఎద్దేవా చేస్తున్నారు. 'సర్' ప్రక్రియ ఎంత సజావుగా, నిజాయితీగా జరుగుతోందని చెప్పుకునేందుకు ఆయన విషయాలను బహిర్గతపరిచినా ఓటర్లకు ఎన్నికల కమిషన్ మీద ఇప్పటికీ నమ్మకం కుదరడం లేదు. సిఇఒకే నోటీసు అందిందంటే చర్చనీయాంశమే. వివరణ కోరే ఏనోటీసు అయినాస్వాగతించదగినదే కానీ ఆ పత్రానికి ఏం జవాబివ్వాలో, ఎలా జవాబివ్వాలో తెలియని పరిస్థితిలో ఓటరు గందరగోళానికి గురవ్వడమే ఇక్కడ విశేషం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 1.37 కోట్ల మందికి 'సర్' నోటీసులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో 44.25 లక్షల మందికి కాగా తెలంగాణలో 92.87 లక్షల మందికి నోటీసులు వెళ్లాయి. తాజాగా మూడు వారాలు గడువు పొడిగించినా మిస్సయిన ఓటర్లంతా ప్రధాన జీవన స్రవంతిలో ఎప్పటికి చేరగలరో ఆ లోగుట్టు పరమాత్మునికే ఎరుక.



వ్యర్థమైన మాటలు వేలాదిగా చెప్పడం కన్నా శాంతిని, కాంతిని ప్రసాదించే ప్రయోజనకరమైన మాట ఒక్కటి చాలు.

గౌతమ బుద్ధుడు



మార్పు అంటే ప్రపంచానికి గిట్టదు. కాని మార్పు వల్లనే అభివృద్ధికి అవకాశం కలుగుతుంది.

శామ్యూల్ బట్లర్

# ఎన్నికల్లో నల్ల డబ్బే కీలకమా?

**ఎన్నికల్లో డబ్బు పాత్ర పెరిగే కొద్దీ ప్రజాసేవ చేయాలనుకునే సామాన్య వ్యక్తి రాజకీయాల్లోకి రావడం కష్టమైపోతోంది. ఎందుకంటే అతని దగ్గర కోట్ల రూపాయలు ఉండకపోవచ్చు. పెద్ద రాజకీయ పరిచయాలు లేకపోవచ్చు. వందల మందిని ఎన్నికల కోసం సమీకరించే ఆర్థిక శక్తి ఉండకపోవచ్చు. కానీ అతనికి నిజాయితీ ఉండవచ్చు. ప్రజల కోసం పనిచేసే సంకల్పం ఉండ వచ్చు. అలాంటి వ్యక్తి డబ్బు రాజకీయాల ముందు ఓడిపోతే ప్రజాస్వామ్యం గెలిచినట్టా? లేక ధనస్వామ్యం గెలిచినట్టా? ఎర్రచందనం అక్రమ రవాణా ద్వారా వచ్చిన డబ్బు నిజంగా ఎన్నికలను ప్రభావితం చేస్తుందనే ఆధారాలు ఎక్కడైనా లభిస్తే, వ్యక్తి ఎంత పెద్దవాడైనా, పార్టీ ఎంత శక్తివంతమైనదైనా, నిధుల మూలాన్ని దర్యాప్తు చేయాలి. అదే సమయంలో ఆధారాలు లేకుండా మొత్తం ప్రాంతాన్ని లేదా ఒక రాజకీయ పార్టీని ఎర్రచందనం మాఫియాగా ముద్ర వేయడం బాధ్యతారాహిత్యమే అవుతుంది.**

డాక్టర్ ఎ. భాగ్యరాజ్

స్థానిక రాజకీయాలు మారితేనే దేశ రాజకీయాలు మారతాయి, దేశ రాజకీయాలపై మనం ఎన్నో విమర్శలు చేస్తాం, పార్లమెంటులో అవినీతి అంటాం, రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తాం, పార్టీలను తప్పుబడతాం. కానీ ప్రజాస్వామ్యానికి మొదటి పాఠశాల అయిన స్థానిక రాజకీయాలను మాత్రం నిర్లక్ష్యం చేస్తాం. నిజానికి దేశ రాజకీయాల నాణ్యతను మార్చాలంటే మార్పు గ్రామం నుంచే ప్రారంభం కావాలి. ముఖ్యంగా ఇప్పుడు మన రాష్ట్రంలో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఒక వృక్ష జాతి ఉందంటే నమ్మగలమా? నిజమే మన రాష్ట్రంలోనే కాదు, ప్రపంచంలోనే అరుదైన వృక్షంగా ఖ్యాతి గడించిన ఎర్రచందనం చెట్టు. రాయలసీమ అంటే కేవలం కరవు, వెనుకబాటుతనం, వలసలు మాత్రమే కాదు. ఈ ప్రాంతానికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఎర్రచందనం కూడా ఉంది. అయితే అదే ఎర్రచందనం అక్రమ రవాణా, స్మగ్లింగ్, రాజకీయ అధికార సంబంధాలు, నల్ల ధనం వంటి ఆరోపణలతో తరచూ వార్తల్లోకి వస్తోంది. స్థానిక ఎన్నికల సమయంలో ఈ నల్లధనం రాజకీయాల్లోకి ప్రవహిస్తుందనే ఆరోపణలు వినిపించినప్పుడల్లా మనలో వచ్చే అసలు ప్రశ్న, ఎర్రచందనం విలువ ఎంత?ఆ సంపద ఎవరి చేతుల్లోకి వెళ్తోంది?ఆ డబ్బు ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేస్తుందా? అనే దానిపై చూస్తే భయమేస్తోంది. ఎర్రచందనం చెట్టు అడవిలో సహజసిద్ధంగా పెరుగుతుంది. దాన్ని అక్రమంగా నరికే వ్యక్తులు కొందరు, రవాణా చేసే వ్యక్తులు మరొకరు, అంతర్జాతీయ మార్కెట్‌కు చేసే గొలుసు కట్టు మరొకటి. మధ్యలో స్థానికంగా రక్షణ, సమాచారం, లాజిస్టిక్స్, రాజకీయ ప్రభావం వంటి అంశాలు ఉంటే అది కేవలం స్మగ్లింగ్ కాదు, ఒక వ్యవస్థీకృత నల్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. అలాంటి డబ్బు ఎన్నికలలోకి వస్తే సమస్య మరింత తీవ్రమవుతుంది. అడవిని దోచిన డబ్బుతో ఓటును కొనడం జరిగితే, అది కేవలం అవినీతి కాదు ప్రజాస్వామ్యంపై ద్వంద్వ దోపిడీ. మొదట అడవిని దోచుకుంటారు, తర్వాత ఆ డబ్బుతో ఓటును ప్రభావితం చేస్తారు. చివరికి అధికారాన్ని ఉపయోగించి అదే వ్యవస్థను కాపాడుకునే ప్రయత్నం జరుగుతుంది. పంచాయతీ, మండల పరిషత్, మున్సిపల్ వంటి స్థానిక సంస్థలు ప్రజల రోజువారీ జీవితానికి అత్యంత దగ్గరగా ఉంటాయి. రోడ్లు, డ్రైనేజీ, తాగు నీరు, వీధి దీపాలు, పారిశుధ్యం, ప్రభుత్వ పథకాలు, గ్రామీణ వనరులు ఇవన్నీ స్థానిక సంస్థల నిర్ణయాలతో సంబంధం కలిగి ఉంటాయి. అందువల్ల స్థానిక ఎన్నికల్లో డబ్బు ప్రభావం అంటే కేవలం ఒక అభ్యర్థి గెలుపుకాదు. రేపటి గ్రామపాలన ఎవరి చేతుల్లో ఉండాలి అన్న ప్రశ్న. ప్రజల సమస్యలను పరిష్కరించే వ్యక్తి గెలవాలా? లేకడబ్బు ఖర్చు చేయగల వ్యక్తి గెలవాలా? ఎర్రచందనం డబ్బుఉంటే ఎన్నికల ఖర్చును ఎందుకు ప్రశ్నించకూడదు?ఎన్నికల సమయంలో ఒక అభ్యర్థి తన సాధారణ ఆర్థిక సామర్థ్యానికి మించి భారీగా ఖర్చు చేస్తున్నాడనే అనుమానం వస్తేదాని



మూలాన్ని పరిశీలించడం అధికార యంత్రాంగం బాధ్యత. అదే సమయంలో ఎర్రచందనం అక్రమ రవాణా, నల్లధనం, ఎన్నికల ఖర్చుల మధ్య సంబంధం ఉందనే నిర్దిష్ట సమాచారం ఉంటే దానిపై సమగ్ర దర్యాప్తు జరగాలి. ఇక్కడే ఎన్నికల వ్యవస్థకు ఒక పెద్ద సవాలు ఉంది. డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరికి చేరింది? ఎవరెవరు ఎంతఖర్చు చేశారు? ఎవరెవరు లబ్ధి పొందారు? ఈ నాలుగు ప్రశ్నలకు సమాధానాలు దొరికితేనే నిజమైన ఎన్నికల పారదర్శకత సాధ్యమవుతుంది. రాయలసీమలో ఎర్రచందనం అడవులు కేవలం ప్రభుత్వ ఆస్తి కావు, అవి జీవవైవిధ్యానికి నిలయం, భవిష్యత్ తరాలకు చెందిన సహజవనరు పర్యావరణ సంపదలు. చెట్లను అక్రమంగా నరికితే నష్టపోయేది కేవలం అటవీ శాఖ మాత్రమే కాదు. నష్టపోయేది ప్రజల ఆస్తి. నష్టపోయేది పర్యావరణం. నష్టపోయేది ముఖ్యంగాభవిష్యత్ తరాలు. ఆచెట్లను నరికిన డబ్బు ఎన్నికలలోకి వచ్చి ప్రజల ఓట్లను ప్రభావితం చేస్తే, నష్టం మరింత పెరుగుతుంది. అందుకే ఎర్రచందనం అక్రమ రవాణాను కేవలం అటవీ నేరంగా చూడకూడదు. ఇది పర్యావరణ నేరంగాను, ఆర్థిక నేరంగాను అవసరమైతే ఎన్నికల నేరంగాను చూడాలి. ఓటుకు డబ్బు తీసుకున్న వ్యక్తిని మాత్రమే నిందించడం సులభం. కానీ ప్రశ్నించాల్సింది ఓటు కొనడానికి అంత డబ్బుఎక్కడి నుంచి వచ్చింది? ఎన్నికల సంఘం, పోలీస్, అటవీ శాఖలు సవాలుగా తీసుకుని రాబోవు స్థానిక ఎన్నికలలో మూడు వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలి. ప్రముఖంగా ఎన్నికల యంత్రాంగం అక్రమ ఎన్నికల ఖర్చు, ఓటర్ల ప్రలోభాలను పర్యవేక్షించాలి. పోలీసు శాఖ నేర పూరిత నిధుల ప్రవాహాన్ని, అక్రమ రవాణా నెట్వర్క్‌లపై దర్యాప్తు చేయాలి. అటవీ శాఖ ఎర్రచందనం అక్రమ నరికివేత, రవాణా, నిల్వ, స్మగ్లింగ్‌ను అడ్డుకోవాలి. అవసరమైతే ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థలు కూడా నిధుల మార్గాన్ని పరిశీలించాలి. ప్రజలు కూడా ప్రశ్నించాలి. ఎన్నికలలోడబ్బు తీసుకోవడం సాధారణమై పోతే ప్రజాస్వామ్యం నెమ్మదిగా మార్కెట్‌గా మారుతుంది. ఈ రోజు రెండు వేలరూపాయలకు ఓటు అమ్ముకున్న వ్యక్తి రేపు తన గ్రామంలో మంచి రోడ్డు అడిగే నైతిక హక్కును కోల్పోతారు. కానీ అతని ఓటును కొనుక్కున్న రాజకీయ వ్యవస్థ మాత్రం ప్రజాసేవను వ్యాపారంగా మార్చే ప్రమాదం ఉంది. ఎన్నికల్లో డబ్బు పాత్ర పెరిగే కొద్దీ ప్రజాసేవ చేయాలనుకునే సామాన్య వ్యక్తి రాజకీయాల్లోకి రావడం కష్టమైపోతోంది. ఎందుకంటే అతని దగ్గర కోట్ల రూపాయలు ఉండకపోవచ్చు. పెద్ద రాజకీయ పరిచయాలు లేకపోవచ్చు. వందల మందిని ఎన్నికల కోసం సమీకరించే ఆర్థిక శక్తి ఉండకపోవచ్చు. కానీ అతనికి నిజాయితీ ఉండవచ్చు. ప్రజల కోసం పనిచేసే సంకల్పం ఉండవచ్చు. అలాంటి వ్యక్తి డబ్బు రాజకీయాల ముందుఓడిపోతే ప్రజాస్వామ్యం గెలిచినట్టా? లేక ధనస్వామ్యంగెలిచినట్టా? ఎర్రచందనం అక్రమ రవాణా ద్వారా వచ్చిన డబ్బు నిజంగా ఎన్నికలను ప్రభావితం చేస్తుందనే ఆధారాలు ఎక్కడైనా లభిస్తే,వ్యక్తి ఎంత పెద్దవాడైనా, పార్టీ ఎంత శక్తివంతమైనదైనా, నిధుల మూలాన్ని దర్యాప్తు చేయాలి. అదే సమయంలో ఆధారాలులేకుండా మొత్తం ప్రాంతాన్ని లేదా ఒక రాజకీయ పార్టీని ఎర్రచందనం మాఫియాగా ముద్ర వేయడం బాధ్యతారాహిత్యమేఅవుతుంది. అడవిని కాపాడాలి, నల్ల ధనాన్ని అడ్డుకోవాలి, స్థానిక ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ఎందుకంటే అడవిలోఎర్రచందనం దోపిడీ అయితే అది ప్రకృతి దోపిడీ, ఆ దోపిడీ డబ్బుతో ఓటు కొనబడితే అది ప్రజాస్వామ్య దోపిడీ.రాయలసీమకు కావలసింది మాఫియా డబ్బుతో నడిచే రాజకీయాలు కాదు ప్రజల విశ్వాసంతో నడిచే స్థానిక పాలన.అందుకే స్థానిక ఎన్నికల అసలు ప్రశ్న ఎవరు గెలుస్తారు?కాదు. ఎవరు గెలిస్తే ప్రజలు గెలుస్తారు? అదే నిజమైనప్రజాస్వామ్య పరీక్ష. స్థానిక రాజకీయాలు మారితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రజాస్వామ్యం బలపడితేనే దేశం బలపడుతూ అభివృద్ధి చెందుతుంది.

# సింగిల్ విండోలపై రాజకీయ పట్టు మంచిదేనా?



శ్రీశైలం దూడం

రైతు రుణం, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోళ్లతో ముడి పడిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రజల నోట సింగిల్ విండోలుగా పేరుపొందాయి. రైతుల భాగస్వామ్యంతో నడిచే ఈ సంస్థలకు నాయకత్వాన్ని రైతులే ఎన్నుకోవాలా? లేక ఎన్నికలు నిర్వహించకుండా రాజకీయ, పరిపాలనా నియామకాలతో పాలకవర్గాలను ఏర్పాటు చేయాలా? తెలంగాణలో ఇప్పుడు ఇదే అసలు ప్రశ్న. జీవో ఆర్‌టి నంబర్ 597కు సంబంధించిన న్యాయపరమైన పరిణామాలు ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. ప్రభుత్వం జీవోను ఉపసంహరించుకోవడం, గతఎన్నికైన పాలక వర్గాల కొనసాగింపుపై హైకోర్టు ముందు చోటుచేసుకున్న పరిణామాలు ఒక విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. తాత్కాలిక ఏర్పాట్లు శాశ్వత పరిష్కారం కావు. సహకార రంగానికి దీర్ఘకాలిక మార్గం చట్టబద్ధమైన ఎన్నికలే. తెలంగాణలో మొత్తం 60,925 సహకార సంఘాలు ఉన్నట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో రైతులకు ప్రత్యక్ష సంబంధం ఉన్న పీఏసీఎస్‌లు 906. తొమ్మిది జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల పరిధిలోని ఈ సంఘాల్లో 906 చైర్మన్ పదవులు, సుమారు పది వేల డైరెక్టర్ స్థానాలు ఉన్నాయి. అంటే గ్రామీణ స్థాయిలో వేలాది నాయకత్వ అవకాశాలు, రైతుల ఆర్థిక ప్రయోజనాలతో ముడిపడిన కీలక వ్యవస్థ. జీవో 597 చుట్టూ సాగిన పరిణామాలు ఈ పదవుల భవిష్యత్తుపై కొత్త చర్చకు తెరతీశాయి. రైతు సంస్థల నాయకత్వం ఎన్నికల ద్వారా రావాలా, నియామకాల ద్వారా రావాలా అన్న ప్రశ్నకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. తాత్కాలిక పాలన ప్రజాస్వామ్యానికి శాశ్వత ప్రత్యామ్నాయం కాదు. సింగిల్ విండోలు సాధారణ ప్రభుత్వ కార్యాలయాలు కావు. సభ్యుల భాగస్వామ్యం, ఆర్థిక కార్యకలాపాలు, రుణాలు, గ్రామీణ వ్యవసాయ అవసరాలతో ముడి పడిన సహకార సంస్థలు. ప్రభుత్వం వాటిని పర్యవేక్షించ వచ్చు. అవకతవకలు జరిగితే విచారణ చేయవచ్చు.నిధుల దుర్వినియోగం నిర్ధారణైతే బాధ్యులపై చర్యలు తీసుకోవచ్చు. ఓటర్ల జాబితాల్లో లోపాలుంటే సరిచేయవచ్చు. కానీ కొందరి తప్పుల పేరుతో చట్టబద్ధంగా ఓటు హక్కు



ఉన్న రైతు సభ్యుల ఎన్నికల అవకాశాన్ని నిరవధికంగా పక్కనపెట్టడం సరైన పరిష్కారం కాదు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోండి.. కానీ రైతు ఓటుపై తాళం వేయకండి. జగిత్యాల జిల్లా పోతారం సింగిల్ విండో సొసైటీ రైతుల ఐక్యతతో రెండు కోట్ల రూపాయల ఆదాయాన్ని సొంతంగా సమకూర్చుకుందని స్థానికులు చెబుతున్నారు. ఎన్నికైన పాలకవర్గం ఉంటే ప్రశ్నించే గొంతుకు అవకాశం ఉంటుంది. నామినేటెడ్ వ్యవస్థలో భిన్నాభిప్రాయాలకు స్థానంతగ్గిపోతుందన్న ఆందోళన ఉంది. సంఘాల ఆర్థిక వనరుల వినియోగంపై పారదర్శకత, సభ్యులకు జవాబుదారీతనం ఉండాలంటే ప్రజాస్వామ్యబద్ధమైన పాలకవర్గాలే బలమైన మార్గం. ఇది ఒక్కపోతారంసమస్య కాదు, రాష్ట్రవ్యాప్తంగా సహకార రంగం భవిష్యత్తుకు సంబంధించిన అంశం. రైతు డబ్బు, రైతు భాగస్వామ్యంఉన్న చోట రైతు స్వరం కూడా ఉండాలన్నదే సహకార స్ఫూర్తి. సహకార సంఘం అధ్యక్ష పదవి ఎవరికైనా రాజకీయ బహుమతిగా మారకూడదు. రైతు ప్రయోజనాలకుకట్టుబడి పనిచేసే వ్యక్తి సభ్యుల విశ్వాసాన్ని ఎన్నికల్లో పొందే అవకాశం ఉండాలి. రాజకీయ పార్టీలకు చెందిన రైతులుకూడా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు,గెలవవచ్చు, ఓడిపోవచ్చు.అదే ప్రజాస్వామ్యం.కానీ ముందుగానే నామినేషన్ల ద్వారాపాలక వర్గాలను ఏర్పాటు చేస్తే ఎంపికకు ప్రమాణం ఏమిటి?రైతు ప్రయోజనమా, రాజకీయ విధేయతా? అన్న సందేహాలు రావడం సహజం. వాటికి తెరపడాలంటే ఎన్నికలే ఉత్తమ మార్గం.ఇక తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. పదవీకాలం ముగిసిన సంఘాల వివరాలను వెల్లడించాలి. చట్టం, సంఘాల ఉపనియమాల ప్రకారం ఓటు హక్కు ఉన్న సభ్యులతో పారదర్శక ఓటర్ల జాబితాలను సిద్ధంచేయాలి. అభ్యంతరాలకు అవకాశం ఇచ్చి వాటిని పరిష్కరించాలి. అనంతరం దశలవారీగా ఎన్నికలషెడ్యూల్ ప్రకటించాలి. ఎన్నికలు పూర్తయ్యే వరకు అవసరమైనచోట మాత్రమే పరిమిత కాలపు చట్టబద్ధ ఏర్పాట్లు ఉండాలి. అవి శాశ్వత నామినేటెడ్ పాలనగా మారకూడదు. రైతు సంక్షేమం అంటే కేవలం రుణమాఫీ, సబ్సిడీలు, పథకాలే కాదు. రైతుకు తన సంస్థనిర్వహణలో భాగస్వామ్యంకల్పించడం కూడా సంక్షేమమే. 'మా సంఘానికి నాయకుడిని మేమే ఎన్నుకునే రోజు ఎప్పుడు?' అన్న రైతు ప్రశ్న కేవలం పదవుల వివాదం కాదు.సహకార వ్యవస్థ స్వరూపం, రైతు భాగస్వామ్యం, గ్రామీణ ప్రజాస్వామ్యానికి సంబంధించిన పరీక్ష. ఈ ప్రశ్నకు ప్రభుత్వం మాటలతో కాదు ఎన్నికల నోటిఫికేషన్‌తో సమాధానం చెప్పాలి. నామినేటెడ్ పోస్టులు వద్దు, సింగిల్ విండోలకు ఎన్నికలు కావాలి! రాజకీయ పట్టు కాదు రైతు ఓటే గెలవాలి!

# ప్రజావాక్కు



## మానవ ధృవీకరణ ముఖ్యం

ఒకప్పుడు ఒక చిత్రం వెయ్యి మాటలతో సమానం. ఇప్పుడు మాత్రం ఒక చిత్రం వెయ్యి అబద్ధాలకు కూడా వేదిక కావచ్చు! కృత్రిమ మేధ సాయంతో క్షణాల్లో అత్యంత సహజంగా కనిపించే ఫొటోలు, దృశ్యాలు సృష్టించగల సాంకేతికత అందుబాటులోకి రావడంతో కంటికి కనిపించేదంతానిజంకాదనే కొత్తవాస్తవాన్ని సమాజం ఎదుర్కొంటోంది. ప్రకృతి విపత్తులు, యుద్ధాలు, ఘర్షణలు, ఎన్నికలు, ప్రముఖులపై ప్రచారంవంటి సున్నితమైన సందర్భాల్లో నకిలీ చిత్రం ఒక్కటి చాలు ప్రజల్లో భయాన్ని, కోపాన్ని లేదా అపోహలను వ్యాప్తి చేయడానికి. అసలు సంఘటన జరగకపోయినా జరిగినట్లు చూపించడం ఒక ప్రమాదమైతే, నిజమైన సంఘటనకు సంబంధించిన చిత్రాన్ని మార్చి దానిసందర్భాన్ని వక్రీకరించడం మరింత తీవ్రమైన ముప్పు. సామాజిక మాధ్యమాల్లో ఒకసారి వైరల్ అయిన తప్పుడు చిత్రం నిజం కాదని నిరూపించేలోపే వేలాది మందికి చేరుతుంది.అందుకే వేగం కంటే ధృవీకరణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం ఇది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## మోసం చేస్తున్న అమెరికా

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహాటంగా వెనుజుల ఇంధనం 65 లక్షల బ్యారేళ్ళను తమ ఆధీనంలోకి తీసుకున్న అని ప్రకటించారు. ఇది అంతా మధురోను కస్టడిలోకి తీసుకున్నాక తన మాట వినే నమ్మిన బంటును వెనిజుల అధ్యక్షురాలుగా నియమించిన తరవాత ఇది అంతా చేస్తున్న ట్రంప్ కచ్చితంగా అభద్రతా భావంలో ఉన్నారు. తమ ఆధిపత్యం ఎక్కడ సడపోతోందని భయపడుతున్నారు.భారత్ అమెరికా భయాలకు తలొగ్గక పోగా రష్యా నుండి చమురును కొనడం ట్రంప్‌కి మింగుడు పడదు.

- భారత అవినాష్, జనగామ

## పెరుగుతున్న సైబర్ నేరాలు

ఈ మధ్య సైబర్ నేరాలు బాగా పెరిగిపోతున్నాయి. నేరగాళ్లు ఎంతో సాంకేతిక నైపుణ్యంతో పనిచేస్తున్నారు. ఈనేరాల వెనుక ఉన్న సాధారణ ప్రవేశ మార్గం మరింత ఆందోళన కలిగి స్తోంది.ఒక నకిలీ ట్రేడింగ్ యాప్‌ద్వారా అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపి ప్రజలను వంచిస్తున్నారు. బాధితులు అజాగ్రత్తగా ఉన్నారని చెప్పలేం. ఈ మాయా వేదికలు అసలైన వాటిని పోలి ఉండటంతో వారు మోసపోతున్నారు. ఇటువంటి దోపిడీలను అరికట్టడా నికి వ్యవస్థలో మార్పులు రావాలి. .

- కె.నాగరాజు, వరంగల్‌జిల్లా

## పతనమవుతున్న విలువలు

దేశంలో వినోదమే ప్రధానంగా సాగే టీవీఛానళ్లలో ప్రసారం అయ్యేసీరియళ్ళలో విలువలు పతనమవుతున్నా యి. దేశంలోని అన్ని భాషలలో వచ్చే సీరియళ్ళు దాదా పుగా ఒకే మూస పద్ధతిలో ఉంటున్నాయి.ఈ సీరియళ్ళు ప్రముఖంగా పగ, ప్రతీకారం,ఈర్ష, ద్వేషం, మోసం, దగా, కుయుక్తులు, కుట్రలు, హత్యలు, దొంగవేషాలు, నమ్మించి మోసగించటం వంటి కథాంశాలతో ఊదరగొడతున్నాయి. వృద్ధులు, మహిళలు, పనీపాట లేనివారు ఇత్యాది వర్గాలు వీరి టార్గెట్. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేకుండా, ఆ ఛానల్ ఈ ఛానల్ అని లేకుండా అన్నిఛానళ్ళలో వినోదరంగం ప్రజలను టీవీలకు అతుక్కుపోయేంతగా బానిసలను చేస్తోంది.టీవీ సీరియళ్ళలోని వివిధ భావోద్వేగాలు ప్రజలను ప్రభావితం చేస్తూ వారిని దుష్ట మార్గంలోకి లాగుతున్నాయి. ప్రజలు మానసిక రుగ్మతలు కలిగించే టీవీ సీరియళ్ళ జోలికి పోకుండా పుస్తక పఠనమో లేక కొత్త అభిరుచులను పెంచుకుంటూ వాటిలో నిమగ్నమై సమాజానికి తోడ్పాటు కాగలగాలి.

- కె. వెంకట రమణ, సికింద్రాబాద్

## జీతాలలో కోత విధించాలి

ఈ మధ్య కొన్ని ఐటీ దిగ్గజ సంస్థలు సైతం తమకు లాభాలు తగ్గిపోతున్నాయని వేల మంది ఐటీ వుద్యోగుల్ని ఆగమేఘాల మీద తొలగించి వేస్తున్నాయి. వారికి తగిన పరిహారం కూడా చెల్లిస్తున్నామని సంస్థలు ప్రకటిస్తున్నాయిగాని, సంవత్సరాల తరబడి ఆ కంపెనీ వృద్ధికి సేవచేసి జీవితంలో స్థిరపడుతున్న వేళయుజ్ అండ్‌ర్తో అన్నవిధంగా వున్న పళంగా వారి వుద్యోగాలు తొలగించటం అన్యాయం.గొప్పలకోసం పెద్ద వేతనాలు ఇస్తున్నఈసంస్థలు తమనష్టాలను తొలగించుకోవాలనిభావిస్తే వుద్యోగులను తొలగించేబదులు వేతనాలపై కోత విధించాలి.

- టి.సాంబశివరావు, గుంటూరుజిల్లా

## ప్రవర్తన నియమావళి పాటించాలి

ఇటీవల దిగ్భ్రాంతి కలిగిస్తున్న రోడ్ ప్రమాదాల్లో ఆర్‌టిసికి చెందినవి కొంత తక్కువే అని చెప్పొచ్చు. డ్రైవర్ తమ విధులను చక్కగా నిర్వర్తిస్తున్నారు. తమ ఆరోగ్యం, కంటిచూపు తోపాటు ఎంతో ఏకాగ్రత, ముందుచూపుతో ఉంటున్నారు. అదనపు డ్రైవర్ అందుబాటు, సిబ్బందికొరత ఉన్నా,రాబోయే సమయం, పొరపాటు అనూహ్యమైనది. వీటి దృష్ట్యా సిబ్బందికి వైద్యపరీక్షలు కార్పొరేషన్ స్వయంగా చేసేది మంచి విధానం. దానితో పాటు ఇతర నియమాలు, ట్రాఫిక్ అధికారులు ప్రతీనెలతనిఖీ చేస్తే దుస్సంఘటనల నివారణ సాధ్యమే.

-బొల్లోజు మేఘానాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఉత్పాదక పెట్టుబడులతో ప్రగతికి కొత్త బాట

కొమ్ము అమృత్

తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో కనిపిస్తున్న ఆదాయ వృద్ధి రాష్ట్ర అభివృద్ధికి కొత్త అవకాశాలకు సంకేతంగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలన్న లక్ష్యంతో పని చేస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర సొంత ఆదాయ వనరులు బలపడటం కీలక పరిణామం. ఖజానాకు పెరుగుతున్న ఆదాయాన్ని కేవలం సాధారణ వ్యయానికే పరిమితం చేయకుండా మౌలిక వసతులు, పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి, విద్య, వైద్యం, పట్టణాభివృద్ధి, సాగునీరు, గ్రామీణ మౌలిక సదుపాయాలపై పెట్టుబడులుగా మళ్లిస్తే తెలంగాణ అభివృద్ధికి మరింత వేగం అందే అవకాశం ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో రాష్ట్రానికి రూ.59,642.62 కోట్ల రెవెన్యూ రాబడి సమకూరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 18.64 శాతం అధికం. ఇందులో పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం రూ. 53,004.40 కోట్లు. గత ఏడాదితో పోలిస్తే పన్నుల ఆదాయంలో రూ.4,858.83 కోట్ల పెరుగుదల నమోదైంది. పన్నేతర ఆదాయం కూడా రూ.4,274.55 కోట్లకు చేరడం గమనార్హం. ఈ గణాంకాలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలకు మరింత విస్తరణకు అవకాశం ఉంది. ఈ ఆదాయ వృద్ధిని స్థిరమైన ఆర్థిక అభివృద్ధిగా మార్చడానికి ప్రభుత్వం ఇప్పుడు ఉత్పాదక పెట్టుబడులపై దృష్టి పెట్టాలి. రాష్ట్రంలో రహదారులు, వంతెనలు, సాగునీటి వసతులు, పారిశ్రామిక పార్కులు, విద్యుత్ మౌలిక సదుపాయాలు, తాగునీరు, పట్టణ రవాణా, డ్రైనేజీ వంటి రంగాల్లో పెట్టుబడులు పెంచితే ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరిస్తాయి. ఒక ప్రాంతంలో మౌలిక వసతులు మెరుగుపడితే అక్కడ పరిశ్రమలు వస్తాయి. పరిశ్రమలు వస్తే ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి పెరుగుతుంది. ఉపాధిపెరిగితే కుటుంబాల కొనుగోలు శక్తి పెరుగుతుంది. దాంతో వ్యాపారాలు, సేవారంగం, పన్నుల ఆదాయం కూడా విస్తరిస్తాయి. అందువల్ల అభివృద్ధి వ్యయాన్ని ఖర్చుగా కాకుండా భవిష్యత్తు ఆదాయాన్ని సృష్టించే పెట్టుబడిగా చూడాల్సిన అవసరం ఉంది. పెట్టుబడులకు తెలంగాణను మరింత ఆకర్షణీయంగా చేయాలి. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోని ప్రముఖ ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ కేంద్రాల్లో ఒకటిగా ఉంది. ఈ సామర్థ్యాన్ని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాల్సిన సమయం వచ్చింది. ద్వితీయ, తృతీయ



శ్రేణి నగరాల్లో పారిశ్రామిక మౌలిక వసతులు కల్పించడం, రవాణా అనుసంధానాన్ని మెరుగుపరచడం, నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా పెట్టుబడులను జిల్లాలకు తీసుకెళ్లవచ్చు. హైదరాబాద్ కేంద్రిత అభివృద్ధి నుంచి తెలంగాణ వ్యాప్తంగా సమతుల్య అభివృద్ధి వైపు అడుగులు పడాలి. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి నగరాలను ప్రాంతీయ ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసే అవకాశాలను ప్రభుత్వం పరిశీలించాలి. రాష్ట్ర అభివృద్ధిలో మరో కీలక అంశం ఉపాధి. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించేలా విద్యా వ్యవస్థను ఉద్యోగ మార్కెట్‌తో అనుసంధానించాలి. ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, బయోటెక్నాలజీ, పునరుత్పాదక ఇంధనం, రక్షణ రంగం, ఆహార ప్రాసెసింగ్, లాజిస్టిక్స్ వంటి భవిష్యత్ రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తే పెట్టుబడులతోపాటు ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి. రాష్ట్ర అభివృద్ధి అంటే పట్టణాల అభివృద్ధి మాత్రమే కాదు. వ్యవసాయం, అనుబంధ రంగాలు బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠమవుతుంది. సాగునీరు, గిడ్డంగులు, శీతల గిడ్డంగులు, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, మార్కెటింగ్ సదుపాయాలను విస్తరించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పిస్తే స్థానికంగానే ఉపాధి లభిస్తుంది. దీర్ఘకాలిక అభివృద్ధికి అత్యంత విలువైన పెట్టుబడి మానవ వనరులపైనే. ప్రభుత్వ విద్యాసంస్థల నాణ్యత పెంపు, ఆధునిక నైపుణ్య శిక్షణ, మెరుగైన వైద్య సదుపాయాలు, మహిళలు-యువతకు ఉపాధి అవకాశాల కల్పన రాష్ట్ర ఉత్పాదకతను పెంచుతాయి. సంక్షేమ పథకాలతో ప్రజలకు భద్రత కల్పిస్తూనే, విద్య-ఉపాధి ద్వారా వారిని ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దడం మరింత స్థిరమైన అభివృద్ధికి దారి తీస్తుంది. ప్రస్తుతం కనిపిస్తున్న ఆదాయ వృద్ధి తెలంగాణకు ఒక అవకాశ ద్వారం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడమే ప్రభుత్వ ముందున్న ప్రధాన కర్తవ్యం. ప్రతి అదనపు రూపాయి ఆదాయం నుంచి గరిష్ఠ ఆర్థిక విలువను సృష్టించేలా పెట్టుబడులు పెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి దిశలో మౌలిక వసతులు, పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి, వ్యవసాయం, విద్య, వైద్యం, ప్రాంతీయ సమతుల్య అభివృద్ధికి సమన్వయం కల్పిస్తే తెలంగాణ ఆర్థిక ప్రగతి మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది. ఆదాయం పెరగడం ఆర్థిక శక్తికి సంకేతం. ఆ ఆదాయంతో ఆస్తులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, మౌలిక వసతులు సృష్టించడమే నిజమైన అభివృద్ధి. ఇప్పుడు తెలంగాణ ముందున్న అవకాశం అదే.

7-9Pg5.qxd:7-9Pg5.qxd 07/09/26 11:32 PM Page 1



# మూడేళ్లలో డ్రగ్స్‌రహిత భారత్ లక్ష్యం

## డ్రగ్ నెట్‌వర్క్‌ల నిర్మూలనకు నాలుగు అంచెల వ్యూహం: కేంద్ర మంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** దేశాన్ని 2029 నాటికి డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. మాదకద్రవ్యాల రహిత యువశక్తి 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణానికి దోహదపడాలన్నదే ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో పాటు కేంద్ర హోంశాఖ, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొన్న మాదకద్రవ్యాలపై ఉన్నతస్థాయి సమావేశానికి అమిత్ షా అధ్యక్షత వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నక్సలిజం, ఉగ్రవాదం వంటి సమస్యలను నిర్మూలించేందుకు ప్రభుత్వం అనుసరించిన విధంగానే మాదకద్రవ్యాల ముప్పును కూడా అంతం చేసేందుకు మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని షా అన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వాటికి నిధులు సమకూర్చడం నుంచి బాధితుల చికిత్స, పునరావాసం వరకు మొత్తం నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేసేందుకు దేశవ్యాప్తంగా సమన్వయంతో కూడిన వ్యూహాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. డ్రగ్స్ రహిత యువశక్తి 2047 నాటికి వికసిత్ భారత్‌కు నాయకత్వం వహించాలన్నదే నరేంద్ర మోడీ లక్ష్యం అని షా అన్నారు. 2014కు ముందు మాదకద్రవ్యాలపై పోరాటం చిన్నచిన్న విభాగాల్లో, విడివిడిగా సాగేదని, చిన్నస్థాయి నిందితులను పట్టుకోవడంతోనే దర్యాప్తు సంస్థలు సంతృప్తి చెందేవని ఆయన అన్నారు. మోదీ ప్రభుత్వం మాత్రం మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత కీలక అంశంగా పరిగణిస్తోందని చెప్పారు. నాలుగు అంచెల సమన్వయ వ్యవస్త 2019లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను ఎదుర్కొనేందుకు నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఫర్ కౌంటరింగ్ డ్రగ్ ట్రాఫికింగ్‌ను కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నాలుగు అంచెల వ్యవస్థగా ఏర్పాటు చేసినట్లు షా తెలిపారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రత్యేక యాంటీనార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేసి, స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించామని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తున్న 100 డ్రగ్ నెట్‌వర్క్‌లను పూర్తిగా ధ్వంసం చేయడంతో పాటు, విదేశాల్లో దాక్కున్న 100 మంది పరారీలో ఉన్న నిందితులను భారత్‌కు తీసుకురావాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని షా తెలిపారు. కనీసం 75 రహస్య డ్రగ్ ల్యాబొరేటరీలను ధ్వంసం చేయనున్నట్లు చెప్పారు. నక్సలిజాన్ని నిర్మూలించిన తరహాలోనే మాదకద్రవ్యాల ముప్పును కూడా ఎదుర్కొంటామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకూ 36 దేశాల నుంచి 274 మంది వాంటెడ్, పరారీలో ఉన్న నిందితులను భారత్‌కు తీసుకొచ్చామని షా తెలిపారు. గత మూడేళ్లలో 401 రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయగా, 2026 జూలై వరకు వాటిలో 182 ఉన్నాయని చెప్పారు.

# కొత్త మ్యాప్‌కు కొంతవరకే మద్దతు..

## వాటిని అంగీకరించం : భారత్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** వివిధ దేశాలు, ఖండాల వైశాల్యాన్ని కచ్చితంగా చూపూ సరికొత్త 'ఈక్వల్ ఏరియా మ్యాప్'ను (నిజవైశాల్య ప్రపంచ పటం) వినియోగంపై ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానానికి భారత్ మద్దతు తెలిపింది. అయితే ఈ మద్దతు ప్రపంచ పటంలో ఏ నిర్దష్ట మార్పులకు గానీ.. జాతీయ సరిహద్దుల చిత్రణకు గానీ ఆమోదం తెలిపినట్లు కాదని స్పష్టం చేసింది. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. 'ఐక్యరాజ్య సమితి చేసిన ఈ తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటు వేసింది. ఓటు వేసినందుకు గల కారణాలను కూడా వివరించింది. ఈ మద్దతు అంతర్జాతీయ సరిహద్దులు, వివాదాస్పద భూభాగాలు లేదా ప్రదేశాల పేర్లతో సహా రాజకీయ ఉద్దేశాలతో మార్పులు చేసిన పటాల గురించి ప్రస్తావించదు. అంతేకాకుండా ఈ పటంలో జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలతో సహా సార్వభౌమ భూభాగాలను భారతదేశ అధికారిక పటం ప్రకారమే చూపించాలి. అందుకు విరుద్ధంగా తప్పుదారి పట్టించేలా చూపించే ఏ చిత్రీకరణ అయినా ఆమోదయోగ్యం కాదు. సార్వభౌమత్వం, ప్రాదేశి సమగ్రతపై భారతదేశ వైఖరి స్పష్టంగా ఉంటుంది. ఈ విషయంలో రాజీపడే అవకాశమే లేదు' అని జైస్వాల్ స్పష్టం చేశారు.

కొత్త ప్రపంచ పటం..

వివిధ దేశాలు, ఖండాల వైశాల్యాన్ని కచ్చితంగా చూపే సరికొత్త 'ఈక్వల ఏరియా మ్యాప్'ను (నిజ వైశాల్య ప్రపంచ పటం) ఐక్యరాజ్య సమితి ఆమోదించింది. దీంతో 16వ శతాబ్దం నుంచి అమలులో ఉన్న మర్కేట ప్రపంచ పటం కనుమరుగు కానుంది. కొత్త పటంలో భారత్, ఆఫ్రికాలు పెద్దగా కనిపిస్తాయి. అమెరికా కొంత చిన్నదిగా కనిపించనుంది. పటంలో మాత్రమే ఈ మార్పులు కనిపిస్తాయి. దేశాల వాస్తవ సరిహద్దుల్లో ఎటువంటి మార్పులు ఉండవు. 16వ శతాబ్దంలో నౌకాయానం కోసం రూపొందించిన పాత మర్కేట పటాన్ని ఐరాస కాలం చెల్లినదిగా ప్రకటించింది. దీంతో ప్రపంచ పటాన్ని మరింత కచ్చితంగా చూపే కొత్త పటాన్ని ప్రామాణికంగా ప్రకటిస్తూ తీర్మానం ప్రవేశపెట్టింది.

# ఈక్వెడార్ నౌకలను సముద్రంలో ముంచిన అమెరికా సైనిక దళాలు



**వాషింగ్టన్, సెప్టెంబరు 6:** తూర్పు పసిఫిక్ సముద్ర జలాల్లో అమెరికా సైనిక దళాలు సంచలన ఆపరేషన్ చేపట్టాయి. మాదరద్రవ్యాల అక్రమ రవాణాకు సహకరిస్తున్నాయనే ఆరోపణలపై ఈక్వెడార్‌కు చెందిన పలు వాణిజ్య నౌకలను అడ్డగించి, సముద్రంలోనే ముంచివేశాయి. అయితే నౌకలను ధ్వంసం చేయడానికి ముందే వాటిలోని సిబ్బందిని సురక్షితంగా ఈక్వెడార్ అధికారులకు అప్పగించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ఇదు దేశాల అధికారులు తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో ఈ ఆపరేషన్ జరిగినట్లు యుఎస్ సదరన్ కమాండ్ వెల్లడించింది. డ్రగ్స్ స్మగ్లర్లు సముద్రంలో ఏర్పాటు చేసుకున్న 'తేలియాడే ఫ్యూయల్ స్టేషన్లు' లక్ష్యంగా చేసుకుని ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నది. యుఎస్ఎస్ శాన్ ఆంటోనియో యుద్ధనౌక నుంచి బయలుదేరిన హెలికాప్టర్లు, సిబ్బందిని ఖాళీ చేయించిన తర్వాత నౌకలపై ఆయుధాలు ప్రయోగించి వాటిని ధ్వంసం చేశాయి. ఇందుకు సంబంధించిన విడియోను కూడా అమెరికా సైన్యం విడుదల చేసింది. ఈ ఫ్యూయలింగ్ కేంద్రాలకు ఈక్వెడార్‌కు చెందిన 'లాస్ చోనెరోస్' అనే నేర ముఠాతో సంబంధాలున్నాయని అమెరికా అధికారులు అనుమానిస్తున్నారు. ఈ సంస్థను అమెరికా ఇప్పటికే విదేశీ ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. ఇలాంటి తేలియాడే ఫ్యూయల్ స్టేషన్ల ద్వారా చిన్నచిన్న స్పీడ్ బోట్లకు ఇంధనం నింపి, వాటి ద్వారా మాదకద్రవ్యాలను ఉత్తర అమెరికా దేశాలకు తరలిస్తున్నారని ఈక్వెడార్ అంతర్గత వ్యవహారాల మంత్రి జాన్ రీంబెర్గ్ వివరించారు.

# ఇరాన్‌లో ఆయిల్ ట్యాంకర్ పేలుడు..

## 11 మంది మృతి



**టెహ్రాన్, సెప్టెంబరు 6:** ఇరాన్‌లో భారీ పేలుడు సంభవించి 11 మంది మరణించగా, ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన పశ్చిమ ఇరాన్, కుర్దెస్థాన్ ప్రావిన్స్‌లోని సనందాజ్ కౌంటీని, హామేదాన్ ప్రావిన్స్‌లోని హామేదాన్ కౌంటీని కలిపే రోడ్డు మార్గంలో జరిగింది. ఈ ఘటన విషయంలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ రోడ్డు మార్గంలో ఆయిల్ ట్యాంకర్ వెళుతుండగా బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో ఆయిల్ ట్యాంకర్.. దాని ముందున్న వాహనాలను ఢీకొంది. ఈ క్రమంలో ఆయిల్ ట్యాంకర్ పేలి, మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న కార్లతోపాటు, ఇతర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో భారీ పేలుడు జరిగి, ఆ వాహనాల్లోని 11 మంది మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను సనందాజ్‌లోని ఆస్పత్రులకు చికిత్స కోసం తరలించారు. ఈ పేలుడు కారణంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కూడా స్తంభించింది. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బ్రేకులు ఫెయిల్ అవ్వడం కారణంగానే ఈ పేలుడు జరిగిందని భావిస్తున్నారు. ప్రస్తుతం దీనిపై విచారణ జరుగుతోంది. ఆ తర్వాతే పూర్తి వివరాలు తెలుస్తాయి. మృతులకు సంబంధించిన వివరాలు కూడా తెలియాల్సి ఉంది.

# గిన్నిస్ రికార్డులకెక్కిన బంగారుకడ్డీ 521.2 కిలోల బరువుతో తయారీ




**మెల్‌బోర్న్, సెప్టెంబరు 6:** పశ్చిమ ఆస్ట్రేలియాకు చెందిన ప్రఖ్యాత పెర్త్ మింట్ ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు కడ్డీని తయారు చేసి సరికొత్త గిన్నిస్ వరల్డ్ రికార్డును నెలకొల్పింది. ఏకంగా 521.2 కిలోగ్రాముల (సుమారు 1,149 పౌండ్లు) బరువున్న ఈ భారీ బంగారు కడ్డీని 99.999 శాతం స్వచ్ఛతతో రూపొందించారు. ఈ అరుదైన ఘనతను జూలై 9, 2026న గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారికంగా గుర్తించింది. గతంలో ఈ రికార్డు 2024లో దుబాయ్‌లోని ఎమిరేట్స్ మింటింగ్ ఫ్యాక్టరీ పేరిట ఉండేది. అప్పుడు వారు 300.12 కిలోల బంగారు కడ్డీని తయారు చేశారు. ఇప్పుడు పెర్త్ మింట్ ఆ రికార్డును బద్దలు కొట్టింది. పూర్తిగా ఆస్ట్రేలియా గనుల నుంచి సేకరించిన బంగారంతోనే ఈ కడ్డీని తయారు చేయడం విశేషం. ఇది సుమారు 90 సెంటీమీటర్ల పొడవు, 20 సెంటీమీటర్ల ఎత్తు, వెడల్పుతో ఆకట్టుకుంటోంది. ఈ భారీ కడ్డీ తయారీ ప్రక్రియ అత్యంత క్లిష్టంగా సాగింది. ఇందుకోసం సుమారు 1.5 టన్నుల ముడి బంగారాన్ని శుద్ధి చేసి, చిన్నవి, పెద్దవి అయిన అనేక కడ్డీలుగా మార్చారు. ఆ తర్వాత వాటన్నింటినీ ప్రత్యేకంగా రూపొందించిన అచ్చులో ఉంచి, ఖ్ఫ్లేమ్‌లెస్ కాస్టింగ్ చాంబర్‌ఖ అనే ప్రత్యేక గదిలో దాదాపు 1,400 డిగ్రీల సెల్సియస్ వద్ద కరిగించారు. అనంతరం అనేక గంటల పాటు నియంత్రిత పద్ధతిలో చల్లబరచగా, ఈ ఏకైక భారీ కడ్డీ రూపుదిద్దుకుంది. ఈ ప్రాజెక్టులో రిఫైనరీ మరియు ప్రయోగశాలకు చెందిన 35 మందికి పైగా నిపుణులు పాలుపంచుకున్నారు. ఆంగ్లోగోల్డ్ అశాంటి ఆస్ట్రేలియా, బీహెచ్‌పీ, ఎవల్యాషన్ మైనింగ్, గోల్డ్ ఫీల్డ్స్ వంటి ప్రముఖ ఆస్ట్రేలియన్ మైనింగ్ కంపెనీలు ఈ బంగారం సరఫరా చేశాయి. ఈ రికార్డు స్థాయి బంగారు కడ్డీని సెప్టెంబర్ చివరి నుంచి పెర్త్ మింట్‌లో నిర్వహించే గోల్డ్ టూర్‌లో భాగంగా ప్రజల సందర్శన కోసం ఉంచనున్నారు. ఇప్పటికే ఒక టన్ను బరువున్న బంగారు నాణెం, లైవ్ గోల్డ్ పౌర్ వంటి ఆకర్షణలు ఉన్నాయి. ఈ ఘనతతో బంగారం శుద్ధిలో ఆస్ట్రేలియా సాంకేతిక నైపుణ్యాన్ని, ప్రపంచ విలువైన లోహాల పరిశ్రమలో తమ స్థానాన్ని మరోసారి చాటుకుంది.

# పంజాబ్‌కుమ్ములాటలవల్లే బాఘేల్‌కు స్థానచలనం..

## అసోం కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా బదలీచేసిన ఎఐసిసి



**రాయ్‌పూర్, సెప్టెంబరు 6:** పంజాబ్ కాంగ్రెస్‌లో నెలకొన్న తీవ్ర వర్గ విభేదాల మధ్య పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఏఐసీసీ ఇంఛార్జ్‌గా ఉన్న ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఆయన స్థానంలో రాజస్థాన్ కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించింది. 2027 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరడంతో ఈ మార్పు చోటుచేసుకుంది. బఘేల్‌ను అసోం కాంగ్రెస్ ఇంఛార్జ్‌గా బదిలీ చేశారు. 2025 ఫిబ్రవరిలో బఘేల్ పంజాబ్ ఇంఛార్జ్‌గా బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ నేతలను ఏకతాటిపైకి తీసుకురావడం, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడం ఆయన ప్రధాన కర్తవ్యం. అయితే, ఆయన హయాంలో అంతర్గత విభేదాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా, పీసీసీ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా వారింగ్ వర్గం, మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జీత్ సింగ్ చన్నీ వర్గాల మధ్య ఆధిపత్య పోరు తీవ్రమైంది. వారింగ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని చన్నీ వర్గం ఒత్తిడి తెచ్చినా, అధిష్ఠానం ఆయననే కొనసాగించడంతో విభేదాలు వీధికెక్కాయి. పార్టీని బలోపేతం చేసేందుకు బఘేల్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించినప్పుడు ఈ అసమ్మతి బహిర్గతమైంది. పాటియాలాలో జరిగిన ఓ కార్యక్రమంలో బఘేల్, వారింగ్‌ల ముందే కొందరు కార్యకర్తలు చన్నీ లావో, పంజాబ్ బచావో అంటూ నినాదాలు చేశారు. గతనెల 6న లూధియానాలో జరిగిన సమావేశంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. భూపేష్ బఘేల్ గో బ్యాక్ అంటూ కొందరు నిరసనకారులు నినాదాలు చేయడంతో సమావేశం రసాభాసగా మారింది. చన్నీ వర్గీయులు బఘేల్‌కు వ్యతిరేకంగా టీషర్టులు ధరించి, ఘర్షణకు దిగడం పార్టీకి తీవ్ర ఇబ్బందికరంగా పరిణమించింది. బఘేల్ కేవలం వారింగ్ వర్గానికే మద్దతిస్తున్నారనే భావన చన్నీ వర్గంలో బలంగా నాటుకుపోయింది. ఈ కారణంతోనే బఘేల్ నిష్పక్ష పాతంగా వ్యవహరించ లేకపోయారని, ఆయన్ను తప్పించడం సరైన నిర్ణయమని చన్నీ వర్గీయులు భావిస్తున్నారు. తాజా మార్పులపై వారింగ్ స్పందిస్తూ సచిన్ పైలట్‌కు స్వాగతం పలు కుతూ, బఘేల్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనకు అసోం బాధ్యతలు అప్పగించినందుకు అధిష్టానానికి, సహకరించిన పంజాబ్ నేతలకు బఘేల్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# బద్దలయిన అనాక్‌క్రాకటోవా అగ్నిపర్వతం

## 209 విమానాలు రద్దు.. 23వేలమంది ప్రయాణీకులకు కష్టాలు

**జకార్తా, సెప్టెంబరు 6:** ఇండోనేషియాలోని అనాక్ క్రాకటోవా అగ్నిపర్వతం ఆదివారం తెల్లవారుజామున భారీగా విస్ఫోటనం చెందింది. ఈ విస్ఫోటనం కారణంగా వెలువడిన బూడిద పశ్చిమ ఇండోనేషియాలోని పలు ప్రాంతాలకు వ్యాపించింది. దీంతో జకార్తాలోని సుకర్ణో – హట్టా అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మొత్తం 209 విమానాలు ఈ అగ్నిపర్వతం కారణంగా ప్రభావితంకాగా సుమారు 22,800 మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేశీయ, అంతర్జాతీయ విమానాలు రెండూ ప్రభావితమయ్యాయని అధికారులు చెబుతున్నారు. జావా, సుమత్రా ద్వీపాల మధ్య ఉన్న సుండా జలసంధిలో అనాక్ క్రాకటోవా అగ్నిపర్వతం ఉంది. ఆదివారం ఉదయం 3:53 గంటల సమయంలో సుమారు 30 సెకన్ల పాటు విస్ఫోటనం జరిగిందని స్థానిక అధికారులు చెబుతున్నారు. అనంతరం రెండు భారీ బూడిద మేఘాలు ఏర్పడ్డాయని, ఒక మేఘం దాదాపు 20 వేల అడుగుల ఎత్తుకు చేరుకుని ఈశాన్య దిశగా కదిలిందని, దీని కారణంగా జకార్తా, బాంటెన్, పశ్చిమ జావా ప్రాంతాలు ప్రభావితమయ్యాయని పేర్కొంటున్నారు. రెండో బూడిద మేఘం ఏకంగా 50 వేల అడుగుల ఎత్తుకు చేరినట్లు సమాచారం. ఇది పశ్చిమ, వాయవ్య దిశగా వ్యాపిస్తూ బాంటెన్, లాంపంగ్, బెంగ్‌కులు, దక్షిణ సుండా జలసంధి, సుమత్రా పశ్చిమాన ఉన్న హిందూ మహాసముద్రంలోని కొన్ని ప్రాంతాలపై ప్రభావం చూపిందని చెబుతున్నారు. బూడిద కారణంగా సుకర్ణోహట్టా విమానాశ్రయంలో మొదట ఉదయం 5:30 గంటల వరకు విమానాలను నిలిపివేయాలని నిర్ణయించినట్లు, తర్వాత కూడా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ఆంక్షలను ఉదయం 9:30 గంటల వరకు పొడిగించారు. విమానాశ్రయంలో రాత్రి పార్క్ చేసిన 170 విమానాలు అక్కడే నిలిచిపోయాయి. పలువురు ప్రయాణికులు టికెట్ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరడంతో పాటు చెక్‌ఇన్ చేసిన సామాన్లను కూడా వెనక్కి తీసుకున్నారు. సింగపూర్‌కు వెళ్లే అంతర్జాతీయ విమానాలపై దీని ప్రభావం ఎక్కువగా కనిపించింది. హాంకాంగ్, సిడ్నీ, ఆమ్‌స్టర్‌డామ్, సియోల్, దోహా, కౌలాలంపూర్ విమానాలు రద్దు, ఆలస్యం లేదా రీషెడ్యూల్ అయ్యాయి. లాంపంగ్, బాలి, సురబయ, మకాసర్ ప్రాంతాలకు వెళ్లే కొన్ని దేశీయ విమానాలపైనా కూడా దీని ప్రభావం పడింది. ప్రస్తుతం ఈ అగ్నిపర్వతం బద్ధలవ్వడం కారణంగా ఎలాంటి ప్రాణనష్టం, గాయాలపాలైనట్లు సమాచారం బయటికి రాలేదు.

# సంక్షిప్త వార్తలు

## ఆప్‌లో చేరిన గ్యాంగ్‌స్టర్ గురుప్రీత్‌సింగ్ సేఖోన్



**ఫిరోజ్‌పూర్, సెప్టెంబరు 6:** పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల ముందు కీలక పరిణమం చోటుచేసుకుంది. నాభా జైలు నుంచి పారిపోయిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న గ్యాంగ్ స్టర్ గురుప్రీత్ సింగ్ సేఖోన్ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)లో చేరారు. ఫిరోజ్‌పూర్ జిల్లాలోని జీరాలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సమక్షంలో పార్టీలో చేరారు. సేఖోన్ రాబోయే ఎన్నికల్లో జీరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆప్ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

## గుండెపోటుతో కన్నుమూసిన జార్ఖండ్ మంత్రి



**రాంచి, సెప్టెంబరు 6:** ఝార్ఖండ్ ప్రభుత్వంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర మంత్రి, ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) సీనియర్ నేత సుదివ్య కుమార్ (56) గుండెపోటుతో మృతి చెందారు. శనివారం రాత్రి గిరిడీలోని తన నివాసంలో అస్వస్థతకు గురికావడంతో, కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సోనుగా గుర్తింపు పొందిన సుదివ్య కుమార్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కేబినెట్‌లో పలు కీలక శాఖలను నిర్వహించారు.

## వివాహ వేడుకలో అగ్నిప్రమాదం.. 22 మంది మృతి



**కిన్షాసా, సెప్టెంబరు 6:** డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఘోర విషాదం చోటుచేసుకుంది. రాజధాని కిన్షాసాలో ఓ వివాహ వేడుకలో జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం 22 మంది మరణించగా, పలువురు గాయపడ్డారు. కిన్షాసా ఉత్తర ప్రాంతంలోని లింగ్వాలాలో ఉన్న ఒక భవనంలో రాత్రిపూట పొద్దుపోయాక ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజాము వరకు మంటలు ఎగిసిపడుతూనే ఉన్నాయి.

## పట్టాలు తప్పిన మహానంద ఎక్స్‌ప్రెస్

**పాట్నా, సెప్టెంబరు 6:** సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం వల్ల మహానంద ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. రైలు ఇంజిన్, రెండు బోగీలు పట్టాలు తప్పాయి. రైల్వే అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సంఘటన వల్ల ఆ రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సంఘటన వల్ల ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు ఈ సమాచారం తెలిసిన వెంటనే రైల్వే అధికారులు, సాంకేతిక బృందాలు, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పట్టాలు తప్పిన రైలు ఇంజిన్, బోగీలను ట్రాక్‌పైకి ఎక్కించే పునరుద్ధరణ పనులు చేపట్టారు.

## జెఎన్‌యుఇలో ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపుల ఫిర్యాదులు..

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ లో ఓ ప్రొఫెసర్‌పై తీవ్రమైన లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. కనీసం 10 మంది విద్యార్థినులు సదరు ప్రొఫెసర్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న యూనివర్సిటీ అధికారులు కేసును ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కి అప్పగించినట్లు సమాచారం. ఈ ఫిర్యాదులు సుమారు నెల రోజుల క్రితమే నమోదైనట్లు తెలుస్తోంది. తొలుత ఓ విద్యార్థిని ఫిర్యాదు చేయగా, విషయం ఇతర విద్యార్థులకు తెలియడంతో కొంతమంది సీనియర్ విద్యార్థులు కూడా ముందుకు వచ్చి అదే ప్రొఫెసర్‌పై ఇలాంటి ఆరోపణలు చేసినట్లు సమాచారం.

# పాల్ఘడ్ ప్రైవేట్ ఆసుపత్రిలో డిప్యూటీ సిఎం షిండే అనుచరుల హల్‌చల్

**ముంబయి, సెప్టెంబరు 6:** ఒక వ్యక్తి చికిత్సకు సంబంధించిన బిల్లుపై వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో శివసేన నేతలు రెచ్చిపోయారు. ఆసుపత్రి సిబ్బందిపై దాడి చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీలో రికార్డైన ఈ సంఘటన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని పాల్ఘడ్‌లో ఈ సంఘటన జరిగింది. జన్మాష్టమి సందర్భంగా దహి హండిలో పాల్గొన్న కృష్ణ భక్త బృందానికి చెందిన ఒక వ్యక్తి గాయపడ్డాడు. ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు అతడ్ని తరలించి చికిత్స అందించారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే సమయంలో రూ.19,866 బిల్లు ఇవ్వడంతో ఆ వ్యక్తికి చెందిన బృంద సభ్యులు ఆగ్రహానికి గురయ్యారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అక్కడ గందరగోళం చెలరేగింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన శివసేన జిల్లా అధ్యక్షుడు కుందన్ సంఖే, నగర అధ్యక్షుడు రాహుల్ ఘరత్, ఆ పార్టీ కార్యకర్తలు ఐసీయూలోకి ప్రవేశించారు. అక్కడున్న వైద్యులు, నర్సులతో వాగ్వాదానికి దిగారు. వారిని బెదిరించారు. అయితే ఈ గొడవను ఆపడానికి ప్రయత్నించిన ఒక రిసెప్షనిస్ట్ చెంపపై శివసేన నేత కొట్టారు. ఒక మహిళా ఉద్యోగిని ఆయన బెదిరించారు. గాయపడిన వ్యక్తికి అమర్చిన ఐవీ డ్రిప్‌ను తొలగించారు. అతడిని ఆసుపత్రి నుంచి తీసుకువెళ్లినట్లు సిబ్బంది ఆరోపించారు. మరోవైపు శివసేన జిల్లా అధ్యక్షుడు కుందన్, నగర అధ్యక్షుడు రాహుల్, స్థానిక ఎమ్మెల్యే రాజేంద్ర గావిత్ కుమారుడు రోహిత్ గావిత్‌తో సహా 17 మందిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆసుపత్రిలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో శివసేన నేతల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి.

# దేశం దాటిపోకుండా చైనా కట్టడి!

## టెక్నాలజీ, క్యాపిటల్, మానవ వనరులపై ఫోకస్



**బీజింగ్,సెప్టెంబరు 6:** తమ దేశ మూలాలుగా కనిపెట్టిన కీలక సాంకేతిక పరిజ్ఞానం ప్రజలు, మూలధనం,దేశం దాటిపోకుండా చైనా ప్రభుత్వం తన పట్టును మరింత బిగిస్తోంది. ఈ క్రమంలోనే, దేశ పౌరులు విదేశాలకు వెళ్లడంపై కఠినమైన నిబంధనలను తీసుకువచ్చింది. పారిశ్రామిక, సాంకేతిక భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని భావిస్తే, పౌరులను దేశం విడిచి వెళ్లకుండా నిరోధించేందుకు అధికారులకు అధికారం కల్పించే ఈ కొత్త నిబంధనలు ఈనెల 15 నుంచి అమల్లోకి రానున్నాయి. సున్నితమైన టెక్నాలజీ, డేటా, నైపుణ్యం కలిగిన నిపుణులు విదేశాలకు తరలిపోకుండా నిరోధించేందుకు చైనా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. చైనాకు చెందిన మనుస్ అనే ఏఐ స్టార్టప్‌ను 2 బిలియన్ డాలర్లతో కొనుగోలు చేసేందుకు మెటా చేసిన ప్రతిపాదనను చైనా అడ్డుకోవడమే ఇందుకు నిదర్శనం. జాతీయ భద్రత కారణాలను చూపుతూ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ ఒప్పందాన్ని డ్రాగన్ సర్కార్ రద్దు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం, టెక్నాలజీ దిగుమతి లేదా ఎగుమతి నిబంధనలను ఉల్లంఘించి దేశ పారిశ్రామిక, సాంకేతిక భద్రతకు ప్రమాదం కలిగించే వారిని దేశం విడిచి వెళ్లకుండా నిరోధించవచ్చు. విదేశాల్లో చైనా జాతీయ భద్రతకు, ప్రయోజనాలకు హాని కలిగించే నేరాలకు పాల్పడిన వారు దేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఆరు నెలల నుంచి మూడేళ్ల వరకు విదేశాలకు వెళ్లకుండా నిషేధం ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ ఆంక్షలు కేవలం ప్రజలకే పరిమితం కాలేదు. దేశం నుంచి మూలధనం, వ్యూహాత్మక ఆస్తులు తరలిపోకుండా నిరోధించే ప్రయత్నాల్లో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నారు. ఒక వ్యక్తి ఏడాదికి 50వేల డాలర్ల కంటే ఎక్కువ విదేశీ మారకాన్ని కొనుగోలు చేయరాదనే నిబంధన ఇప్పటికే ఉంది. గతేడాది చైనా వాణిజ్య మిగులు రికార్డు స్థాయిలో 1.2 ట్రిలియన్ డాలర్లకు చేరడంతో, చైనా కంపెనీలు, వ్యక్తులు భారీగా విదేశీ ఆస్తులు, సెక్యూరిటీలలో పెట్టుబడులు పెడుతున్నారు.

ఈ నేపథ్యంలో విదేశీ పెట్టుబడులపై ప్రభుత్వం నిఘాను మరింత కఠినతరం చేసింది. చైనా స్టేట్ కౌన్సిల్ జూన్‌లో విడుదల చేసిన నిబంధనల ప్రకారం,

పెట్టుబడిదారులు నియంత్రిత టెక్నాలజీ, డేటా, ఇతర నియంత్రిత వస్తువులు లేదా సేవలను విదేశీ పెట్టుబడుల ద్వారా ఎగుమతి చేయడాన్ని నిషేధించారు.

# ఇజ్రాయెల్‌పై మెరుపుదాడులకు రూటు మార్చిన ఇరాన్

## హామాస్, హెజ్బొల్లా, హౌతీలతో ఏకకాలంలో ముప్పేట దాడులు

**టెహ్రాన్; సెప్టెంబరు 6:** అమెరికా సాయంతో ఇరాన్ పై ఇజ్రాయెల్ మొదలుపెట్టిన దాడులు ఆరు నెలలుగా కొనసాగుతూనే ఉన్నాయి. దీనికి ఎలా ముగింపు పలకాలో తెలియక అమెరికా సతమతం అవుతూనే ఉంది. మధ్యలో చర్చలు, శాంతి ఒప్పందం పేరుతో కొంతకాలం హంగామా చేసినా, ఇజ్రాయెల్ ఒత్తిడితో అమెరికా ఈ యుద్ధాన్ని ఇంకా కొనసాగిస్తోంది. రెండు నెలల్లో అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ఎదుర్కోబోతున్న ట్రంప్ సర్కార్ కు ఇరాన్ యుద్ధం తలనొప్పిగా తయారైంది. దీంతో కొంతకాలం యుద్ధాన్ని ఆపి, ఇరాన్ ను ఆర్థిక దిగ్బంధం చేసే దిశగా ట్రంప్ ఎత్తులు వేస్తున్నారు. దీంతో ఇదే అదనుగా ఇరాన్ రూటు మారుస్తోంది. ఇన్నాళ్లూ అమెరికా అండతో తమపై రెచ్చిపోయిన ఇజ్రాయెల్ పై ప్రతీకారం తీర్చుకునేందుకు ఇరాన్ భారీ వ్యూహారచన చేస్తోంది. ఇందులో భాగంగా ఒకేసారి తమకు అండగా ఉంటున్న మిలిటెంట్ గ్రూపులు హమాస్, హిజ్బొల్లా, హౌతీలతో కలుపుకుని ఇజ్రాయెల్ పై మెరుపుదాడి చేసేందుకు ఇరాన్ ప్లాన్ చేస్తోంది. 2023 అక్టోబర్ 7న హమాస్ జరిపిన మెరుపు దాడి తరహాలోనే, ఈసారి అంతకంటే ప్రమాదకరమైన ఉమ్మడి వ్యూహాన్ని అమలు చేయాలని ఇరాన్ యోచిస్తోంది. ఇజ్రాయెల్ ను అన్ని వైపుల నుంచి ఏకకాలంలో ముట్టడించి, ఆత్మరక్షణలో పడేయడమే ఈ సరికొత్త ఆపరేషన్ యొక్క ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. హిజ్బుల్లా, హమాస్, హౌతీలతో ఇజ్రాయెల్ సైనిక అంచనాల ప్రకారం, ఈ ఉమ్మడి సైనిక చర్యలో లెబనాన్‌కు చెందిన హిజ్బుల్లా, గాజాలోని హమాస్, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారుల, ఇరాక్‌లోని బలమైన ఇరాన్ అనుకూల మిలిషియాలను ఏకతాటిపైకి తీసుకురావడానికి తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత అక్టోబర్ 7 దాడి ప్రధానంగా హమాస్ నేతృత్వంలో మాత్రమే సాగింది. అయితే, ఈసారి అన్ని భాగస్వామ్య శక్తులు ఒకే బలమైన వ్యూహంలో భాగంగా ప్రారంభం.

06ATP26_06ATP26.qxd 06-09-2026 PM 11:19 Page 1



# ధర్మవరంలో అర్ధరాత్రి విస్తృత నాకాబంది

- అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక తనిఖీలు - 14 ప్రాంతాల్లో 14 ప్రత్యేక బృందాలతో తనిఖీలు - 12 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు - 43 వాహనాలు, 3 ఆటోలు స్వాధీనం - రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాల కట్టడికి చర్యలు : అడిషనల్ ఎస్పీ



అర్ధరాత్రి నాకాబంది తనిఖీలను పరిశీలిస్తున్న దృశ్యం



అనుమానాస్పద వాహనాలను నిలిపి తనిఖీ చేస్తున్న పోలీసు బృందాలు

ధర్మవరంటౌన్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త

నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా ధర్మవరం పట్టణంలో పోలీసులు విస్తృతంగా నాకాబంది తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల వరకు ఈ ప్రత్యేక తనిఖీలు కొనసాగాయి.అడిషనల్ ఎస్పీ అంకిత సురాణ ఐపీఎస్ ఆధ్వర్యంలో డీఎస్పీ జగన్నాథ్‌రాజు, సీఐలు రెడ్డప్ప, జయనాయక్, ప్రభాకర్, మహమ్మద్ అలీ,సునీత,రామసుబ్బయ్య, ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని 14 ప్రాంతాల్లో 14 ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో వాహన తనిఖీలు చేపట్టారు.ప్రధాన రహదారులు, సరిహద్దు మార్గాలు, రద్దీ ప్రాంతాలు, ముఖ్యమైన కూడళ్ల వద్ద నాకాబంది పాయింట్లు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో 43 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా... నాకాబంది తనిఖీల్లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 12 మందిపై కేసులు నమోదు చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేసి వివరాలను ఆరా తీశారు. రాత్రి వేళల్లో అనవసరంగా సంచరించే వ్యక్తులు, అనుమానాస్పద వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.రాత్రి వేళల్లో జరిగే నేరాలు, చోరీలు, అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిఘా ఉంచడం, నేరాలను పూర్తిగా అణిచివేయడమే నాకాబంది తనిఖీల ప్రధాన ఉద్దేశమని అడిషనల్ ఎస్పీ అంకిత సురాణ తెలిపారు.కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి జిల్లాలోకి వచ్చే వాహనాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని, అనుమానాస్పద వాహనాలు, వ్యక్తుల కదలికలను ముందుగానే గుర్తించి నేరాలను అడ్డుకునేలా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు.ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై సంచరించకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆమె సూచించారు. ఈ ప్రత్యేక నాకాబంది కార్యక్రమంలో డీఎస్పీ జగన్నాథ్‌రాజు, సీఐలు, ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ అంకిత సురాణ ఐపీఎస్

## పల్లె కిషోర్ కి శుభాకాంక్షలు తెలియజేసిన తెదేపా నాయకులు



పల్లె కిషోర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దృశ్యం

కొత్తచెరువు సెప్టెంబరు 6 ప్రభాతవార్త

మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కుమారుడు శ్రీ బాలాజీ విద్యాసంస్థలు అధినేత పల్లె వెంకట కృష్ణ కిషోర్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసిన తెదేపా నాయకులు అనంతపురంలోని ఆయన స్వగృహం నందు కొత్తచెరువు మండలం కు చెందిన కన్వీనర్ వలిపి శ్రీనివాసులు రిటైర్డ్ టీచర్ నాగేంద్ర ప్రసాద్ ఐ టి డి పి అసెంబ్లీ సెక్రటరీ తలారి సురేష్ మర కుంటపల్లి ఈశ్వర్ రెడ్డి బూత్ కన్వీనర్ భాగ్య వెంకటేష్ వెంకట్రాముడు తదితరులు ఆయన మర్యాదపూర్వకంగా కలసి పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించారు అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బర్త్డే కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు భవిష్యత్తులో పల్లె కిషోర్ ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో ఉండాల నీ మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు

## కేసాని నాగన్న కు నివాళులర్పించిన సామకోటి ఆదినారాయణ



నాగన్న మృతదేహానికి నివాళులర్పిస్తున్న సామకోటి

పెనుకొండ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

చెన్నేకొత్తపల్లి మండలం, ఓబులంపల్లి గ్రామానికి చెందిన కురుబ కేసాని నాగన్న మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర కురుబ సంఘం నాయకులు సామకోటి ఆదినారాయణ ఆదివారం మృతుని నివాసానికి వెళ్లి నాగన్న మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పి, నాగన్న ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు.

## చేతిలో మొక్క.. కొండ చుట్టూ ప్రదక్షిణ

ఆంధ్ర అరుణాచలంగా కుందుర్పి కొండకు ప్రత్యేక ఖ్యాతి



గిరి ప్రదర్శన పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కుందుర్పి (కళ్యాణదుర్గం), సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

ఆధ్యాత్మికతను పర్యావరణ పరిరక్షణతో మేళవిస్తూ ఆంధ్ర అరుణాచలంగా ఖ్యాతికెక్కిన కుందుర్పి కొండ గిరి ప్రదక్షిణకు నిర్వాహకులు వినూత్న రూపాన్ని తీసుకొస్తున్నారు. ....కేవలం గిరి ప్రదక్షిణ కాదు.. చేతిలో మొక్క పట్టుకొని ప్రదక్షిణ.. అనంతరం మొక్క నాటడం... అనే హరిత సంకల్పంతో నిర్వహించనున్న కార్యక్రమం భక్తుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కుందుర్పి కొండ గిరి ప్రదక్షిణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పోస్టర్లను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే ప్రతి భక్తుడు ఒక మొక్కను చేతబట్టి ప్రదక్షిణ చేసి, అనంతరం దానిని నాటడం ద్వారా ఈ హరిత సంకల్పంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కుందుర్పి కొండ చుట్టూ ప్రదక్షిణ చేయడం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించడంతో పాటు, ప్రకృతి పరిరక్షణకు సందేశాన్ని అందించేలా కార్యక్రమాన్ని తీర్చిదిద్దుతున్నారు. భక్తుల అడుగులతో పాటు పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమం గిరి ప్రదక్షిణకు మరింత విశిష్టతను తీసుకురానుంది. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చౌలం మల్లికార్జున, డిస్కవరీ ఛానల్ అనిల్ అన్న, బీజేపీ తాలూకా కోకన్వీనర్ గంగాధర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మల్లికార్జున, మాజీ కోఆప్షన్ మెంబర్ తాహిర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వై.బి. ఓబయ్య, టీడీపీ మాజీ బెస్ట్ బూత్ కన్వీనర్ గొల్లపల్లి ప్రసాద్, ఎర్రగుంట ఆనంద్, అమరావతి నారప్ప, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు మహేష్, ఐటీడీపీ కోకన్వీనర్ మఠం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## వరి, మిరప పంటలను సాగు చేయకండి అగ్రికల్చర్ ఆఫీసర్ గోపాల్

బ్రహ్మసముద్రం సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

ప్రస్తుత ఖరీఫ్ 2026 సీజన్ కి ఏర్పడిన సూపర్ ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, త్రాగునీటికి ప్రాధాన్యం ఉన్న చేత, రైతులందరూ ఎక్కువ నీటి అవసరం ఉండే పంటలైన వరి మరియు మిరప పంటలను సాగు చేయకూడదు. భూగర్భ జలాలు కూడా తగ్గుతున్న మూలాన, ఇప్పటికే సాగు చేసిన వారు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, జొన్న సజ, పెసలు, అలసందలు, కొర్రలు మరియు అనప పంటల వైపు మొగ్గు చూపాలని కోరడమైనది. ప్రస్తుత సీజన్ కి 80 శాతం రాయితీతో ప్రత్యామ్నాయ పంటలు విత్తనాలైన, ఉలవలు విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడం జరుగుతుంది. ఈ పంటలు వేయాలనుకున్న రైతులు రైతు సేవ కేంద్రం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరడమైనది. ఖరీఫ్ 2026 లో ఎటువంటి పంట సాగు చేయని పొలాలకు మాత్రమే రాయితీపై ప్రభుత్వం అందిస్తోంది. అవసరమున్న అర్హులైన రైతులు మాత్రమే విత్తనాలు తీసుకొని వాటిని తప్పనిసరిగా సాగు కొరకే వినియోగించాలి. ప్రభుత్వం అందించిన విత్తనాలు రైతు సాగు చేశారో లేదో ఈ క్రాప్ బుకింగ్ ద్వారా పరిశీలిస్తామని తెలపడమైనది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలపడం అయినది. అలాగే ప్రస్తుత సీజన్ కి పంట వేసిన ప్రతి ఒక్క రైతు సేవ కేంద్రం సిబ్బంది ద్వారా ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని, అలాగే వారు వేసిన పంటను ధ్రువీకరించి ఈ కేవైసీ కూడా చేయించుకోవాలి. ఇన్సూరెన్స్ కట్టిన ప్రతి ఒక్క రైతు కూడా క్రాప్ బుకింగ్ లో అదే పంట నమోదు కావాల్సి ఉంటుంది. రైతులే వారి సొంతంగా తిశితిటీలీ అప్లికేషన్ ద్వారా వారు వేసిన పంటని బుక్ చేసుకోవచ్చును, తదుపరి క్షేత్రస్థాయి సిబ్బంది పొలాలను పరిశీలించి అప్రూవ్ చేయడం జరుగుతుంది. అలాగే ఈ సంవత్సరం నుంచి ప్రభుత్వం ద్వారా ఏర్పాటయ్యే కొనుగోలు కేంద్రాల ద్వారా లబ్ది పొందాలనుకుంటే ప్రతి రైతు తప్పనిసరిగా విశిష్ట సంఖ్య ఉండి తీరాలి.

## మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

గుత్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త



బాధితురాలు రమాదేవి

గుత్తి పట్టణంలోని తాడిపత్రి రోడ్డు జంగాల కాలనీలో రమాదేవి అనే మహిళ మెడలో 25 గ్రాముల బంగారు ఆభరణాన్ని గుర్తు తెలియని అగంతకుడు అపహరించాడు. రాత్రి ఆమె వాకింగ్ చేస్తుండగా పల్సర్ బైక్ పై హెల్మెట్ ధరించి వచ్చిన అగంతకుడు ఆమె మెడలో ఉన్న బంగారు చైనును లాక్కొని పరారీ అయ్యాడు. ఈ సంఘటనలో ఆమె స్వల్పంగా గాయపడింది. అతడిని పట్టుకోవడానికి స్థానికులు ప్రయత్నించగా పరారీ అయ్యాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వన్నెదొడ్డిలో 10 కుటుంబాలు టిడిపిలో చేరిక



టిడిపిలో చేరిన దృశ్యం

గుత్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

గుత్తి మండలం వన్నెదొడ్డి గ్రామంలో ఆదివారం టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఆధ్వర్యంలో వైకాపాకు చెందిన 10 కుటుంబాలు టిడిపిలో చేరారు. గిరిస్వామి, ధనలక్ష్మి, దేవేంద్ర, రామాంజనేయులు, పరమేష్, మంజునాథ్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ఎమ్మెల్యే నాయకత్వంపై విశ్వాసంతో తాము టిడిపిలో చేరామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అడిషనల్ స్పెషల్ క్యాంపెనింగ్‌లలో 255 దరఖాస్తులు

- పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసిన ఈఆర్‌వో ఎం.రామ్‌మోహన్
- ఫిజికల్ వెరిఫికేషన్ నిబంధనల మేరకు జరుగుతుందన్న ఈఆర్‌వో



స్పెషల్ క్యాంపెన్‌ను తనిఖీ చేస్తున్న ఈఆర్‌వో ఎం.రామ్‌మోహన్



వై.రాంపురంలో తనిఖీ చేస్తున్న సూపర్‌వైజర్

ఉరవకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

ప్రత్యేక సమగ్ర సవరణ-2026లో భాగంగా శని, ఆదివారాల్లో జరిగిన అడిషనల్ స్పెషల్ క్యాంపెనింగులలో ఉరవకొండ నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి బీఎల్‌వోలకు 255 దరఖాస్తు అందాయని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రామ్‌మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన నియోజకవర్గంలోని వివిధ పోలింగ్ స్టేషన్లలో జరుగుతున్న అడిషనల్ స్పెషల్ క్యాంపెనింగ్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఆర్‌వో ఎం.రామ్‌మోహన్ మాట్లాడుతూ శనివారం ఫారమ్-6 దరఖాస్తులు 93, ఫారమ్-8 దరఖాస్తులు 63 వచ్చాయన్నారు. ఆదివారం ఫారమ్-6 దరఖాస్తులు 64, ఫారమ్-8 దరఖాస్తులు 35 వచ్చాయని వివరించారు. బీఎల్‌వోలు స్వీకరించిన అన్ని దరఖాస్తులు, క్లైములను సక్రమంగా నమోదుచేసి అవసరమైన ఫిజికల్ వెరిఫికేషన్, లోకల్ ఎంక్వైరీలను నిబంధనల మేరకు పూర్తి చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వరప్రసాద్ ఉన్నారు.

## ఘనంగా బి హెచ్ రాయుడు కుమార్తె వివాహం



వివాహ కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

గుడిబండ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

మండల పరిధిలోని తిమ్మలాపురం గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు,వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి, సామాజిక దళిత ఉద్యమ నేత తిమ్మలాపురం గ్రామానికి చెందిన బీహెచ్ రాయుడు కుమార్తె శ్రీలత, నాగేంద్రబాబు ల వివాహం పరిగి మండల కేంద్రంలోని శ్రీ బీరలింగేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు.ఈ వివాహ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.అలాగే మాజీ ఎమ్మెల్యేలు వై.టి. ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, ఈరన్న, నళిని రంగేగౌడ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బి. శివకుమార్, ఈరలక్కప్ప, జడ్పీటీసీలు అనంతరాజు, ఉమేష్, తదితరులు పాల్గొని నూతన వధూవరులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.వివాహ వేడుకకు హాజరైన అతిథులకు బీహెచ్ రాయుడు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



కనేకల్ సెప్టెంబరు 6 ప్రభాతవార్త

కనేకల్ మండలం శ్రీ చిక్కన్నేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు కురుబ తిప్పేస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీని మండల స్థాయిలో మరింత బలోపేతం చేయడం, భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం ప్రధాన అంశాలుగా ఉన్నాయి. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యాచరణ, సన్నద్ధతపై నాయకులు చర్చించారు. ఈ కార్యక్రమానికి మండల ఇన్‌చార్జ్ ఓ. తిమ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, హీరోజి రావు, మండల ఉపాధ్యక్షులు కే. నాగరాజు, ఓబీసీ మండల అధ్యక్షుడు కే. పోతిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఏ. తిప్పారెడ్డి, సీనియర్ నాయకులు హురలి నాగభూషణ, కేంచన గౌడ్, నరేంద్ర, హేమంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

## భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కళ్యాణోత్సవం కన్నుల పండువగా

- ఆలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు

ఉరవకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త



వీరభద్రస్వామి

ఉరవకొండ పట్టణంలోని బ్రాహ్మణ వీధిలోగల పేట వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కళ్యాణోత్సవం స్వస్తిశ్రీ పరాభవసునామ సంవత్సరం శ్రావణ శుద్ధ దశమి ఆదివారం ఉదయం అభిజిత్ లగ్నంలో కన్నుల పండువగా జరిగింది. ఆలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం నుండి మేళతాళాలు నడుమ గంగనీరు, స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. శ్రీశైలం గురుకుల వేదపాఠశాల అర్చకులు యం.శివశంకరస్వామి ఆధ్వర్యంలో కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించగా వీరభద్రస్వామి తరుపున ప్రీతి, భూవనగిరి కార్తీక్, భద్రకాళీ అమ్మవారి తరుపున రెడ్డి గౌరి, రెడ్డి బసవరాజు దంపతులు పాల్గొన్నారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ గుడి బండయ్య, దాతలు, కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.




భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## స్థానిక ఎన్నికల సమన్వయకర్తగా చిలకం మధుసూదన్ రెడ్డి

హిందూపురం, కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గాల బాధ్యతలు

ధర్మవరంటౌన్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త



చిలకం మధుసూదన్ రెడ్డి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డిని హిందూపురం, కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గాల స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్తగా నియమించింది. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం బాధ్యతలను అప్పగించింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, సమన్వయం కోసం చిలకం మధుసూదన్ రెడ్డితో పాటు మరో 20 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక కోఆర్డినేషన్ టీమ్‌ను కూడా పార్టీ ఏర్పాటు చేసింది. ఈ బృందం ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు, గ్రామ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లనుంది.స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ బలమైన ప్రాతినిధ్యం సాధించేలా అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయి రాజకీయ పరిస్థితులపై సమాచారం సేకరణ, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం వంటి అంశాలపై కోఆర్డినేషన్ టీమ్ ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. ఎన్నికలకు ముందస్తు కార్యాచరణ రూపొందించి పార్టీ శ్రేణులను సమన్వయంతో ముందుకు నడిపించడమే లక్ష్యంగా ఈ బృందం పనిచేయనుంది.

## గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

: యస్ ఐ సాయికుమార్ స్పష్టీకరణ

బ్రహ్మసముద్రం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త



ఎస్సై సాయికుమార్

గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని బ్రహ్మసముద్రం యస్ ఐ సాయి కుమార్ సూచించారు. గణేష్ ప్రతిమలను ఏర్పాటు చేయదలచిన నిర్వాహకులు ముందస్తుగా సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. వినాయక చవితి సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో గణేష్ మండపాల ఏర్పాటుకు ఉత్సవ కమిటీలు ముందుగానే పోలీసు శాఖకు సమాచారం అందించి అనుమతులు పొందాలని తెలిపారు. మండపాల ఏర్పాటులో ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకు ండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా గణేష్ మండపాల వద్ద విద్యుత్ భద్రత, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాల నియస్ ఐ పేర్కొన్నారు. ఊరేగింపుల సమయంలో డీజేలు, అధిక శబ్దం వంటి అంశాల్లో ప్రభుత్వ నిబంధనలను పాటించాలని సూచిం చారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకు లు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని యస్ ఐ హెచ్చరించారు. గణేష్ ఉత్సవాలు సోదరభావం, భక్తి, ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా అందరూ సహకరించాలని కోరారు.

## ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన 100 మందికి దంత, ఫిజియోథెరపీ సేవలు



ఉచిత దంత, ఫిజియోథెరపీ వైద్య శిబిరంలో సేవలందిస్తున్న దృశ్యం

ధర్మవరం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త

చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత దంత వైద్య, ఫిజియోథెరపీ శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీ రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల, ధర్మవరం వారి సహకారంతో రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 100 మందికి దంత వైద్యం, ఫిజియోథెరపీ సేవలు అందించినట్లు క్యాంపు కోఆర్డినేటర్ చౌదయ్య తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ లైఫ్ మెంబర్ సత్యనిర్ధారణ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని పరిశీలించారు.అనంతరం స్వచ్ఛంద సేవలకు సహకరించిన బయన్న, అస్వర్త నారాయణ, చౌదయ్య, దంత వైద్య నిపుణుడు డాక్టర్ రాఘవేంద్ర, అంతర్జాతీయ మోకాళ్ల సంరక్షణ సమితి అధ్యక్షుడు మల్లికార్జున తదితరులను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సన్మానించారు.ఈ సందర్భంగా సత్యనిర్ధారణ మాట్లాడుతూ దంత, ఫిజియోథెరపీ సేవలతో పాటు భవిష్యత్తులో నిర్వహించే వైద్య శిబిరాల్లో రక్తగ్రూపింగ్, రక్తంలో చక్కెర పరీక్షలను కూడా చేర్చాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మల్లికార్జున, డాక్టర్ నాగార్జున, ఆరోగ్య కార్యకర్తలు హారిక, సుశీల, కొండారెడ్డి, ఎల్ఐసీ ఏజెంట్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగుడి గ్రామానికి చెందిన వీఆర్ఏ తలారి ఓబులప్పుకు రిమాండ్

బెలుగుప్ప సెప్టెంబర్ 5 ప్రభాత వార్త

బెలుగుప్ప మండల పరిధిలో ఎర్రగుడి గ్రామానికి చెందిన వీఆర్ఏ తలారి ఓబులప్ప తండ్రి పెన్నయ్య అదే గ్రామానికి చెందిన మహిళతోసభ్యక రంగా ప్రవర్తించినందుకు ఆగస్టు నెలలో కేసు నమోదయింది ఈ కేసులో భాగంగా కళ్యాణ్ దుర్గం కోర్టు నందు హాజరపరిచి కోర్టు ఆదేశాల మేరకు అక్కడి నుండి 14 రోజులు రిమాండ్ నిమిత్తం అనంతపురం జిల్లా జైలుకు తరలించారు.

# రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ కమిటీ సభ్యులకు జె.సి నివాసంలో తేనీటి విందు

- వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌కు ఘన సన్మానం




వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను సన్మానించిన జెసి ప్రభాకర్‌రెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, మత పెద్దలు, నాయకులు

**తాడిపత్రిఅర్బన్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

తాడిపత్రిలోని జె.సి నివాసంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యులకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి తేనీటి విందును ఏర్పాటు చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో పాటు కమిటీ సభ్యులు తాడిపత్రి వక్ఫ్ బోర్డు అధ్యక్షులు మహమ్మద్ కుమారుని నిఖా వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం జె.సి ప్రభాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి అబ్దుల్ అజీజ్‌ను ఆప్యాయంగా స్వాగతించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అబ్దుల్ అజీజ్ రాకతో జె.సి నివాసంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ జె.సి ప్రభాకర్‌రెడ్డి లాంటి సీమసింహాన్ని కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి నాయకులు రాష్ట్రంలో చాలా అరుదుగా ఉంటారన్నారు. కాబోయే కొత్త తరం రాజకీయ నాయకులకు వీరు ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఆయనకున్న రాజకీయ చతురత, గుండె ధైర్యం ఎవరికి లేవన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని దేవుని ప్రార్థిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సభ్యులు, ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలకై పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పెద్దమ్మతల్లికి జలాభిషేకం చేస్తున్న దృశ్యం

**పుట్లూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ పుట్లూరు మండలం తక్కళ్లపల్లి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవత అయిన పెద్దమ్మతల్లి విగ్రహానికి 101 బిందెల నీటితో అభిషేకం చేశారు. వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొనడంతో గ్రామస్తులు అమ్మవారిని ప్రార్థిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. 101 బిందెలతో అమ్మవారికి జలాభిషేకం చేసి, పూజలు నిర్వహించి వర్షాలు సమృద్ధిగా కురవాలని మొక్కుకున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# రాష్ట్ర బిసి మాజీ డైరెక్టర్ తల్లి అనారోగ్యంతో మృతి

నివాళులు అర్పించిన నాయకులు



నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ మాబు సాబ్

**నల్లచెరువు సెప్టెంబర్ 6 ప్రభాతవార్త,**

మండల కేంద్రంలోని రాష్ట్ర మాజీ డైరెక్టర్ దశరథ రామయ్య నాయుడు తల్లి ఎ నుగొండ గంగులమ్మ 86, అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. పరామర్శించడానికి మాజీ ఎంపీపీ మాబు సాబ్ అక్కడికి చేరుకొని గంగులమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏనుగొండ కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగడ సానుభూతి తెలియజేశారు. పరామర్శలో తెదేపా సీనియర్ నాయకులు అబ్దుల్ ఖాదర్ మాజీ డైరెక్టర్ ఎద్దుల అంజనప్ప, రమేష్ నాయుడు, రామాంజులు. నాసు నరసింహులు, వేమయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు

# గంగులమ్మ మృతిపై వైసిపి నాయకులు పరామర్శ



నివాళులర్పిస్తున్న మండల వైసిపి నాయకులు

**నల్ల చెరువు సెప్టెంబర్ 6 ప్రభాతవార్త,**

బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ దశరథ రామయ్య నాయుడు తల్లి ఏనుగొండ గంగులమ్మ 86, అనారోగ్యంతో శనివారం రాత్రి సమయంలో మృతి చెందారు విషయం తెలుసుకున్న వైసీపీ మండల కన్వీనర్ మొండెం రవి కుమార్ రెడ్డి పలువురు వైసిపి నాయకులు తో కలిసి గంగులమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు దశరథ రామానాయుడు తోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ పరామర్శలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి , పో రెడ్డి వెంకటరెడ్డి ,గోవింద్ రెడ్డి, బూసిపల్లి నరసింహారెడ్డి, రమణారెడ్డి హరీష్ శెట్టి నగేష్ కుమార్. ఉత్తన్న, గోవింద్ రెడ్డి, వెంకట్ నర్సు, అల్లా బక్స్, సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల మందపై దూసుకెళ్లి వ్యాన్

-10 గొర్రెలు మృత్యువాత, రూ.1.5 లక్షలు ఆస్తినష్టం

**ఉరవకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



పేపర్ వ్యాన్ దూసుకెళ్లడం మృతి చెందిన గొర్రెల దృశ్యం

విడపనకల్లు మండలం మాళాపురం గ్రామంవద్ద ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో వ్యాన్ అదుపుతప్పి గొర్రెల మందపై దూసుకెళ్లిన ఘటనలో 10 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. పోలీసులు, స్థానికుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే... అనంతపురం నుండి బళ్లారికి వెళుతున్న వ్యాన్ మార్గమధ్యంలో మాళాపురం గ్రామంవద్ద అదుపుతప్పి రూపనగుడి సమీపంలోని యాల్పి గ్రామం నుండి మేపుకురావడానికి గాను ఉరవకొండ వైపుగా వస్తున్నగొర్రెల మందపై దూసుకెళ్లినట్లు సమాచారం. దీంతో 10 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మరో 6 గొర్రెలు గాయపడినట్లు తెలుస్తోంది. స్థానికులు ఘటన గురించి పోలీసులకు సమాచారం అందించగా వారు ప్రమాదానికి కారణమైన వ్యాన్‌ను గుర్తించినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో గొర్రెల యజమానికి దాదాపు 2 లక్షల రూపాయల వరకు ఆస్తినష్టం జరిగిందని తెలుస్తోంది.

# ఉరవకొండ మీదుగా టుంకూరుకు రైలు మార్గానికి కృషి చేయండి

-బీజేపీ జాతీయ నేత ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డికు విన్నవించిన గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి మూడ్ కేశవనాయక్

**ఉరవకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డికు విన్నవిస్తున్న గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి మూడ్ కేశవనాయక్

గుంతకల్లు నుండి ఉరవకొండ మీదుగా టుంకూరుకు రైలు మార్గం ఏర్పాటుకు కృషి చేయాలని బీజేపీ జాతీయ పార్టీ విభాగాల సహసమ న్వయకర్త ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డికు గిరిజన మోర్చా రా ష్ట్ర కార్యదర్శి మూడ్ కేశవనాయక్ విన్నవించారు. ఆయన సహసమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టి తొలిసారి కదిరికి వచ్చిన సందర్భంగా ఆయన్ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మూడ్ కేశవనాయక్ మాట్లాడుతూ ఉరవకొండ మీదుగా టుంకూరు రైలు మార్గం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్, కర్నాటక సరిహద్దుల్లోని పూర్తిగా వెనుకబడిన అనేక ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గుంతకల్లు నుండి ఉరవకొండ, కళ్యాణదుర్గం, మడకశిర మీదుగా కర్నాటకలోని మధుగిరి మీదుగా టుంకూరుకు బ్రాడ్‌గేజ్ రైలు మార్గం ఏర్పాటు ప్రతిపాదన బ్రిటీష్ హయాం నుండే ఉందన్నారు. అయితే సదరు ప్రతిపాదన ముందుకు వెళ్లలేదని రైలు మార్గం కోసం కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఒప్పించాలని కోరారు. రైలు మార్గం ఏర్పాటైతే ఉరవకొండ ప్రాంత ప్రజల దశాబ్దాల కల సాకారమవుతుందని ఈ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెంది ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీజేపీ సీనియర్ నాయకులు లాలెప్ప, మాణిక్యం, మురళీనాయక్, సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

# వినాయక మండపాలలో నిబంధనలు పాటించాలి

**కనేకల్ సెప్టెంబర్ 06 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న ఎస్ఐ నాగ మధు

వినాయక మండపాల్లో డీజే సౌండ్ లు పెట్టిన మందు తాగి చిందులు వేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై నాగమధు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగ మధు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా వినాయకమండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సబ్ ఇన్స్పెక్టర్ నాగమధు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరుల తో మాట్లాడారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా పోలీస్ శాఖ నుండి అనుమతులు తీసుకోవాలన్నారు. అదేవిధంగా విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు మండపాలు వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాకుండా విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. విగ్రహాల వద్ద సౌండ్ బాక్సులు పెద్దగా లేకుండా ఇతరులకు హాని కలిగించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. విగ్రహం నిలబెట్టే ప్రతి ఒక్కరూ మూడు రోజుల లోపల నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జనం రోజు సాయంత్రం 6 గంటల లోపల నిమజ్జనం చేసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు ఎలాంటి డీజే లు టపాసులు లేకుండా శాంతియుతంగా నిమజ్జనం చేసే విధంగా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని గ్రామాల్లో రోడ్లపై తాళ్లు పట్టుకొని బలవంత వసూళ్లు చేయరాదని వినాయక చవితి పండుగలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కమిటీ సభ్యులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. వినాయక చవితి పండుగలో ఘర్షణలు చోటు చేసుకుంటే అందుకు కమిటీ సభ్యులే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని సూచించారు. డీజే లు పెట్టి మందు సేవించి అల్లర్లు సృష్టిస్తే అలాంటి వారిపై చట్టపరమైన కట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రికు కృతజ్ఞతలు

-ప్రభుత్వ విశ్రాతం ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.కిష్టప్ప

**ఉరవకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



కె.కిష్టప్ప

పెన్షనర్లకు తగ్గించిన అడిషల్ క్వాంటంను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పెన్షనర్ల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.కిష్టప ్ప తెలిపారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల్లో రెండు డీఏలు ఇవ్వడానికి, పీఆర్‌సీ కమీషన్ నియామకానికి, ఆరోగ్య సేవలకు ప్రతినెలా చెల్లింపులకు నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామమన్నారు.

# దాడి చేశాడని పోలీసులకు ఫిర్యాదు

**పుట్లూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

పుట్లూరు మండలం గాండ్లపాడు గ్రామానికి చెందిన విరుపాకుల ఆంజనేయులు అలియాస్ చిరంజీవి అనే వ్యక్తి శనివారం అకారణంగా తనపై దాడి చేసి రక్తగాయాలు చేశాడని ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణరెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సురేంద్రబాబు తెలిపారు. తనపై దాడి చేయడంతో పాటు పాఠశాలలోని ఫర్నీచర్, ప్రభుత్వం జారీ చేసిన టివిని కూడా ధ్వంసం చేశాడని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ప్రధానోపాధ్యాయుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

# ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ప్రభుత్వ ఉద్యోగులు

- ఉద్యోగులకు, పెన్షనర్లకు రెండు డిఏలు, ఇతర ప్రయోజనాలు కల్పించడం ప్రకటించడంపై హర్షం



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

**కదిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డిఏలు, ఇతర ప్రయోజనాలు కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ జెఏసి నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ థ్యాంక్యూ సీఎం సాబ్ అంటూ నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆదివారం పట్టణంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ జెఏసి నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర జెఏసి చైర్మన్ విద్యాసాగర్ స్థానిక ఎమ్మెల్యే కందికుంటలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు డిఏల చెల్లింపు, పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు నిర్ణయం, ఉద్యోగ ఆరోగ్య చికిత్సలకు చెల్లింపులో జనవరిలో సరెండర్ లీవ్ నగదు చెల్లింపు, పెన్షనర్లకు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పెంపు తదితర ఉద్యోగ ప్రయోజనాలపై అనుకూల నిర్ణయం ప్రకటించడం అర్షం వ్యక్తం చేస్తూ థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన అన్ని ప్రయోజనాలను బాబు నాయకత్వంలో నెరవేర్చు తారని, అలాగే మంచి పిఆర్‌సిని భవిష్యత్తులో ఉద్యోగులకు అందిస్తారని ఆశిస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్, ఆర్టిసి ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నాయకులు, మున్సిపల్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ టీఏ ఉపాధ్యాయుల సస్పెన్షన్ అన్యాయం

- వైఎస్ఆర్ టీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ రెడ్డి

**నంబులపూలకుంట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**




గంగాధర్ రెడ్డి

ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అని సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో, ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మద్దతును ఉపాధ్యాయులు కోరారు. దీనికి స్పందించిన జగన్, ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంఎల్‌సీలు, ఎంపీలు కేంద్ర విద్యాశాఖ మంత్రితో అపాయింట్ మెంట్ తీసుకున్నారు. ఎంఎల్‌సీలు కల్పలతారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకులు జాలిరెడ్డి, జంషీద్, అశోక్ కుమార్ రెడ్డి, వెంకటనాథరెడ్డి, అమరనాథరెడ్డి, ఎస్‌టీయు కడప జిల్లా అధ్యక్షుడు సంగమేశ్వర రెడ్డి ఢిల్లీకి వెళ్లి టెట్ నుండి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీన్ని ఆధారంగా చేసుకుని ప్రభుత్వం డీఎస్సీలో జరిగిన అవకతవకలపై ఢిల్లీకి వెళ్లారని వెంకటనాథరెడ్డి, అమరనాథరెడ్డి, సంగమేశ్వర రెడ్డిలను సస్పెండ్ చేయడం అన్యాయమని, టెట్ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురమ్మని ఉపాధ్యాయులు కోరితే పట్టించుకోకుండా ఇలా చేయడం అన్యాయమని విమర్శించారు. ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తూ, పీఆర్‌సీ, ఐఆర్, డీఏలు అడగకుండా చేయాలని ఆలోచిస్తున్నట్లు ఉందన్నారు. వీరిపై సస్పెన్షన్ ఎత్తివేయకపోతే ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని తెలియజేశారు.

# నా సొంత బోరు నుంచి గ్రామానికి మంచినీటి సరఫరా

**నంబులపూలకుంట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



ఎంపిడిఓకి వినతిపత్రం అందజేస్తున్న ధర్మానాయుడు

నంబులపూలకుంట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీడీవో పార్థసారథికి ధర్మానాయుడు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మానాయుడు మాట్లాడుతూ.. తన జన్మగ్రామమైన మండెంవారిపల్లి ప్రజలకు ఎలాంటి కరువు పరిస్థితులు ఎదురైనా తన సొంత బోరు నుంచి మంచినీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తిన సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తన బోరు నుంచి నీటిని అందించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నట్లు పేర్కొన్నారు. అయితే నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సహకరించాలని కోరారు. తన సొంత బోరు నుంచి గ్రామ ప్రజలకు నీటి సరఫరా చేస్తున్న విధానాన్ని సంబంధిత అధికారులు ఎప్పుడైనా పరిశీలించవచ్చని ధర్మానాయుడు ఎంపీడీవో పార్థసారథికి వివరించారు. గ్రామ ప్రజలకు అత్యవసర సమయంలో మంచినీరు అందించడమే తన ఉద్దేశమని, దీనిని ఎలాంటి రాజకీయాలకు అతీతంగా లేదన్నారు. సేవా కార్యక్రమంగా భావిస్తున్నానని తెలిపారు.

# ముఖ్యమంత్రికి చెప్పిన హామీని నిలబెట్టుకున్న ఫ్రెండ్స్ ట్రస్ట్

లక్ష ఇరవై వేలతో మహేశ్వరి కుటుంబానికి కిరాణా షాపు

**తలుపుల, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త**



కిరాణా షాపును ప్రారంభిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని పెద్దన్నవారిపల్లి గ్రామానికి గత సంవత్సరం నవంబర్ 1వ తేదీన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు విచ్చేశారు. అదే రోజు ప్రజావేదిక వద్ద ఫ్రెండ్స్ ట్రస్ట్ ఫౌండర్ మన్సూర్ శి4 కార్యక్రమంలో మార్గదర్శిగా భాగ్య స్వాములై సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి వద్ద పెద్దన్నవారిపల్లి గ్రామం చిన్న పల్లిలో నివాసముంటున్న మహేశ్వరి కుటుంబానికి బంగారు కుటుంబం చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది. ఆ వాగ్దానమును ఫ్రెండ్స్ ట్రస్ట్ ఫౌండర్ మన్సూర్ నెరవేరుస్తూ పెద్దన్నవారిపల్లి గ్రామంలోనే ఒక లక్ష ఇరవై వేల రూపాయల వ్యయంతో వారి కుటుంబం ఆర్థికంగా ఎదగాలని కిరాణా షాప్ ఏర్పాటు చేయడం జరిగినది. సామాజిక సేవ అంటే ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాదని ఒక కుటుంబానికి వారి కాళ్ళ మీద వారే ఆర్థికంగా ఎదగాలన్నదే సామాజిక సేవ అని నిరూపించింది ఫ్రెండ్స్ ట్రస్ట్. ప్రజావేదికలో ఇచ్చిన హామీని ఆచరణలో పెట్టి నెరవేర్చిన ఫ్రెండ్స్ ట్రస్ట్ ఫౌండర్ మన్సూర్ కి స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి ఏటీల్ రామ్మోహన ట్రస్ట్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాజీమంత్రి రామచంద్రారెడ్డి 83వ జయంతి వేడుకలు

- తండ్రి చిత్రపటానికి నివాళులర్పించిన మంత్రి సవిత..
- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్, పండ్ల పంపిణీ..



తండ్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సవిత

**పెనుకొండ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

మాజీమంత్రి దివంగత ఎస్. రామచంద్రారెడ్డి 83వ జయంతి వేడుకలను తాడేపల్లిలోని తన కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తన తండ్రి ఎస్. రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి తనకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తన తండ్రి చేసిన సేవలను స్మరించుకున్నారు. ప్రజలకు అండగా నిలవాలని, కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేయాలని తన తండ్రి తనకు నేర్పించారని చెప్పారు. తన తండ్రి చూపిన మార్గంలో నడుస్తూ ప్రజలకు మరింత సేవ చేయడమే తన లక్ష్యమని మంత్రి సవిత పేర్కొన్నారు.

**.పెనుకొండలో ఘన నివాళులు..**

మాజీ మంత్రి ఎస్. రామచంద్రారెడ్డి 83వ జయంతి సందర్భంగా పెనుకొండ నియోజకవర్గంలోని రాంపురం వద్ద ఉన్న ఎస్. రామచంద్రారెడ్డి ఘాట్ వద్ద మంత్రి సవిత భర్త టీడీపీ సీనియర్ నాయకులు,



ఆసుపత్రిలో పాలు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రజాసేవలో ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోగులకు పాలు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎస్. రామచంద్రారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, మాజీ జెడ్పిటిసి నారాయణస్వామి, టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు, కౌన్సిలర్ గీతహనుమంతు, ఎగువగడ్డ కృష్ణమూర్తి, కన్వీనర్లు ఈశ్వర ప్రసాద్, సోమందపల్లి వెంకటేశ్వర్లు, నరహరి, సౌకత్, హుజూర్, బండానూర్, సోము, నంజుండ, చంద్రకాంతమ్మ, లక్ష్మీదేవి, జనసేన మహిళా నాయకురాలు శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల ఏర్పాటుకు ఈ-పోర్టల్ ద్వారా దరఖాస్తు తప్పనిసరి

-ఉరవకొండ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ బి.మహానంది

**ఉరవకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

వినాయక మండపాలు ఏర్పాటుచేసి వినాయక చవితి పండుగను జరుపుకునే ఉత్సవ సమితులు పోలీసులు ప్రారంభించిన ఈ-పోర్టల్ ద్వారా అనుమతులు పొందడం తప్పనిసరి అని ఉరవకొండ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ బి.మహానంది తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.గణేష్‌ఉత్సవ్.నెట్‌లోకి వెళ్లి న్యూ అప్లికేషన్‌పైన క్లిక్‌చేసి మొబైల్ నంబర్, ఓ.టి.పితో నమోదు చేయాలన్నారు. కమిటీ సభ్యుల వివరాలు, స్థలం, విగ్రహం ఎత్తు, ఉత్సవ రోజులు, నిమజ్జనం రూట్ వివరాలు నమోదు చేయాలి ు ఉంటుందన్నారు. బహుళశాఖ బృందం స్థల పరిశీలన చేసి నిబంధనలను తనిఖీ చేస్తుందన్నారు. ఆమోదం లభిస్తే క్యుఆర్ కోడ్‌తో డిజిటల్ ఎన్‌వోసీ జారీ అవుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ తెలియకపోతే పోలీస్ స్టేషన్‌కు వచ్చి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రహదారులు, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా మండపాలను ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని, పర్యావరణ హిత మట్టివిగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం మంచిదని, సౌండ్ సిస్టమ్స్ పరిమితిగానే వినియోగించాలని, డీజేలకు అనుమతి లేదన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఏర్పాటు చేసే మండపాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ బి.మహానంది వివరించారు.



సీఐ బి.మహానంది

# మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటన

**ధర్మవరం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త**

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ సెప్టెంబరు 8, 9 తేదీల్లో ధర్మవరం నియోజకవర్గంలో పర్యటిం చనున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా పలు ముఖ్య కార్యక్రమా ల్లో ఆయన పాల్గొననున్నారు. సెప్టెంబరు 8న ఉదయం 10 గంటలకు ధర్మవరం పట్టణంలోని సి.ఎన్.బి. కళ్యాణ మండపంలో సంస్క ృతి సేవా సమితి సహకారంతో, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారు. మాజీ డీఆర్‌డీఓ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు జి. సతీష్‌రెడ్డితో కలిసి ఆయన కార్యక్రమానికి హాజరుకానున్నారు. సెప్టెంబరు 9న ఉదయం 9 గంటలకు కళాజ్యోతి సర్కిల్ సమీపంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌పై నూతనంగా ఏర్పాటు చేసిన యోగా సెంటర్‌ను మంత్రి ప్రారంభించనున్నారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాధాన్యతను చాటిచెప్పే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఉదయం 10 గంటలకు ధర్మవరం రూరల్ మండలం గొట్లూరు గ్రామంలో నిర్వహించనున్న ఓబీసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారు. ఓబీసీ వర్గాల సంక్షేమం, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సామాజిక, ఆర్థిక అభివృద్ధితో పాటు పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించనున్నారు. మంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది.

7-9pg10.qxd:7-9pg10.qxd 07/09/26 10:58 PM Page 1



## మహిళల జూ. ఆసియా కప్: మలేసియాను

# చిత్తుగా ఓడించిన భారత్



**మోకి :** చైనాలోని మోకిలో జరుగుతున్న ఎహెచ్ఎఫ్ జూనియర్ ఆసియా కప్ 2026లో భారత జూనియర్ మహిళల జట్టు తమ అద్భుతమైన ఆరంభాన్ని కొనసాగిస్తూ, ఆదివారం జరిగిన తమ రెండవ ఎలైట్ పూల్ మ్యాచ్‌లో మలేషియాపై 11-1 తేడాతో ఘన విజయం సాధించింది. ఏడుగురు వేర్వేరు ఆటగాళ్లు గోల్స్ చేయగా, వాటిలో నాలుగు ఫీల్డ్ ప్లే నుండి, ఐదు పెనాల్టీ కార్నర్ల నుండి మరియు రెండు పెనాల్టీ స్ట్రోక్‌ల నుండి వచ్చాయి. తొలి నిమిషంలోనే పూజా సాహూ పెనాల్టీని గోల్‌గా మలచి స్కోరింగ్‌ను ప్రారంభించగా, పూర్ణిమా యాదవ్ (4వ నిముషం) గోల్ చేయడంతో భారత్ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. బినీమా ధన్ (8వ) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచగా, కృష్ణ శర్మ (14వ) మరో గోల్ చేశాడు. రెండవ క్వార్టర్‌లో,పూర్ణిమ (17వ) మళ్ళీ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి తన రెండవ గోల్‌ను పూర్తి చేసింది. తదుపరి సుఖ్‌వీర్ కౌర్ (21వ)గోల్ చేయగా, గీతా యాదవ్ (28వ) గోల్ చేయడంతో భారత్ 7-0 ఆధిక్యంలో నిలిచింది. ఎట్టకేలకు మలేషియా ప్లేయర్ నూర్ మహ్మద్ (38వ) ఏకైక గోల్‌ను సాధించాడు. భారత్‌కు (42వ) మరో పెనాల్టీ లభించగా, పూజ ప్రశాంతంగా దానిని గోల్‌గా మలిచి తన బ్రేస్‌ను పూర్తి చేసుకుంది. ఆ తర్వాత సానికా చంద్రకాంత్ మానే (43వ) గోల్ చేయడంతో, చివరి క్వార్టర్‌లోకి ప్రవేశించే ముందు స్కోరు 9 -1గా నిలిచింది. ఆఖర్లో గీత (53వ) మరో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి మ్యాచ్‌లో తన రెండో గోల్ సాధించగా, సానికా (58వ) మరోసారి గోల్ చేసి 11-1 తేడాతో ఘన విజయాన్ని పూర్తి చేసింది.

## పురుషుల వాలీబాల్ ఛాంపియన్‌షిప్..

# ఇరాన్ చేతిలో భారత్ ఓటమి




**జపాన్:** ఏవీసీ పురుషుల వాలీబాల్ ఛాంపియన్‌షిప్ 2026లో రెండో గ్రూప్ మ్యాచ్‌లో ఇరాన్ చేతిలో భారత్ ఓటమి చెందింది. జపాన్‌లోని ఫుయోకాలో ఆదివారం జరిగిన వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల వాలీబాల్ జట్టు వరుసగా రెండో ఓటమిని చవిచూసింది. నాలుగుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఇరాన్ చేతిలో 20-25, 26-28, 18-25 తేడాతో ఓటమి పాలైన భారత జట్టు గ్రూప్ దశలో నాలుగో స్థానానికి పడిపోవడంతో, రెండో దశకు అర్హత సాధించడం మరింత కష్టమైంది. 12 జట్ల టోర్నమెంట్ మొత్తం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన 8 జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. బలమైన ఇరాన్‌పై ఒక్క సెట్ కూడా గెలవడంలో భారత్ మరోసారి విఫలమవడంతో, జపాన్‌లో భారత్‌కు కష్టతరమైన ప్రయాణం కొనసాగింది. ఇరాన్ పటిష్టమైన రక్షణను ప్రదర్శించి భారత దాడి ఆటగాళ్లను కట్టడి చేసింది. ఇరాన్ జట్టు 16 కచ్చితమైన బ్లాక్‌లను నమోదు చేయగా, వాటిలో మిడిల్ బ్లాకర్ మహమ్మద్ వాలిజాదే ఐదు బ్లాక్‌లు చేశాడు. కాగా, భారత్ మ్యాచ్ మొత్తంలో కేవలం ఐదు బ్లాక్‌లను మాత్రమే చేయగలిగింది. చైనాతో జరిగిన గత మ్యాచ్ మాదిరిగానే, రెండో సెట్‌లో 22-19 ఆధిక్యంలో ఉన్న భారత్‌కు అవకాశాలు లభించినప్పటికీ, డ్యూస్‌కు నెట్టబడటంతో వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. జట్టు తదుపరి మంగళవారం నాడు తప్పక గెలవాల్సిన ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడనుంది. ముందంజ వేసే అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే భారత్‌కు న్యూజిలాండ్‌పై స్ట్రెయిట్ సెట్స్‌లో విజయం అవసరం కావచ్చు.




## డైమండ్ లీగ్‌లో

# రుమేష్‌కు టైటిల్

### గాయంతో భారత్ అథ్లెట్ నీరజ్ నిష్క్రమణ

**బ్రస్సెల్స్:** శ్రీలంక జావెలిన్ త్రోయర్ రుమేష్ తరంగ పతిరాగే ఆదివారం డైమండ్ లీగ్ టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించారు. ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్‌గా నిలిచాడు. ఈ సీజన్ ఆయన కెరీర్‌లో ఒక అద్భుతమైన పురోగతికి నాంది పలికింది. ప్రపంచ నంబర్ 1 ర్యాంకర్ అయిన 23 ఏళ్ల ఈ క్రీడాకారుడు ఫైనల్‌లో తన మూడో ప్రయత్నంలో 89.04 మీటర్ల భారీ త్రో విసిరి విజయం సాధించాడు. పోలాండ్‌కు చెందిన డేవిడ్ వెగ్నర్ 87.47 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో రెండవ స్థానంలో నిలవగా, ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన మాజీ ఒలింపిక్ ఛాంపియన్ కెషోర్న్ వాల్కాట్ ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శన అయిన 83.99 మీటర్లతో మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. గ్రెనడాకు చెందిన రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ ఆండర్సన్ పీటర్స్ 83.70 మీటర్లతో నాలుగవ స్థానంలో నిలిచాడు. అద్భుతమైన ప్రదర్శన తర్వాత పతిరాగే సర్క్యూట్ లీడర్‌గా ఫైనల్‌కు చేరుకున్నాడు.

రబాట్‌లో తన తొలి ప్రదర్శనలో రెండవ స్థానంలో నిలిచిన అతను, ఐదు డైమండ్ లీగ్ ప్రదర్శనలలో నాలుగు విజయాలు నమోదు చేశాడు. ఇక 2022 డైమండ్ లీగ్ ఛాంపియన్ అయిన భారతదేశానికి చెందిన నీరజ్ చోప్రా, ఓవరాల్ స్టాండింగ్స్‌లో ఆరో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు, కానీ శిక్షణ సమయంలో చీలమండ స్నాయువు చిరగడంతో మిగిలిన సీజన్‌కు దూరమయ్యాడు, దీంతో అతను పోటీలో పాల్గొనలేదు.

## చైనా మాస్టర్స్‌లో

# సత్విక్-చిరాగ్ జోడీకి టైటిల్




**షెన్‌జెన్ (చైనా):** చైనా మాస్టర్స్‌లో సత్విక్‌చిరాగ్ ఈ ఏడాది సత్తా చూపించారు. భారత స్టార్ డబుల్స్ జోడీ సత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టిలు ఆదివారం షెన్‌జెన్‌లో జరిగిన 2026 చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఆతిథ్య జట్టుకు చెందిన హే జిటింగ్-రెన్ జియాంగ్యు జంటపై, ఈ ద్వయం ఒక గంట 10 నిమిషాల పాటు జరిగిన ఉత్కంఠ భరితమైన మూడుగేమ్‌ల పోరులో 11-21, 21-13, 21-17 స్కోరుతో పునరాగమనం చేసి విజయం సాధించింది. చైనా జంటపై తమ అజేయ రికార్డును కొనసాగించి, హెడ్‌టుహెడ్ ఆధిక్యాన్ని 3-0కి పెంచుకున్నారు. చైనా జంట మ్యాచ్‌ను బలంగా ప్రారంభించి, మొదటి ఐదు పాయింట్లను వరుసగా గెలుచుకుని 11-5తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించి తొలి గేమ్‌ను సునాయాసంగా ముగించారు. రెండవ గేమ్‌లో, సత్విక్-చిరాగ్ జోడీ దూకుడుగా షాట్లు ఆడుతూ, ఆధిక్యాన్ని అందుబాటులో ఉంచుకుంటూ మెరుగైన ఆరంభాన్ని అందుకొని, విరామ సమయానికి 11-7 ఆధిక్యాన్ని నెలకొల్పింది. నాణ్యమైన షాట్లతో ఆటపై ఆధిపత్యం చెలాయించి, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీశారు. చివరి 15 పాయింట్లలో 10 పాయింట్లను గెలుచుకున్నారు. నిర్ణయాత్మక గేమ్‌లో, చైనా జోడి మరోసారి బాగా ప్రారంభించి 7-4 ఆధిక్యం సాధించింది. అయితే, భారత్ జోడీ వారిని ఆధిక్యం పెంచుకోకుండా అడ్డుకున్నారు. అయినప్పటికీ, చైనా ద్వయం 11-9 స్వల్ప ఆధిక్యంతో చివరి ఎండ్స్‌లో ప్రవేశించి స్మాష్‌లతో ఆధిక్యాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నించారు.

అయితే, సత్విక్-చిరాగ్ జోడీ ఒత్తిడిని కొనసాగించినా, చివరకు చైనా ఆటగాడి రిటర్న్ బేస్‌లైన్‌ను దాటి వెళ్లడంతో స్కోరును 16-16తో సమం చేశారు. ఆ తర్వాత, చైనా జోడీ తడబడి, అనేక అనవసర తప్పిదాలు చేయడంతో, భారత్ ద్వయం చివరి ఐదు పాయింట్లు గెలుచుకుని మ్యాచ్‌ను సునాయాసంగా ముగించి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు.



## యుఎస్ ఓపెన్.. డబుల్స్‌లో భాంబ్రి, అనిరుధ్

# డబుల్స్ జోడీ నిష్క్రమణ

**న్యూయార్క్:** భారత స్టార్ ఆటగాడు యూకీ భాంబ్రి, అతని న్యూజిలాండ్ భాగస్వామి మైఖేల్ వీనస్ న్యూయార్క్‌లో జరిగిన 2026 యూఎస్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే ఓటమి చవిచూశారు. అలాగే మరో భారత్ ప్లేయర్ అనిరుద్ చంద్రశేఖర్-ఇవాన్ లియుటారెవిచ్ జోడీ కూడా పరాజయం చవిచూశారు. అమెరికాకు చెందిన ర్యాన్ సెగర్‌మాన్, పాట్రిక్ ట్రహాక్ జోడీతో గంటా 44 నిమిషాల పాటు హోరాహోరీగా జరిగిన పోరులో యూకీ-మైఖేల్ జంట 6-7, 6-7 తేడాతో వరుస సెట్లలో ఓడిపోయింది. రెండు జంటలూ మొదటి సెట్‌లో పటిష్టమైన సర్వింగ్‌తో, బ్రేక్‌లు లేకుండా బలంగా ప్రారంభించి, టైబ్రేకర్‌కు దారితీశాయి. టైబ్రేకర్‌లో అమెరికన్ జంట ఆ సెట్‌ను కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో, ఇండోకివీ జోడి పుంజుకుని, ప్రత్యర్థి సర్వ్‌ను బ్రేక్ చేసి 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది, కానీ ఏడవ గేమ్‌లో వారు తమ సర్వ్‌ను కోల్పోవడంతో ఆ ఆధిక్యం రద్దయింది. దీంతో మ్యాచ్‌లో మరో టైబ్రేకర్ అనివార్యమైంది, అందులో కూడా అమెరికన్ జోడి పైచేయి సాధించి 7-3 తేడాతో గెలిచి, మ్యాచ్‌ను స్ట్రెయిట్ సెట్స్‌లో కైవసం చేసుకుంది.

ఇదిలా ఉండగా, భారత ఆటగాడు అనిరుధ్ చంద్రశేఖర్, అతని బెలారస్ భాగస్వామి ఇవాన్ లియుటారెవిచ్ కూడా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. హోరాహోరీగా సాగిన మూడు సెట్ల పోరులో బ్రిటన్‌కు చెందిన ఆర్థర్ ఫెరీ, జాషువా పారిస్ జోడీ చేతిలో 4 -6, 7-5, 4-6 తేడాతో వారు ఓడిపోయారు. దీంతో, 2026 యూఎస్ ఓపెన్‌లో ఇప్పుడు శ్రీరామ్ బాలాజీ మాత్రమే మిగిలిన ఏకైక భారతీయుడుగా నిలిచాడు.

## వార్ ఎఫెక్ట్, ముడిచమురు..

# ద్రవ్యోల్బణ డేటా కీలకం

### వచ్చే వారం మార్కెట్లకు ఇవే ఆధారం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు, ముడిచమురు ధరల కదలికలు, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్లను ప్రధానంగా ప్రభావితం చేయనున్నాయని మార్కెట్ నిపుణుల అంచనా. విదేశీ ఇన్వెస్టర్ల ట్రేడింగ్ కార్యకలాపాలు, అంతర్జాతీయ మార్కెట్ల ధోరణులు కూడా భారత ఈక్విటీ మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. ప్రపంచ ద్రవ్య విధానాలు, ముడిచమురు ధరలు, భౌగోళిక రాజకీయ పరిణామాల కారణంగా ఈ వారం మార్కెట్లు అత్యంత సున్నితంగా ఉండే అవకాశం ఉంది. అంచనాలను మించిన అమెరికా ఉపాధి గణాంకాలు వెలువడిన నేపథ్యంలో, సెప్టెంబర్‌లో ఫెడరల్ రిజర్వ్ తీసుకునే నిర్ణయంపై వాటి ప్రభావాన్ని ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలిస్తారని రిలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు.దేశీయంగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడుల ప్రవాహాలు, రూపాయి మారకం విలువ, ముడిచమురు ధరలు, దేశీయ లిక్విడిటీ పరిస్థితులను ఇన్వెస్టర్లు గమనిస్తారని ఆయన చెప్పారు.హార్ముజ్ జలసంధిలో చోటుచేసుకునే పరిణామాలు కూడా అత్యంత కీలకమైన అంశంగా మారనున్నాయని మిశ్రా పేర్కొన్నారు. ఈ పరిణామాలు భారత్‌లో ద్రవ్యోల్బణం, బాహ్య చెల్లింపుల సమతుల్యత, కంపెనీల లాభదాయకతపై ప్రభావం చూపే అవకాశం ఉందని వివరించారు. ఎన్‌రిచ్ మనీ సిఇఒ పొన్ముడి ఆర్. మాట్లాడుతూ, అమెరికా ఇరాన్ మధ్య మళ్లీ తీవ్రత పెరగడం, హోర్ముజ్ జలసంధికి సంబంధించిన ఆందోళనలు ప్రపంచ ఇంధన మార్కెట్లలో భౌగోళిక రాజకీయ రిస్క్ ప్రీమియాన్ని పెంచాయని తెలిపారు. దీంతో గత వారంలో బ్రెంట్ క్రూడ్ ధర 8 శాతానికి పైగా, డబ్ల్యూటీఐ క్రూడ్‌ధర 9శాతానికి పైగా పెరిగిందన్నారు.

అంచనాలకుమించిన తాజా అమెరికా ఉద్యోగ గణాంకాలు ఆర్థికవ్యవస్థలో అంతర్లీన వృద్ధి బలంగా కొనసాగుతున్నట్లు సూచిస్తున్న నేపథ్యంలో, ఇప్పుడు వెలువడనున్న అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై మార్కెట్ల దృష్టి ఉంటుందని హెచ్ఎస్‌టి వెల్త్ వ్యవస్థాపకుడు, సిఇఒ హరిశెల్వన్ రాధాకృష్ణన్ తెలిపారు.

## ఈక్విటీలనుంచి రూ.8731కోట్లపెట్టుబడులు వెనక్కి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6:** విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు ఈనెల 4తో ముగిసిన వారంలో భారత ఈక్విటీల్లో ఎక్కువ విత్‌డ్రాచేసారు. మొత్తం రూ.8,731.33 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో వరుసగా రెండు నెలల పాటు కొనుగోళ్లు జరిపిన అనంతరం ఎఫ్‌పీఐలు మళ్లీ విక్రయాల బాట పట్టారు. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ గణాంకాల ప్రకారం గత వారం ఐదు ట్రేడింగ్ సెషన్లలో మూడు సెషన్లలో ఎఫ్ఐఐలు ఎక్కువ విత్‌డ్రాచేసారు. ఆగస్టు 31న జరిగిన త్రైమాసిక ఎంఎస్‌సిఐ ఇండెక్స్ రీబ్యాలెన్సింగ్ సెషన్ కూడా ఇందులో ఉంది. అదే సమయంలో దేశీయ సంస్థాగత మదుపుదారులు మొత్తం ఐదు సెషన్లలోనూ నికర కొనుగోలుదారులుగా ఉన్నారు'అని బజాజ్ బ్రోకింగ్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్‌రిసెర్చ్ పబిత్రో ముఖర్జీ తెలిపారు.ప్రపంచ చమురు ధరల పెరుగుదలతో పాటు అమెరికాఇరాన్ మధ్య మారుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా మార్కెట్లలో అస్థిరత నెలకొందని ఆయన పేర్కొన్నారు.ఎఫ్‌పీఐల విక్రయాల్లో అత్యధికంగా సెప్టెంబర్ 1న రూ.5,432.83 కోట్ల విలువైన షేర్లను నికరంగా విక్రయించారు. అనంతరం సెప్టెంబర్ 3న రూ.953.84 కోట్లు, సెప్టెంబర్ 4న రూ.2,820.66 కోట్ల మేర విక్రయాలు జరిగాయి. సెప్టెంబర్ 2న ఎఫ్‌పీఐలు బయ్యర్లుగా మారి రూ.1,764.20 కోట్ల పెట్టుబడులు పెట్టారు. అంతకుముందు ఆగస్టు 31న వారపు ట్రేడింగ్ ప్రారంభమైన రోజే రూ.1,288.20 కోట్ల నికర ఉపసంహారణ జరిగింది. ఎన్ఎస్‌డీఎల్ ట్రాక్ చేసే అన్ని ఆస్తి విభాగాలను పరిగణనలోకి తీసుకుంటే ఈక్విటీలు, డెట్, హైబ్రిడ్ ఇన్‌స్ట్రుమెంట్లు, మ్యూచువల్ ఫండ్లు, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్లు (ఏఐఎఫ్‌లు) ఎఫ్‌పీఐలు వారంలో మొత్తం రూ.11,620.81 కోట్ల నికర విత్‌డ్రాలు చేశారు.

డెట్ విభాగంలో ఎఫ్‌పీఐల నికరంగా రూ.443.80 కోట్లువిత్‌డ్రాఅయితే జనరల్ లిమిట్ విభాగంలో రూ.311.51 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. వాలంటరీ రిటెన్షన్ రూట్ (వీఆర్ఆర్) నుంచి రూ.15.99 కోట్లు, ఫుల్లీ యాక్సెసిబుల్ రూట్ (ఎఫ్ఏఆర్) నుంచి రూ.739.32 కోట్ల పెట్టుబడులు వెనక్కిపోయాయి.హైబ్రిడ్ ఇన్‌స్ట్రుమెంట్ల విభాగంలో వారానికి రూ.2,545.15 కోట్ల నికర ఔట్‌ఫ్లో నమోదైంది. ముఖ్యంగా సెప్టెంబర్ 3న ఒక్కరోజే రూ.3,451.63 కోట్ల భారీ ఉపసంహారణ జరిగింది.మ్యూచువల్ ఫండ్లు విభాగంలో రూ.99.47 కోట్ల నికర ఇన్‌ఫ్లో నమోదైంది.

# 11 ఐపిఒలతో 7055 కోట్లు సమీకరణ టార్గెట్




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** భారత ప్రైమరీ మార్కెట్‌లో మరోసారి ఐపిఒల సందడి నెలకొననుంది. మొత్తం 11 మెయిన్‌బోర్డ్ కంపెనీలు ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపిఒ)ల ద్వారా రూ.7,055 కోట్లను సమీకరించేందుకు సిద్ధమయ్యాయి. ఈ ఐపిఒలు ఈనెల 7 నుంచి 15 మధ్య మార్కెట్‌లోకి రానున్నాయి. వీటిలో ఎక్కువ భాగం మంగళవారం, బుధవారం సబ్‌స్క్రిప్షన్‌కు వస్తాయి. లిస్టింగ్ సమయానికి ఈ కంపెనీలన్నింటి మార్కెట్ క్యాపిటలైజేషన్ 1 బిలియన్ డాలర్ల కంటే తక్కువగా ఉండనుండటంతో, ప్రారంభ దశలోనే వృద్ధి సామర్థ్యం ఉన్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారని ఎస్ సెక్యూరిటీస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ రాజ్‌కుమార్ రాథీ తెలిపారు. ఒకేసారి ఇన్ని కంపెనీలు ఐపీఓలకు రావడం ప్రైమరీ మార్కెట్‌లో ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోందన్నారు.రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ఇంజినీరింగ్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థలు, పేమెంట్స్ మరియు ఐడెంటిటీ సొల్యూషన్స్ సంస్థ, స్పెషాలిటీ కెమికల్స్ తయారీదారు, ఆన్‌లైన్ రెంటల్ ప్లాట్‌ఫామ్ తదితర రంగాలకు చెందిన కంపెనీలు ఈసారి మార్కెట్‌ను ఆశ్రయిస్తున్నాయి.మొత్తం రూ.7,055 కోట్లలో రూ.2,722 కోట్లు (39 శాతం) కంపెనీలకు నేరుగా వెళ్లే ఫ్రెష్ ఇష్యూ ద్వారా సమీకరిస్తారు. మరో రూ.4,333 కోట్లు (61 శాతం) ఇప్పటికే ఉన్న వాటాదారులు తమ వాటాలను విక్రయించడం అంటే ఒఎఫ్ఎస్ ద్వారా సమీకరించనున్నారు. ఇది భారత ప్రైమరీ మార్కెట్‌పై కార్పొరేట్ సంస్థలకు ఉన్న బలమైన విశ్వాసాన్ని, మార్కెట్‌లో అందుబాటులో ఉన్న సమృద్ధిగా ఉన్న లిక్విడిటీని ప్రతిబింబిస్తోందని రాథీ పేర్కొన్నారు.ఫ్రెష్ ఇష్యూల ద్వారా సమీకరించిన నిధులను ప్రధానంగా వ్యాపార విస్తరణ, మూలధన వ్యయాలు, రుణాల చెల్లింపు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, ఇతర సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తారు.సెప్టెంబర్ ఇప్పటికే రేస్ ఆఫ్ బిలీఫ్, దీపా జ్యువెలర్స్ సంస్థలు తమ ఐపిఒలను ప్రారంభించాయి. వీటితో కలిపి 2026లో ఐపిఒలకు వచ్చిన కంపెనీల సంఖ్య 75కు చేరనుంది. ఈ నేపథ్యంలో 11 కంపెనీల్లో ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ 7న పబ్లిక్ సబ్‌స్క్రిప్షన్‌కు తెరుచుకోనుంది. రూ.351 కోట్లకు పైగా విలువైన ఈ ఇష్యూ 9న ముగుస్తుంది. 8న కనోహార్ ఎలక్ట్రికల్స్, ప్రసోల్ కెమికల్స్, గ్లాస్ వాల్ సిస్టమ్స్ (ఇండియా) ఐపిఒలు ప్రారంభమవుతాయి. సెప్టెంబర్ 9న రెంటోమోజో, మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్, ఆర్సిల్, ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్, కరమ్తారా ఇంజినీరింగ్, స్టీమ్‌హౌస్ ఇండియా ఐపీఓలు ప్రారంభమవుతాయి. 10న వీగాలాండ్ డెవలపర్స్ ఐపిఒ ప్రారంభమవుతుంది. ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్: ఒక్కో షేరుకు రూ.118-124 ధర శ్రేణిని నిర్ణయించింది.కనోహార్ ఎలక్ట్రికల్స్ రూ.1,056 కోట్ల ఐపీఓకు ఒక్కో షేరుకు రూ.601-632 ధర శ్రేణిని నిర్ణయించింది.ప్రసోల్ కెమికల్స్ రూ.500 కోట్ల ఐపీఓకు రూ.643-676 ధర శ్రేణిని నిర్ణయించింది. గ్లాస్ వాల్ సిస్టమ్స్ (ఇండియా): రూ.428 కోట్ల ఐపీఓకు ఒక్కో షేరుకు రూ.172-182 ధర శ్రేణిని నిర్ణయించింది.రెంటోమోజో: రూ.1,256 కోట్ల ఐపీఓకు ఒక్కో షేరుకు రూ.384-404 ధర శ్రేణిని నిర్ణయించింది. కరమ్తారా ఇంజినీరింగ్ రూ.875 కోట్ల ఐపీఓలో ధరలు రూ.241-254గా ఉంటాయి. మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ రూ.805 కోట్ల ఐపీఓకు ఒక్కో షేరుకు రూ.322-339 ధర శ్రేణిని నిర్ణయించింది. ఆర్సిల్: రూ.733 కోట్ల ఐపీఓకు ఒక్కో షేరుకు రూ.132-139 ధర శ్రేణిని నిర్ణయించింది. ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ రూ.427 కోట్ల ఐపీఓకు ఒక్కో షేరుకు రూ.139-146 ధర శ్రేణిని నిర్ణయించింది. స్టీమ్‌హౌస్ ఇండియా రూ.414 కోట్ల ఐపిఒకు వస్తుంటే వీగాలాండ్ డెవలపర్స్ షేర్ల జారీ ద్వారా రూ.210 కోట్లను సమీకరించనుంది.

## పశ్చిమాసియా వార్‌తో ఆహారోత్పత్తుల


# ధరలకు మళ్లీ రెక్కలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** నాలుగేళ్ల తర్వాత గరిష్ఠ స్థాయికి ఎఫ్ఏఓ ఆహార ధరల సూచీ చేరింది. తీవ్ర వాతావరణ పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య మార్గాల్లో నిరంతర అంతరాయాల కారణంగా కీలక వ్యవసాయ ఉత్పత్తుల సరఫరాపై ఆందోళనలు పెరగడంతో ఆహార ధరలు 2022 చివరి నాటి గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఐక్యరాజ్యసమితి పరిధిలోని అంతర్జాతీయంగా వర్తకం జరిగే వివిధ ఆహార ఉత్పత్తుల ధరల్లో నెలవారీ మార్పులను పర్యవేక్షించే ఎఫ్ఏవో ఆహారోత్పత్తుల సూచీ ఆగస్టులో సగటున 133.3 పాయింట్లకు చేరుకుంది. జూలైలో నమోదైన సవరించిన 130.8 పాయింట్లతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల.ధాన్యాల ధరల సూచీ ఆగస్టులో గత నెలతో పోలిస్తే 2.2 శాతం పెరిగి, 2024 మే తర్వాత అత్యధిక స్థాయికి చేరింది. వంటనూనెల ధరల సూచీ కూడా 0.6 శాతం పెరిగి, 2022 జూన్ తర్వాత గరిష్ఠ స్థాయిని తాకింది.ఆగస్టు సూచీ 2022 నవంబర్ తర్వాత అత్యధికమైనదిగా నమోదైంది. అయితే 2022 మార్చిలో రష్యా ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి దాడి ప్రారంభించిన తర్వాత నమోదైన రికార్డు స్థాయితో పోలిస్తే ఇప్పటికీ దాదాపు 17 శాతం తక్కువగానే ఉంది.ఎఫ్ఏవో ప్రధాన ఆర్థికవేత్త మాక్సిమో టొరెరో మాట్లాడుతూ ప్రపంచ ఆహార ధరలలో ఆగస్టు పెరుగుదల ఆహార మార్కెట్లలో సరఫరా ప్రమాదాల ప్రభావం మళ్లీ పెరుగుతోందనడానికి హెచ్చరిక అని అన్నారు. వాతావరణ విపత్తులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య రవాణా వ్యవస్థల్లో అంతరాయాలు ఒకేసారి చోటుచేసుకోవడం వల్ల సరఫరాపై అంచనాలు కఠినంగా మారుతున్నాయనిపేర్కొన్నారు. ఆగస్టులో ధాన్యాలు,వంటనూనెలు, చక్కెర, మాంసం, పాల ఉత్పత్తులు అన్ని ప్రధాన ఆహార విభాగాల ధరలు పెరిగాయి. ధాన్యాల ధరలు మూడేళ్ల గరిష్ఠానికి చేరుకోగా, చక్కెర ధరలు యేడాదికిపైగా కాలంలో అత్యధిక స్థాయికి చేరాయి.ప్రధాన ఆహార విభాగాల్లో చక్కెర ధరలే అత్యధికంగా 11.9 శాతం పెరిగాయి. దీంతో చక్కెర బెంచ్‌మార్క్ ధర 2025 జూన్ తర్వాత అత్యధిక స్థాయికి చేరింది. బ్రెజిల్‌లోని కీలక సెంటర్‌సౌత్ ప్రాంతంలో ఉత్పత్తి తగ్గడం, యూరప్, ఆసియాలో ప్రతికూల వాతావరణ పరిస్థితులపై ఆందోళనలు చక్కెర ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. వాతావరణం, యుద్ధాలతో సరఫరాకు దెబ్బూరప్‌లో తీవ్ర ఉష్ణోగ్రతలు, కరువు పరిస్థితులు మొక్కజొన్న, షుగర్ బీట్ పంటల దిగుబడులతో పాటు పశుసంపద ఉత్పత్తిపైనా ఆందోళనలు పెంచాయి.

## ఆర్థిక పరిస్థితులవల్లే జెట్ ఎయిర్‌వేస్

# సంక్షోభం: నరేశ్ గోయల్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** జెట్ ఎయిర్‌వేస్‌లో తలెత్తిన ఆర్థిక సంక్షోభానికి ప్రతికూల స్థూల ఆర్థిక పరిస్థితులే కారణమని, తన వైపు ఎలాంటి మోసపూరిత చర్యలు జరగలేదని సంస్థ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్ కోర్టుకు సమర్పించిన డిశ్చార్జ్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈ పిటిషన్‌ను వ్యతిరేకించింది. గోయల్ ఒక వ్యవస్థీకృత మోసానికి రూపకల్పన చేసి, దేశంలోని ప్రముఖ విమానయాన సంస్థను ఆర్థికంగా కుప్పకూలేలా చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను మోసం చేసి, సంక్లిష్టమైన అంతర్జాతీయ మనీలాండరింగ్ నెట్‌వర్క్ ద్వారా తనకు, తన కుటుంబానికి లబ్ధి చేకూర్చుకున్నారని ఆరోపించింది. 2019లో జెట్ ఎయిర్‌వేస్‌కు ఇచ్చిన రుణాల్లో రూ.538.62 కోట్లను దారి మళ్లించి మనీలాండరింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలపై ఇడి గోయల్‌ను 2023 సెప్టెంబర్‌లో అరెస్టు చేసింది.ప్రస్తుతం వైద్య కారణాలతో బెయిల్‌పై ఉన్న 77యేళ్ల గోయల్ జెట్ ఎయిర్‌వేస్ తన నియంత్రణకు అతీతమైన ప్రతికూల స్థూల ఆర్థిక పరిస్థితుల కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుందని తెలిపారు. విమాన ఇంధన ధరలు భారీగా పెరగడం, విదేశీ మారకద్రవ్య మార్కెట్లలో అస్థిరత, తీవ్రమైన పోటీ వంటి అంశాలు సంస్థ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీశాయని పేర్కొన్నారు.పెరుగుతున్న ఆర్థిక బాధ్యతలను తీర్చలేని పరిస్థితుల్లో 2019 ఏప్రిల్‌లో విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చిందని పిటిషన్‌లో తెలిపారు. అయితే ఈ పరిస్థితికి పూర్తిగా ప్రతికూల మార్కెట్ పరిస్థితులే కారణం. దరఖాస్తుదారు (గోయల్) లేదా సంస్థ యాజమాన్యంలోని ఇతర సభ్యుల ఎలాంటి మోసపూరిత చర్యల వల్ల ఇది జరగలేద అని పేర్కొన్నారు. జెఐఎల్ ఆర్థిక సంక్షోభం వాణిజ్య, విమానయాన రంగ పరిస్థితుల ఫలితమే తప్ప మనీలాండరింగ్‌కు ఆధారం కాదని గోయల్ స్పష్టం చేశారు. టికెట్ల విక్రయాలు, కొత్త మార్కెట్ల విస్తరణ కోసం జీఎస్ఎల సేవలను వినియోగించడం విమానయాన రంగంలో సాధారణ విధానమేనని పిటిషన్‌లో పేర్కొన్నారు. జీఎస్ఏలకు సంబంధించిన అన్ని చెల్లింపులను జెఐఎల్ బోర్డు ఆమోదించిందని, వాటిని ఆర్థిక నివేదికల్లో వెల్లడించామని తెలిపారు. కెనరా బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.538.62 కోట్ల రుణాన్ని దారి మళ్లించారన్న ఆరోపణపైనా గోయల్ వివరణ ఇచ్చారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot No. B-11, B-12, Industrial Estate, Anantapur.-515004. Phone:9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No.70088/97. Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.No. HSD/337/18-20 Air Surcharge: Delhi: 40 Ps.